
శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180

నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

### 20న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 20వ తేదీన జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఉదయం 9.30 గంట లకు మంత్రివర్గం భేటీ కానుంది. మంత్రివర్గ సమావేశానికి సంబంధించిన సమాచారాన్ని తెలియజేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం సర్క్యులర్ జారీ చేశారు. రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందు దానికి మంత్రివర్గ ఆమోదం తెలపడం ఈ సమావేశం ప్రధాన అజెండాగా తెలుస్తోంది.

సంపుటి 28, సంచిక: 264 | బుధవారం | 18-03-2026 | హైదరాబాద్

Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar

పేజీలు: 12 | వెల రూ. 5.00

## బిసి రిజర్వేషన్లపై
# నాన్చుడొద్దు

శాసన మండలిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో కేంద్ర ప్రభుత్వ వైఖరిపై సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మండిపాటు



- బిసిలు అన్నిరంగాల్లో నష్టపోతున్నారని, వివక్షకు గురవుతున్నారని ఆందోళన
- ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్
- రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలుచేయాలని విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

బిసిలు అన్ని రంగాలలో నష్టపోతున్నారని, తీవ్రమైన వివక్షకు గురవుతున్నారని సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం ఆవేదన వ్యక్తం చేశారు. శాసనమండలిలో మంగళవారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో సత్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసి రిజర్వేషన్‌ల విషయంలో కేంద్ర ప్రభుత్వం నాన్చుడు ధోరణితో రిజర్వేషన్‌ల అంశం ముందుకు కొనసాగడం లేదన్నారు. ఫలితంగా జనాభాలో 52 శాతం ఉన్న బిసిలకు రిజర్వేషన్‌లు అమలు కాకపోవడంతో అన్ని రంగాలలో వెనకబడిపోతున్నారని తెలిపారు. బిసిల రిజర్వేషన్‌ల విషయంలో కేంద్ర ప్రభుత్వం తర్వతిగతిన నిర్ణయం తీసుకుని, బిసి రిజర్వేషన్‌లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**ఆర్‌టిసి కార్మికులకు తీవ్ర అన్యాయం**

కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయంలో ఆర్‌టిసి కార్మికులు తీవ్ర అన్యాయానికి గురయ్యారని, అప్పట్లో 59 రోజుల పాటు సమ్మె జరిపారని సత్యం గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీనిచ్చిందని, ఆ హామీని ఎన్నికల మేనిఫెస్టోలో కూడా పొందుపర్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు గడుస్తున్నప్పటికీ ఆర్‌టిసి కార్మికుల సమస్యలు పరిష్కారం కాలేదని తరువాయి 2లో


## వడ్డీ లేని రుణాలు ఇచ్చినట్లు నిరూపిస్తే
# రాజీనామా చేస్తా

## ప్రభుత్వానికి కెటిఆర్ సవాల్
## రూ.57వేల కోట్లు జమచేశాం : భట్టి



- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో వాదోపవాదాలు

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్రంలో ఇప్పటి వరకు వడ్డీ లేని రుణాల కింద రూ.57 వేల కోట్లను మహిళల ఖాతాలలో జమ చేశామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన వడ్డీ లేని రుణాలను తాము క్లియర్ చేస్తున్నామని, ఐదేళ్లలో లక్ష కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాల లక్ష్యాన్ని పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఉభయ సభలను ఉద్దేశించి 'గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు' తెలిపే తీర్మానంపై మంగళవారం శాసనసభలో జరిగిన చర్చలో బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ కె.టి.రామారావు వడ్డీ లేని రుణాల అంశాన్ని ప్రస్తావించారు. మహిళలకు రూ.57 వేల కోట్ల వడ్డీలేని రుణాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినట్టు ఉత్తర్వులు చూపిస్తే తాను రాజీనామా చేసి ఇక్కడి (అసెంబ్లీ) నుంచే వెళ్లిపోతానని, వడ్డీ లేని రుణాలు ఇవ్వకపోతే డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వడ్డీ లేని రుణాల పెండింగ్ నిధులను చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. దీనిపై భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ధనసరి అనసూయ సీతక్క స్పందించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ 'మీరు'(బిఆర్‌ఎస్) ఎన్ని అడ్డంకులను సృష్టించినా వడ్డీ లేని రుణాలు ఇచ్చి తీరుతామన్నారు. రైతుల శ్రమను గుర్తించి సన్న ధాన్యం పండించిన రైతులకు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్‌ను రైతుల ఖాతాలలో వేస్తున్నామని, రైతు భరోసా కింద తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్ల నిధులను వారి ఖాతాలలో జమ చేశామన్నారు. వడ్డీ లేని రుణాల కింద స్వయం సహాయక సంఘాల మహిళలకు సంవత్సరానికి రూ.20 వేల కోట్లకు పైగా వారి ఖాతాల్లో తరువాయి 2లో

సిఎం సంతకం చేసిన ఆ ఆరు గ్యారంటీల దస్త్రం 03 ఎటుపోయింది?



మొయినాబాద్ డ్రగ్స్ కేసులో
## సిట్ ఏర్పాటు

- తొమ్మిది మంది పోలీసు అధికారులతో రూపకల్పన
- నేతృత్వం వహించనున్న చేవెళ్ల డిసిపి యోగేశ్‌గౌతమ్

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన మొయినాబాద్ ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసులో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కేసు తీవ్రత దృష్ట్యా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసింది. మొత్తం 9 మంది పోలీసు అధికారులతో ఈ సిట్‌ను రూపొందించగా, చేవెళ్ల డిసిపి యోగేష్ గౌతమ్ నేతృత్వం అప్పగించారు.ఈ కేసులో డ్రగ్స్ వినియోగం, గన్ ఫైరింగ్, ప్రముఖుల ప్రమేయం వంటి ఆరోపణలు వెలుగులోకి రావడంతో ప్రభుత్వం దర్యాప్తును మరింత లోతుగా తీసుకెళ్లాలని నిర్ణయించింది. డ్రగ్స్ సరఫరా మార్గాలు, పార్టీలో పాల్గొన్నవారి పాత్ర, అంతర్జాతీయ లింకులు ఉన్నాయా అన్న అంశాలపై సిట్ ప్రత్యేకంగా దృష్టి సారించనుంది. ఇప్పటికే కేసులో ప్రధాన నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కొందరికి నిర్వహించిన డ్రగ్స్ పరీక్షల్లో పాజిటివ్ వచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కేసు రాజకీయ వర్గాల్లో కూడా చర్చనీయాంశంగా మారింది. నిష్పక్షపాతంగా, వేగవంతంగా దర్యాప్తు జరిపేందుకు సిట్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెలుగులోకి తరువాయి 12లో

## బిఆర్‌ఎస్ ఎన్నోసార్లు ఢిల్లీ వెళ్లలేదా?

ప్రజాపక్షం/హైదరాబాద్

- రాష్ట్ర ప్రయోజనాలు, నిధుల కోసం ఎన్ని సార్లైనా ఢిల్లీకి వెళ్తాం : మంత్రి శ్రీధర్‌బాబు
- తెలంగాణ సొమ్ముతో ఢిల్లీ పర్యటనలా? : కెటిఆర్



తెలంగాణ రాష్ట్రంలో అధికారాన్ని కాపాడుకునేందుకు పదేళ్ల కాలంలో ప్రాంతీయ పార్టీ బిఆర్‌ఎస్ ఎన్నో సార్లు ఢిల్లీకి వెళ్లలేదా అని రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రశ్నించారు. రాష్ట్రానికి ప్రయోజనం కలిగే అంశంలో తాము ఎన్ని సార్లైనా ఢిల్లీకి వెళ్ళి ప్రధానిని, కేంద్ర మంత్రులను కలుస్తామన్నారు. శాసనసభ, శాసనమండలి ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మంగళవారం శాసనసభలో జరిగిన చర్చలో బిఆర్‌ఎస్ తరువాయి 12లో

## డ్రగ్స్ పరీక్షకు సిఎం సిద్ధం

- కెటిఆర్ కూడా ముందుకు రావాలి
- శాసనమండలిలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ సవాల్

ప్రజాపక్షం/హైదరాబాద్



గోదావరి జలాలను వినియోగంలోకి తెచ్చేందుకు పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును వేగంగా పూర్తి చేస్తామని కాంగ్రెస్ ఎంఎల్‌సి బి.మహేష్‌కుమార్ గౌడ్ చెప్పారు. మూసీ పునరుజ్జీవం రాష్ట్ర అభివృద్ధికి కీలకమని, ప్రభుత్వం ప్రజా సంక్షేమం, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తోందని, వచ్చే ఎన్నికల్లో 100 సీట్లతో మళ్లీ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. డ్రగ్స్ పరీక్షలకు సిఎం రేవంత్ రెడ్డి సిద్ధమని, కెటిఆర్ కూడా డ్రగ్స్ పరీక్షలకు ముందుకు రావాలని ఆయన తరువాయి 12లో

రాజకీయాలకు, చట్టసభలకు వన్నెతెచ్చిన ఓంకార్ జీవితం చిరస్మరణీయం 03



## బిజెపి కోసం ఇసి ఆటాడుతోంది

- ఈద్‌కు ముందు అధికారులను ఎందుకు బదిలీ చేస్తున్నారు ?
- ఎన్నికల సంఘంపై మమతా బెనర్జీ మండిపాటు
- 291 స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించిన టిఎంసి అధినేత్రి

**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, టిఎంసి అధినేత్రి మమత బెనర్జీ మంగళవారం ఎన్నికల సంఘంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. బిజెపి ఆదేశాల మేరకు అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రభుత్వ యంత్రాంగంలో సీనియర్లను, పోలీసు అధికారులను బదిలీ చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే దానికి ఎన్నికల సంఘం, కాషాయ పార్టీయే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆమె హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికల నిమిత్తం మంగళవాం తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా ప్రకటించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాటారు. 'ఈద్ పండుగకు కొద్ది రోజుల ముందు సీనియర్ అధికారులను ఎందుకు బదిలీ చేస్తున్నారు? ఎన్నికలకు ముందు అల్లర్లు సృష్టించే ప్రణాళికలు ఏమైనా ఉన్నాయా?' అని ప్రశ్నించారు. బదిలీ అయిన అధికారుల జాబితాను బిజెపి కార్యాలయంలో సిద్ధం చేశారని, ఆ నిర్ణయాన్ని ఎన్నికల సంఘం కేవలం అమలు చేసిందని ముఖ్యమంత్రి ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియలో బిజెపికి సహాయపడటానికి పశ్చిమ బెంగాల్ వెలుపల నుండి కొంతమంది అధికారులను తీసుకువచ్చారని కూడా ఆమె ఆరోపించారు. రాజకీయ ఒత్తిడికి లోనై ఎన్నికల సంఘం వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ, బిజెపి తరఫున ఇసి ఒక ఆట ఆడుతోందని టిఎంసి అధినేత్రి మండిపడ్డారు. 'వారు నేరుగా తరువాయి 2లో

## సంజయ్ కుమార్ వల్లే
# పార్టీ మార్పు యోచన



ఫిరాయింపు ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీకి దూరంగా పెట్టాలి : మాజీమంత్రి జీవన్ రెడ్డి

ప్రజాపక్షం/జగిత్యాల

బిఆర్‌ఎస్‌తో గెలిచి కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేస్తున్న ఫిరాయింపు ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాలకు దూరంగా పెట్టాలని మాజీ మంత్రి జీవన్ రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మారాలని ఆలోచించేందుకు ప్రధాన కారణం సంజయ్ కుమార్ అని ఆరోపించారు. తాను ఇంకా కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నట్లు జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో మంగళవారం జీవన్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తరువాయి 12లో



8 మంది లోక్‌సభ ఎంపిలపై
## సస్పెన్షన్ ఎత్తివేత

**న్యూఢిల్లీ :** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల మెదటి సెషన్‌లో సస్పెన్షన్‌కు గురైన 8 మంది ఎంపిలపై సస్పెన్షన్ ఎత్తివేశారు. అనుచిత ప్రవర్తన కారణంగా వీరిని ఫిబ్రవరి 3న 8 మంది ఎంపిలపై స్పీకర్ ఓంబిర్లా సస్పెన్షన్ వేటు వేశారు. అయితే మంగళవారం ఎత్తివేశారు. ఇది తక్షణమే అమలో అమల్లోకి వస్తుందన్నారు. ఈ సందర్భంగా సభ లోపల లేదా పార్లమెంట్ ప్రాంగణంలో ఎలాంటి ప్లకార్డులు, పోస్టర్లు, ఫోటోలు లేదా ఎఐ రూపొందించిన చిత్రాలను ప్రదర్శించకూడదని సూచించారు. సభలో జరిగిన ఘటన విచారకరమని, సభ సజావుగా పనిచేయడానికి తమ పార్టీ సహకరించడానికి సిద్ధంగా ఉందని పేర్కొంటూ, ఎనిమిది మంది ప్రతిపక్ష సభ్యుల సస్పెన్షన్‌ను తొలగించడాన్ని పరిశీలించాలని కాంగ్రెస్ సభ్యుడు కె. సురేష్ సభను అభ్యర్థించారు. పలువురు ప్రతిపక్ష సభ్యులు చేసిన విజ్ఞప్తుల అనంతరం, సభ సజావుగా పనిచేయడానికి 'లక్ష్మణ రేఖ' గీయాల్సిన అవసరం ఉందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి తరువాయి 12లో

## ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ చీఫ్
# లారిజానీ హతం


### బాసిజ్ దళ కమాండర్ సులేమానీ కూడా..



**టెహ్రాన్:** ఇరాన్‌లో ఐ.డి.ఎఫ్ చేస్తున్న యుద్ధంలో 18వ రోజు మంగళవారం ఇద్దరు కీలక ప్రముఖులు మరణించారు. ఇరాన్ రాజకీయ నాయకుడు, అలీ ఖమేనీకి విశ్వసనీయమైన ప్రతినిధులలో ఒకరు, సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ అలీ లారిజానీ లక్ష్యంగా ఐ.డి.ఎఫ్ దాడులు చేసింది. లారిజానీతో పాటు ఇరాన్‌కు చెందిన కీలకమైన బాసిజ్ పారామిలిటరీ ఫోర్స్ కమాండర్ ఘోలం రెజా సులేమానీ కూడా మరో దాడిలో మరణించినట్లు ఇజ్రాయెల్ రక్షణ దళం (ఐ.డి.ఎఫ్) మంగళవారం ప్రకటించింది. ఆయనతోపాటు బాసిజ్ డిప్యూటీ కమాండర్, ఇతర ఉన్నతాధికారులు కూడా మరణించారని ఐడిఎఫ్ పేర్కొంది. లారిజానీ మరణించారా? లేదా? అనే విషయంపై ఇజ్రాయెల్‌కు తరువాయి 2లో

## బాగ్దాద్‌లో అమెరికా దౌత్యకార్యాలయంపై
# ఇరాన్ క్షిపణి దాడి

- వైమానికస్థావరాలు, మౌలిక సదుపాయాల ధ్వంసం
- యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఫ్యుజైరాహ్ చమురు నిల్వకేంద్రం ధ్వంసం
- హెజ్బొల్లా దాడుల్లో ఇజ్రాయెల్ నహరియా పట్టణం ధ్వంసం
- టెహ్రాన్, షిరాజ్‌లలో అమెరికా–ఐడిఎఫ్ విధ్వంసం



**దుబాయ్:** దుబాయ్‌లో పేలుళ్ళు, ఖతార్‌లో ఇరాన్ డ్రోన్ల అడ్డగింత, సౌదీఅరేబియాలో ఇరాన్ దాడులతో పశ్చిమాసియా అట్టుడికింది. 18వ రోజు మంగళవారం పశ్చిమాసియాలో ఇరాన్ చేసిన ఏకపక్ష దాడులతో ప్రపంచవ్యాప్తంగా చమురు,గ్యాస్ సంక్షోభం మరింత విస్తరించింది. గల్ఫ్ దేశాలపై దాడులు కొనసాగిస్తోంది. బాగ్దాద్‌లో అమెరికా దౌత్యకార్యాలయంపై మళ్ళీ క్షిపణి దాడులు చేయడంతో ఆ కార్యాలయంలో మంటలు ఎగసిపడ్డాయి. గ్రీన్‌జోన్‌లో ఉన్న రోయా తులిప్ అల్–రషీద్ హోటల్‌పై డ్రోన్ దాడులు చేసింది. బాగ్దాద్‌లో ఒక ఇంటిపై జరిగిన డ్రోన్ దాడిలో నలుగురు మరణించారు. ముఖ్యంగా చమురు ఎగుమతులు సులభంగా చేయడానికి వీలుగా హోర్ముజ్ సమీపంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఏర్పాటు చేసుకున్న ''ఫ్యుజైరాహ్ చమురు నిల్వకేంద్రం''పై ఇరాన్ క్షిపణి దాడులు చేసింది.ఒక ఆయిల్ ట్యాంకర్‌ను గుర్తు తెలియని ప్రొజెక్టైల్స్ ధ్వంసం చేశాయి. దీంతో ఆ ప్రాంతంలో మంటలు తరువాయి 2లో

# నవంబరు ఎన్నికల్లో ట్రంప్‌కు ఘోర పరాభవమే!

**అమెరికాలో ధరలమంట : ప్రజల అసంతృప్తి**
**నిరాశ– మానసిక ఒత్తిడికి గురవుతున్న ట్రంప్**
**రిపబ్లికన్లలో భయాందోళన**



**వాషింగ్టన్ :** పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైన తర్వాత అమెరికాలో గడ్డు పరిస్థితులు మొదలయ్యాయి. చమురు ధరలు, గ్యాస్ ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడం ప్రారంభమైంది. అధికార రిపబ్లికన్‌లకు చమురు దెబ్బ గట్టిగా తగలడంతో సంబంధిత ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులలో తీవ్ర భయాందోళలు మొదలయ్యాయి. ఈ ఏడాది చివర నవంబరులో జరిగే కీలకమైన ద్వైవార్షిక మధ్యంతర ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో ట్రంప్ పరిపాలనకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయని రిపబ్లికన్లు ఆందోళన చెందుతున్నారు. అమెరికాలో ఆహార వస్తువుల ధరలు 92 శాతం మేరకు పెరిగాయి. గ్యాస్ ధరలు 68శాతం ఉండగా, ఇక స్టాక్ మార్కెట్ కూడా 58 శాతం మేరకు పతమవుతున్నది. పెరుగుతున్న ధరలు రిపబ్లికన్ నాయకులకు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. ఇక అమెరికా రైతులు కూడా చమురు సంక్షోభం, ఎరువుల సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రజల్లో కొద్దికాలంగా పెరుగుతున్న అసంతృప్తి ఈ యుద్ధ సమయంలో ధరల పెరుగుదల కారణంగా పరాకాష్ఠకు చేరింది. ద్వైవార్షిక ఎన్నికలు ట్రంప్ ప్రభుత్వానికి ఎంతో కీలకమైనవి. ఈ ఎన్నికల్లో ట్రంప్ పరాజయం పాలైతే ఇక అధికారం ముగిసేవరకూ మిగిలిన పాలనాకాలమంతా ట్రంప్ ప్రభుత్వం ప్రతిపక్ష డెమోక్రాట్ల అధిపత్యంవల్ల నరకయాతన భరించాల్సి వస్తుందని రిపబ్లికన్లు భయపడుతున్నారు. ఇప్పటికే అమెరికాలో చమురు ధరలు బ్యారల్‌కు 100 డాలర్లకు చేరే ప్రమాదం ముంచుకువచ్చింది. రైతులను బుజ్జగించేందుకు ట్రంప్ ఇప్పటికే అనేక చర్యలు తీసుకున్నారు. వెనిజులా నుండి ఎరువులు రప్పించేందుకు ఒక ఒప్పందం చేసుకున్నారు. అమెరికా దిగువసభ హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్‌లో ఉన్న 435 స్థానాలకు ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు జరుగుతాయి. సభ్యుడి పదవీకాలం రెండు సంవత్సరాలు. అదేవిధంగా ఎగువసభ సెనేట్‌లో కూడా మొత్తం 100 స్థానాలకుగాను 33 లేదా 34 స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. ఈ ఎన్నికల్లో పరాజయం పాలై డెమోక్రాట్లు ఉభయసభల్లో ఆధిపత్యం సాధిస్తే దేశాధ్యక్షుడుగా ట్రంప్ తీవ్ర ఆగచాట్లు పడాల్సి వస్తుంది.

ట్రంప్ సోమవారం రాత్రి నిర్వహించిన పత్రికా గోష్ఠిపై అమెరికా మీడియా భిన్న వ్యాఖ్యలు చేస్తోంది. పశ్చిమాసియాలో ఐచ్ఛిక యుద్ధం సర్వసైన్యాధ్యక్షుడి హోదాలో ఉన్న ట్రంప్ అదుపుతప్పి పరిస్థితులు కనిపిస్తున్నప్పటికీ, ఆయన గుంభనంగా వ్యవహరిస్తున్నారని, తదుపరి మూడేళ్ళ పదవీకాలాన్ని నిర్దేశించగల నిర్ణయాలను ఆ దేశంలో ఎదుర్కొంటున్నారని పత్రికలు పేర్కొన్నాయి. హోర్ముజ్ నియంత్రణకు మిత్రదేశాలు కలిసిరాకపోవడంతో, ట్రంప్ తన మానసిక ఆందోళన కప్పిపుచ్చుకోవడానికి పత్రికాగోష్ఠిలో కెన్నడీ సెంటర్ పునరుద్ధరణ పనులు, వైట్‌హౌస్‌లో బాల్‌రూమ్ నిర్మణ పనులు సహా తక్షణ సంబంధం లేని అనేక ఇతర విషయాలు మాట్లాడారని మీడియా పేర్కొంది. ఒత్తిడి తగ్గించుకోవడానికి ఆయన తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని, గతవారం ఆయన గోల్ఫ్ ఆడారని, ఇరాన్ యుద్ధం గురించి ఎంతసేపు మాట్లాడారో అంతే సమయం సుప్రీం కోర్టుపై విమర్శలు చేయడానికి కూడా కేటాయించారని పత్రికలు పేర్కొన్నాయి. ఆయన ప్రస్తుత ఉద్రిక్తతలకు సంబంధం లేని విషయాలు మాట్లాడేందుకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపాయి.

# ఆఫ్ఘాన్ ఆసుపత్రిపై పాకిస్థాన్ దాడి

**కాబూల్‌లో 400మంది మృతి**



**కాబూల్ :** ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్‌లో ఒక ఆసుపత్రిపై పాకిస్థాన్ దళాలు గగనతల దాడి చేయడంతో ఆసుపత్రి ధ్వంసమైంది. దీంతో దాదాపు 400 మంది పైగా మరణించారు. 2000 పడకలకు పైగా ఉన్న ఈ ఆసుపత్రి నిత్యం రద్దీగా ఉంటుంది. ఆసుపత్రిపై దాడి వార్త తెలిసిన వెంటనే బంధువులు ఆర్తనాదాలు చేస్తూ అక్కడికి చేరుకున్నారు. విషణ్ణ వదనాలతో శిథిలాలమధ్య తమ బంధువులకోసం వెతుకులాడుతున్న చిత్రాలను ఆఫ్ఘనిస్థాన్ పత్రికలు ప్రముఖంగా ప్రచురించాయి. ఈ ఘటనపై ఆఫ్ఘనిస్థాన్ ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయగా, ఈ దాడితో తమకు సంబంధం లేదని, తాము దాడి చేయలేదని పాకిస్థాన్ వాదించడం ప్రారంభించింది. పాకిస్థాన్ దాడులకు ప్రతీకారం తీర్చుకుంటామని, ఇంతకింత తీవ్రంగా స్పందిస్తామన ప్రభుత్వ అధికార ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ హెచ్చరించారు. మంగళవారం తెల్లారకముందే పాకిస్థాన్ సైనిక దళాలు అఫ్ఘనిస్థాన్ తాలిబన్ స్థావరాలపై దాడులు చేశాయి. తాము బాలిబన్‌ల ఆశ్రయం పొందిన ఉగ్రవాద స్థావరాలపైమాత్రమే దాడులు చేశామని, ఆసుపత్రి జోలికి వెళ్ళలేదని పాకిస్థాన్ సైనికదళం బుకాయించింది. ఐతే మరోవైపు అఫ్ఘనిస్థాన్‌లోని తాలిబన్ నాయకత్వానగల ప్రజభుత్వంలో డిప్యూటీ స్పోక్స్ పర్సన్ హందుల్లా ఫిత్రాత్ ఒక ప్రకటన చేస్తూ, సోమవారం రాత్రి పొద్దుపోయాక పాకిస్థాన్ సైనికులు రాజధాని కాబూల్‌లోని డ్రగ్ రీహేబిలిటేషన్ సెంటర్ లక్ష్యంగా గగనతల దాడులు చేశారని ఈ దాడుల్లో 400మంది మరణించారు, మరో 250మంది గాయపడ్డారని చెప్పారు. ఆసుపత్రిలోని విస్తారమైన ప్రాంతం, భవంతులు ధ్వంసమయ్యాయని ఎక్స్ వేదికగా చెప్పారు.

'టిఓఎల్ న్యూస్ విభాగం మంగళవారం అఫ్ఘనిస్థాన్ ఆరోగ్యశాఖాధికారులను ఉటంకిస్తూ, ధ్వంసమైన శిథిలాల నుండి ఇప్పటివరకూ 50కి పైగా మృతదేహాలను వెలికితీశారని పేర్కొంది. పాకిస్థాన్ గగనతల దాడులు జరిగిన సమయంలో 3000 మంది రోగులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని పేర్కొంది. దేశీయాంగ సహాయమంత్రి ముహ్మద్ నబీ ఒమరి ఘటనాస్థలాన్ని సందర్శించారు. ఫిబ్రవరి 26వ తేదీ నుండి పాకిస్థాన్ ఆర్మీ భారీ ఎత్తున సరిహద్దుల్లో ఉన్న అఫ్ఘనిస్థాన్ ప్రాంతాలపై "ఆపరేషన్ ఘజాబ్ లిల్ హక్" దాడులు ప్రారంభించింది. అప్పటి నుండీ అడపాదడపా ఈ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. అఫ్ఘానిస్థాన్‌తో పాకిస్థాన్‌కు ఉన్న 2,600కి.మీ సుదీర్ఘమైన సరిహద్దు ప్రాంతాలలో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు పాకిస్థాన్ సమాచార ప్రసారాల మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో తెలియజేసింది. ఆపరేషన్ ఘజాబ్ లిక్ హక్ పేరుతో మార్చి 16వ తేదీ రాత్రి ఎంతో విజయవంతంగా అఫ్ఘనిస్థాన్ భూభాగంలో దాడులు చేసి ఉగ్రవాదులను మట్టుపెట్టామని సమాచార మంత్రి అత్తాయుల్లా తరార్ ఎక్స్ వేదికగా ప్రకటించారు. కాబూల్, నన్‌గర్హార్ ప్రాంతాలలో అఫ్ఘనిస్థాన్ సైన్యమే ఉగ్రవాదులకు ఆశ్రయం ఇస్తోందని, ఆ కేంద్రాలను ధ్వంసం చేశామని ఆయన చెప్పారు.

## ట్రంప్ చైనా పర్యటన వాయిదా

**వాషింగ్టన్ :** నిర్ణీత ప్రకారం ట్రంప్ తలపెట్టిన చైనా పర్యటన వాయిదా పడింది. మార్చి 31 నుండి ఏప్రిల్ రెండో తేదీ వరకు ట్రంప్ చైనాలో పర్యటించేందుకు తాత్కాలికంగా షెడ్యూలు ఖరారైంది. ఈ షెడ్యూలును చైనా ప్రభుత్వం అధికారికంగా ధృవీకరించకపోయినాగానీ అందుకు తగ్గట్టుగా సన్నాహాలు చేస్తున్న తరుణంలో ట్రంప్ స్వయంగా ఈ ప్రకటన చేశారు. "పశ్చిమాసియాలో యుద్ధం జరుగుతోంది, పరిణాలు మారుతున్నాయి, నేను 'ఇక్కడ' (వైట్‌హౌస్) ఉండాల్సిన అవసరం ఉంది, అందువల్ల దాదాపు నెలరోజులపాటు నా చైనా ప్రయాణం వాయిదా పడవచ్చు" అని ట్రంప్ ప్రకటించారు.

# నైజీరియాలో ఆత్మాహుతి దాడులు

**23 మంది మృతి**



**మైదుగిరి :** పశ్చిమ ఆఫ్రికాదేశం ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ నైజీరియా చాలాకాలం విరామం తర్వాత ఒక్కసారిగా ఆత్మాహుతి బాంబుదాడులతో అల్లకల్లోలమైంది. ఈ దాడుల్లో 23 మంది మరణించారు. మరో 100 మంది గాయపడ్డారు. మైదుగురి శివార్లలో ఉగ్రవాదులు చేసిన దాడులను సైన్యం తిప్పికొట్టిన ఇరవైనాలుగు గంటల వ్యవధిలోనే ఈ ఆత్మాహుతి బాంబు దాడులు జరిగాయి. ఈశాన్య నైజీరియాలోని బోర్నో రాష్ట్రం మైదుగురి నగరాన్ని లక్ష్యలంగా చేసుకుని సోమవారం రాత్రి ఈ బాంబుదాడులు జరిగాయని పోలీసులు మంగళవారం చెప్పారు. సంఘర్షణలో మునిగితేలుతున్న నైజీరియాలో ఇటీవలి చరిత్రలో అత్యంత ఘోరమైన దాడి ఇదే. మైదుగురిలో రాత్రి అనేకసార్లు పేలుడు శబ్దాలు వినిపించాయని స్థానిక నివాసితులు చెప్పారు. మైదుగురి యూనివర్సిటీ టీచింగ్ ఆసుపత్రి ప్రవేశమార్గంలో ఉన్న మార్కెట్ వద్ద ప్రాంతం పేలుడు శబ్దాలతో దద్దరిల్లింది. ఈ దాడులకు తామే కారణమని ఇప్పటివరకూ ఏ ఉగ్రవాద సంస్థా ముందుకువచ్చి ప్రకటన చేయలేదని బోర్నో పోలీసు అధికార ప్రతినిధి నహమ్ కెన్నెత్ చెప్పారు. ఈ ప్రాంతంలో బోకోహార్మ్ ఉగ్రవాదులు ఎంతో క్రియాశీలంగా పనిచేస్తున్నారు. వీరు వేలాదిమంది అనేక గ్రూపులుగా అనేక ప్రాంతాలలో ఉన్నారు. ఇస్లామిక్ స్టేట్ వెస్ట్ ఆఫ్రికా ప్రావిన్స్ సాధనకోసం ఈ ఉగ్రవాదులు పనిచేస్తున్నారు. మైదుగురి నగరం చాలాకాలంగా తీవ్ర హింసాత్మక ఘటనకు కేంద్రంగా ఉంది. కానీ ఇటీవలికాలంలో ఈ నగరం దాడులు లేకుండా ప్రశాంతంగా ఉన్న తరుణంలో మళ్ళీ ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి.

## టర్కీ పురావస్తు తవ్వకాల్లో
# బయటపడిన 1400 ఏళ్ళనాటి చర్చి



**టర్కీ :** ఈజిప్టులో జరిపిన తవ్వకాల్లో 1400 ఏళ్ళ క్రితంనాటి క్రైస్తవ ప్రార్థనా మందిరం అవశేషాలు బయటపడ్డాయి. బెన్ గురియన్ విశ్వవిద్యాలయం ఈ ప్రకటన చేసింది. ఈజిప్టును ఆనుకుని ఉన్న ఈ ప్రాంతాన్ని "నెస్సానా" అని కూడా పిలుస్తారు. ఈ ప్రాంతంలో ఇప్పటికే ఐదు పురాతన క్రైస్తవ ప్రార్థనా మందిరాలను వెలికితీయగా, ఇది తాజాగా బయట పడిన ఆరో ప్రార్థనా మందిరం. బైజాంటైన్ కాలంలో పవిత్ర భూమి నుండి సినాయ్‌లోని సెయింట్ కేథరిన్ మఠానికి వెళ్ళే మార్గంలో యాత్రికులకు ఈ చర్చిలు, విరామ కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడేవని బెన్ గురియన్ విశ్వవిద్యాలయం పురావస్తు విభాగం ప్రొఫెసర్ యానా ఛెఖానెట్స్ చెప్పారు. నాలుగు సంవత్సరాలక్రితం ఇక్కడకు వచ్చి తమ బృందం తొలి క్రైస్తవ యాత్రికుల సాంస్కృతిక చిహ్నాల అన్వేషణ ప్రారంభించిందని ఆయన చెప్పారు. నిట్జానా అనేక కీలక ప్రదేశం క్రైస్తవ యాత్రికులకు ఒక కీలక రవాణా కేంద్రంగా పనిచేసిందని ఆయన చెప్పారు. ఎడారి మార్గంలో ఇదే చిట్ట చివరి మజిలీగా యాత్రికులకు ఈ ప్రాంతం ఉపయోగపడిందని చెప్పారు.

## ఇరాన్ క్షిపణి దాడి

**(మొదటి పేజీ తరువాయి)**

ఎగసిపడుతున్నాయి. దుబాయ్ విమానాశ్రయంపై మళ్ళీ దాడులు జరిగాయి. ఖతార్‌లోని దోహా నగరం పేలుళ్ళతో దద్దరిల్లింది. నిబంధనలు ఉల్లంఘించి ఇరాన్ మితిమీరిన దాడులు చేస్తోందని ఖతార్ ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది.

లెబనాన్ భూభాగం నుండి ఉత్తర ఇజ్రాయెల్ నహరియా పట్టణంపై హెజ్బొల్లా దళాలు రాకెట్ దాడులు చేయడంతో ఆ పట్టణంలో అనేక ప్రాంతాలు ధ్వంసమయ్యాయి. పది మంది విదేశీ గూఢచారులను అరెస్టు చేశామని వారికి కఠిన శిక్షలు తప్పవని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ ప్రకటించింది. అమెరికాతో కాల్పుల విరమణను తాము ఎప్పటికీ కోరుకోబోమని స్పష్టం చేసింది.

అమెరికా–ఇజ్రాయెల్ ఇరాన్ నగరాల్లో విధ్వంసం సృష్టిస్తున్నాయి. ఇరాన్ సైనిక స్థావరాలపై అమెరికా దాడులు చేసింది. మరోవైపు లెబనాన్‌లో కూడా ఇజ్రాయెల్ దళాలు హింసాకాండను విస్తరించాయి. ఎర్రసముద్రంలో కూడా హౌతీ ఉగ్రవాద దళాలు వాణిజ్య నౌకలను స్తంభింపజేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ట్రంప్ నిరాశకు గురవుతున్న సమయంలో హోర్ముజ్ రక్షణకు తమ నౌకలను పంపుతామని దక్షిణ కొరియా అధికారిక ప్రకటన చేసింది.

ఇరాన్ నాయకుల ప్రకటనలకు భిన్నంగా హోర్ముజ్ వద్ద ఐఆర్‌జిసి పట్టు బిగించడంతో చమురు ధరలు పెరిగాయి. పశ్చిమాసియాలో ప్రాదేశిక రాజకీయ పరిస్థితులు శరవేగంగా మారుతున్నాయి. రోజు రోజుకూ యుద్ధ తీవ్రత మరింత పెరుగుతూ సంక్షోభం–గందరగోళ పరిస్థితి పతాక స్థాయి దిశగా ప్రయాణిస్తోంది. ప్రపంచదేశాలలో ధరల పెరుగుదలతో ప్రజల కష్టాలు పెరుగుతున్నాయి. పశ్చిమాసియా దిశగా ప్రయాణించే ప్రధానమైన ఎయిర్‌లైన్స్ సంస్థలు తమ తమ షెడ్యూల్స్‌కు భిన్నంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు వెళ్ళే విమానాలను, దుబాయ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు దూరంగా మళ్ళించి షార్జా, అబుధాభిలకు మళ్ళిస్తున్నాయి. ఎయిర్ ఇండియా విమానాలను దారిమళ్ళిస్తున్నట్టు భారత్ కూడా ప్రకటించింది.

ఇరాన్ నగరాలు టెహ్రాన్, షిరాజ్‌లపై అమెరికా, ఇజ్రాయెల్ దళాలు గగనతల దాడులతో విధ్వంసం సృష్టించాయి. ఈ యుద్ధం నుండి ఇరాన్ తనసుతాను పునర్నిర్మించుకోవడానికి దాదాపు పదేళ్ళుపైనే పడుతుందని ట్రంప్ వ్యాఖ్యానించారు అల్–ఉదైద్ వైమానిక స్థావరం, అల్–దఫ్రా సహా పశ్చిమాసియా అంతటా వ్యూహాత్మకమైన అమెరికా స్థావరాలను, కీలకమైన మౌలిక ప్రాతిపదక సౌకర్యాలను లక్ష్యంగా చేసుకుని దాడులు కొనసాగించినట్లు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ ప్రకటించింది. ఇరాన్ పలు దేశాలపై దాడులు చేయడంతో గల్ఫ్ దేశాలు ఇంటర్‌సెప్టివ్ వ్యవస్థలను క్రియాశీలం చేయడం, పౌరులను అప్రమత్తం చేయడం ద్వారా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నాయి. లెబనాన్ మారుమూల ప్రాంతాలలోకి చొచ్చుకువెళ్ళిన ఇజ్రాయెల్ సైనికులు హెజ్బొల్లా స్థావరాలపై భూతల దాడులను తీవ్రతరం చేశారు. హెజ్బొల్లా స్థావరాలు,మౌలిక సదుపాయాలను ధ్వంసం చేస్తున్నట్లు ఐడిఎఫ్ పేర్కొంది. ప్రజలు గ్రామాలు ఖాళీ చేయాలని తాజా హెచ్చరిక చేసింది. లెబనాన్ వ్యాప్తంగా ఉన్న హెజ్బొల్లా ఫైటర్‌ను సంపూర్ణంగా నిర్మూలిస్తామని ఐడిఎఫ్ ప్రతిజ్ఞ చేసింది. అరమౌన్ సహా బీరూట్‌లోని మూడు ప్రాంతాలపై గగనతల దాడులతో విధ్వంసం సృష్టించింది.

చమురు,గ్యాస్ సంక్షోభం విస్తరించింది. బ్యారెల్ చమురు ధర 100 డాలర్లను దాటేసింది. దీంతో ద్రవోల్బణ పెరుగుదల భయాలు పెరిగాయి. హోర్ముజ్‌కు నౌకలు పంపేదిలేదని నాటో దేశాలు స్పష్టం చేయడంతో చమురు ధరలు పెరిగాయి. ఆసియా,ఆఫ్రికా దేశాల్లో గ్యాస్ సమస్య విస్తరించింది. మరోవైపు అమెరికా ఫెడరల్ బ్యాంక్ తీసుకుంటున్న చర్యల కారణంగా బంగారం,వెండి ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. బంగారం ధర వరుసగా రూ.12వేలు (22క్యారెట్లు), రూ.13 (24 క్యారెట్లు) వంతున తగ్గాయి.

హోర్ముజ్ జలసంధి ద్వారా శత్రు దేశాలకు మాత్రమే అనుమతి లేదని, మిగిలిన దేశాలన్నీ స్వేచ్ఛగా ఈ మార్గాన్ని ఉపయోగించుకోవచ్చునని ఉద్రిక్తతలమధ్య మరోసారి ఇరాన్ పాలకులు స్పష్టం చేశారు.

ఈ ప్రకటనలమధ్య భారత్‌కు చెందిన గ్యాస్ ట్యాంకర్ నందాదేవి సురక్షితంగా హోర్ముజ్ జలసంధి దాడులకుని మంగళవారం గుజరాత్ తీరానికి చేరుకుంది. మరో 22 నౌకలు హోర్ముజ్ వద్దనే స్తంభించి ఉన్నాయని భారత్ పేర్కొంది. ఇదిలా ఉండగా, చమురు కష్టాలలో ఉన్న ఇరాక్ ఇరాన్‌తో ఒప్పందం చేసుకుంది. పైపులైన్ల ద్వారా చమురు రవాణాకు ఒప్పందం చేసుకున్నట్లు వార్తలు వెలువడ్డాయి.

**ఇరాన్‌లో 1500 మంది మృతి**

నిరాశ్రయులైన 30.20 లక్షలమంది ప్రజలు

ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ దాడులు,సృష్టించిన విధ్వంసం కారణంగా 18 రోజుల యుద్ధంలో 30.20 లక్షలమంది ఇరాన్ ప్రజలు ఇళ్ళు కోల్పోయి నిరాశ్రయులయ్యారు. వారంతా దాడుల భయంతో తలోదిక్కుకూ పారిపోయారు. వారి ఇళ్ళు ధ్వంసమయ్యాయి. ఈ యుద్ధంలో 1500 మంది ఇరానీయులు మరణించారనీ, మరో 18,500 మంది గాయపడ్డారని, వీరిలో ఎక్కువమంది ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారని ఇరాన్ ఆరోగ్యశాఖామంత్రి మంగళవారం ప్రకటించారు.

లెబనాన్‌లో ఇప్పటివరకూ జరిగిన యుద్ధంలో 850 మంది మరణించగా మరో 2,705 మంది గాయపడ్డారు. ఒక్క మంగళవారంనాడే దాడుల్లో గాయపడిన 70 మందిని ఆసుపత్రులకు తరలించారు. లెబనాన్‌లో వేలాదిమంది షియా ముస్లింలు గ్రామాలు వదలి పారిపోయారు. దీంతో లెబనాన్‌లో ఇప్పటివరకూ 10 లక్షలమంది నిరాశ్రయులయ్యారు. లెబనాన్‌లో శరణార్థుల సమస్య, రోజు రోజుకూ హింసాకాండ విస్తరిస్తూ ఉండటంతో కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, బ్రిటన్ దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. 18 రోజుల యుద్ధంలో పశ్చిమాసియాలోని ఏడు దేశాల్లో 13 మంది అమెరికా సైనికులు మరణించగా, మరో 200 మంది అమెరికన్ సైనికులు గాయపడ్డారు. ఇరాన్ చేసిన దాడులవల్ల ఇజ్రాయెల్‌లో 14 మంది మరణించగా,2,775 మంది క్లస్టర్ బాంబు దాడుల్లో గాయపడ్డారు.

## లారిజానీ హతం

**(మొదటి పేజీ తరువాయి)**

మొదట తీవ్ర సందేహాలు తలెత్తాయి. ఆ తర్వాత ముమ్మరంగా తనిఖీలు చేసిన తర్వాత లారిజానీ హతుడైనట్లు నిర్థారణ చేసుకున్నారు. ఇజ్రాయెల్ రక్షణమంత్రి ఇజ్రాయెల్ కట్జ్ ఒక ప్రకటన చేస్తూ లారిజానీని అంతమొందించినట్లు ప్రకటించారు. ఐ.డి.ఎఫ్ దళాల ప్రధానాధిపతి, లెఫ్టినెంట్ జనరల్ అయాల్ జమీర్ మాట్లాడుతూ, ఇజ్రాయెల్ రక్షణ దళం ఈ విజయంతో మరోసారి తన శక్తిసామర్థ్యాలు రుజువుచేసుకుందన్నారు. ఇటీవలికాలంలో పాలస్తినా యుద్ధరంగంలో అనేకమందిని హతమార్చామని, ఆ విధంగా ఎన్నో విజయాలు సాధించామని, ఇప్పుడు వీరిని అంతం చేయడం మరో అదనపు విజయమని అన్నారు.

లారిజానీ ఇరాన్‌లో ప్రముఖ నాయకుడు, ఫిలాసఫర్, పదవీ విరమణ చేసిన సైనిక నాయకుడు. ఆయన గతంలో సైన్యంలో కీలకపాత్ర వహించారు. 1958లో నజాఫ్‌లో జన్మించిన లారిజానీ సైన్యంలో అనేక కీలక పదవులు నిర్వహించారు. టెహ్రాన్ యూనివర్సిటీలో వెస్ట్రన్ ఫిలాసఫీని అధ్యయనం చేశారు. 2008 2020 వరకూ ఇరాన్ పార్లమెంటు స్పీకర్‌గా పనిచేశారు. అమెరికా దాడుల్లో గతనెల అలీ ఖమేనీ మరణించిన తర్వాత దేశంలో ఎంతో శక్తిమంతమైన నాయకుడుగా లారిజానీని ఇరాన్ పత్రికలు తెరమీదకు తెచ్చాయి.

అదేవిధంగా ఇరాన్‌లో శక్తిమంతమైన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జిసి)లో ఉన్న ఐదు బ్రాంచీలలో మరో కీలకమైన స్వచ్ఛంధ ఉగ్రవాద పారామిలిటరీ దళం 'బాసిజ్'కు సులేమానీ కమాండర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇటీవలికాలంలో ఇజ్రాయెల్ అనేక పారామిలిటరీ దళాల కార్యాలయాలపై వరుస దాడులు చేస్తూ ఉండటంతో బాసిజ్ ప్రత్యేకంగా ఒక టెంట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. ఘోలం సులేమానీ ఈ టెంట్ కార్యాలయంలో ఉన్నట్లు గుర్తించిన ఐ.డి.ఎఫ్. ఆయనను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసింది. 2019 జులైలో సేలేమానీ బాసిజ్ కమాండర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. 1979లో ఆయొతొల్లా ఖమేనీ ఈ బాసిజ్ దళాన్ని ఏర్పాటు చేశారు. ఈ బాసిజ్ దళంలో అందరూ స్వచ్ఛంధ సేవకులే ఉంటారు. వీరిలో ఎక్కువమంది గ్రామీణ ప్రాంత గిరిజనులు, నిరుపేదలు ఉంటారు. ఇరాన్–ఇరాక్ మధ్య జరిగిన యుద్ధంలో బాసిజ్ దళం కీలక పాత్ర పోషించింది.

1981లో ఖమేనీ నేత్రుత్వంలో ఒక స్వతంత్ర సంస్థగా బాసిజ్ ఆవిర్భవించి ఇరాన్‌కు పెట్టని కోటగా నిలిచింది. ఇరాన్ మత రాజ్య పాలకులకు వ్యతిరేకంగా జరిగే అల్లర్లను నిర్దాక్షిణ్యంగా అణచివేయడంలో బాసిజ్‌దే ప్రధాన పాత్ర. ఈ విషయంలో అదెంతో క్రియాశీలంగా వ్యవహరిస్తుంది. ఇరాన్ కొత్త అధినేత, అలీ ఖమేనీ కుమారుడు మొజ్తబా ఖమేనీకి ఐఆర్‌జిసి, బాసిజ్‌లతో సన్నిహిత సంబంధాలున్నాయి.

## నాన్చుడొద్దు

**(మొదటి పేజీ తరువాయి)**

విమర్శించారు. యాజమాన్యానికి, ప్రభుత్వానికి తమ కష్టాలు చెప్పుకుందామన్నా ఆర్‌టిసిలో కనీసం కార్మిక సంఘాలు కూడా లేవన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని, కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలన్నారు.

**పూర్తి స్థాయిలో రుణమాఫీ అమలు చేయాలి**

రైతులకు పూర్తి రుణమాఫీ అమలు చేయాలని సత్యం ప్రభుత్వాన్ని కోరారు. రూ.2 లక్షలకు ఒక్క రూపాయి ఎక్కువ రుణం ఉన్నా రుణమాఫీ పథకం అమలుకు నోచుకోవడంలేదన్నారు. ఇంకా మిగిలిపోయిన రైతులకు రుణమాఫీ పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో సామాన్య ప్రజలు, రైతులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని సత్యం డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ధరల పెరుగుదల, వ్యవసాయ సంక్షోభం వంటి ప్రధాన సమస్యలు ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని అన్నారు. రైతులు పంటలకు గిట్టుబాటు ధరలు పొందలేక ఇబ్బందులు పడుతున్నారని, ఎరువులు, విత్తనాలు, విద్యుత్ ఖర్చులు పెరగడంతో అప్పుల బారిన పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని గుర్తించాలి

ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న అసంతృప్తిని గుర్తించాలని సత్యం సూచించారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులు ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయడంలో ఆలస్యం అవుతుందని, వెంటనే అన్ని శాఖల్లో ఖాళీలను భర్తీ చేసి యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించాలన్నారు. కార్మికుల పరిస్థితి కూడా దారుణంగా ఉందని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. కనీస వేతనాలను అమలు చేయని యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణాల్లో పేద ప్రజలు నివాస సమస్యలతో బాధపడుతున్నారని, ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ వేగవంతం చేయాలని కోరారు.

గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది కొరతతో పాటు వైద్యపరికరాల సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించి పేదలకు మెరుగైన వైద్యం అందేవిధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టులపై కేంద్రం వివక్ష**

రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా కల్పించకపోవడం బాధాకరమని సత్యం అన్నారు. దక్షిణ తెలంగాణ ప్రాజెక్టులను గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును స్వాగతిస్తున్నామని, కానీ ఇళ్లు కోల్పోయే వారికి తగిన పునరావాసం, మెరుగైన మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**పాఠశాలలను బలోపేతం చేయాలి**

విద్యా రంగంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం అత్యవసరమని సత్యం అన్నారు. విద్యారంగానికి సంబంధించి పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, మౌలిక వసతులైన తాగునీరు, మరుగుదొడ్లు, అదనపు తరగతి గదులు ఏర్పాటు చేయాలని సూచించారు. భాషా పండితులు, పిఈటి ఉపాధ్యాయుల పదోన్నతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకంలో ఉన్న లోపాలను సరిదిద్దుతూ, వంట ఏజెన్సీలకు పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, మెనూ ఛార్జీలను పెంచాలన్నారు. నల్లగొండ జిల్లాలోని స్థానిక సమస్యల పరిష్కారానికి నిధుల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వాలని సత్యం ప్రభుత్వాన్ని కోరారు.

## ఇసి ఆటాడుతోంది

**(మొదటి పేజీ తరువాయి)**

బిజెపి కోసం ప్రచారం చేయాలి' అని ఆమె అన్నారు. ఎన్నికలకు ముందు బిజెపికి డబ్బు, ఆయుధాల తరలింపును సులభతరం చేయడానికే ఈ బదిలీలు జరిగాయని కూడా బెనర్జీ ఆరోపించారు. ఎలాంటి ఆటంకాలు లేకుండా బిజెపి డబ్బు, ఆయుధాలు సజావుగా బదిలీ అయ్యేందుకే అధికారులను మార్చారని ఆమె పేర్కొన్నారు. రాష్ట్రంలో బిజెపి చేస్తున్న రాజకీయ ప్రచారంపై కూడా టిఎంసి అధినేత్రి విమర్శలు గుప్పించారు. తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా కేంద్ర ఏజెన్సీలను వాడుకుంటోందని ఆ పార్టీపై ఆరోపించారు.

291 స్థానాల్లో టిఎంసి పోటీ

పశ్చిమ బెంగాల్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం అధికార తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) మంగళవారం అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. రాష్ట్రంలోని మొత్తం 294 స్థానాలకు గాను, 291 స్థానాల్లో తమ పార్టీ పోటీ చేస్తుందని మమతా బెనర్జీ చెప్పారు. తాను భవానీపూర్ నియోజకవర్గం నుంచే తిరిగి పోటీ చేస్తున్నానన్నారు. డార్జిలింగ్ కొండ ప్రాంతంలోని మిగిలిన మూడు స్థానాల్లో అనిత్ థాపా నేతృత్వంలోని 'భారతీయ గోర్ఖా ప్రజాతాంత్రిక్ మోర్చా' (బిజిపిఎం) పోటీ చేస్తుందని తెలిపారు. 'మేము 294 స్థానాలకు గాను 291 స్థానాల్లో పోటీ చేస్తాము. డార్జిలింగ్ కొండ ప్రాంతంలోని మిగిలిన మూడు స్థానాల్లో మా మిత్రపక్షమైన, అనిత్ థాపా నేతృత్వంలోని బిజిపిఎం పోటీ చేస్తుంది' అని బెనర్జీ అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తూ చెప్పారు. ఈ సందర్భంగా ఆమె పక్కన పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ, రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రతా బక్షి ఉన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో టిఎంసి స్పష్టమైన మెజారిటీతో అధికారాన్ని నిలబెట్టుకుంటుందని బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు. 226 కంటే ఎక్కువ స్థానాలను గెలుచుకుంటామన్నారు. అభ్యర్థుల జాబితాలో చోటు దక్కని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. వారికి పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో తగిన స్థానం కల్పిస్తామని ఆమె హామీ ఇచ్చారు. బిజెపి లక్ష్యంగా చేసుకుంటూ బెనర్జీ మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో ఆ కాషాయ పార్టీ స్థానాల సంఖ్య తగ్గుతుందని అన్నారు. వారి ప్రజా వ్యతిరేక విధానాలకు తగిన గుణపాఠం ఎదురవుతుందని వ్యాఖ్యానించారు. అభ్యర్థుల ప్రకటనతో పశ్చిమ బెంగాల్‌లో తీవ్రమైన ఎన్నికల పోరుకు రంగం సిద్ధమైంది. టిఎంసి వరుసగా నాలుగోసారి అధికారాన్ని చేజిక్కించుకోవాలని ప్రయత్నిస్తోంది.

## రాజీనామా చేస్తా

**(మొదటి పేజీ తరువాయి)**

జమ చేస్తున్నామన్నారు.

**బిఆర్‌ఎస్ పెట్టిన పెండింగ్ వడ్డీ చెల్లించాం: మంత్రి శ్రీధర్‌బాబు**

గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.3 వేల కోట్ల పావలా వడ్డీ రుణాలను పెండింగ్‌లో పెడితే దానిని కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లిస్తున్నదని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ ఎందుకు పాల్గొనడం లేదని ఆయన ప్రశ్నించారు.

**వివిధ రూపాల్లో రుణాలు ఇచ్చాం : మంత్రి సీతక్క**

స్త్రీ నిధి, బ్యాంకు లింకేజీ ద్వారా వివిధ రూపాల్లో తీసుకున్న రుణాలకుగాను రూ.57 వేల కోట్లను చెల్లించామని మంత్రి ధనసరి అనసూయ సీతక్క చెప్పారు. రుణాల్లో ఇప్పటి వరకు వడ్డీ లేని రుణాల కింద రూ.1121 కోట్ల నిధులను చెల్లించామని తెలిపారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం మహిళలకు ఇవ్వాల్సిన రూ.3 వేల కోట్ల వడ్డీలను చెల్లించకుండా మోసం చేసిందని, ఆడబిడ్డలు రూపాయి రూపాయి పోగేసి ఆదా చేసుకున్న అభయహస్తం నిధులను కూడా గత ప్రభుత్వం కాజేసిందని విమర్శించారు.

## అసెంబ్లీ మీడియా పాయింట్

### కెటిఆర్ నా వ్యక్తిత్వాన్ని కించపరుస్తున్నారు

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వంపై బిఆర్ఎస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని తాను ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తున్నందుకు బిఆర్ఎస్ నేత కెటిఆర్ తన వ్యక్తిత్వాన్ని కించపరుస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ కెటిఆర్ అసెంబ్లీ సాక్షిగా పదే పదే అబద్ధాలు మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇస్తున్న సంక్షేమ పథకాలను చూసి బిఆర్ఎస్ ఓర్వలేకపోతున్నదన్నారు. తాను పెట్టుకున్న వాచి రోలెక్స్ అని, దాని విలువ కోటి రూపాయలు అని దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దుబాయ్ కేంద్రంగా వాట్సప్ గ్రూప్‌ల ద్వారా ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. అసెంబ్లీ నిబంధనలకు విరుద్ధంగా తన ఫోటో తీయడంపై స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తానని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

### కోటి రూపాయల వాచీని రూ.30 వేలకే తీసుకోండి


కెటిఆర్‌కు ఎమ్మెల్యే వేముల వీరేశం సవాల్



ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ధరించిన వాచ్ కోటి రూపాయల వరకు ఉంటుందని చెబుతున్న బిఆర్ఎస్ నేత కెటిఆర్ అదే వాచ్‌ను రూ.30 వేలకే తీసుకోవాలని ఎంఎల్ఎ వేముల వీరేశం సవాల్ చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ ఆది శ్రీనివాస్ మీద చేసిన తప్పుడు ఆరోపణలు వెనక్కి తీసుకుని కెటిఆర్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. గవర్నర్ ప్రసంగాన్ని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పదే పదే తప్పుదోవ పట్టిస్తున్నారని వీరేశం అన్నారు. బిఆర్ఎస్ పార్టీ పదేళ్ల కాలంలో ఆర్థిక విధ్వంసం చేసిన విషయం తెలంగాణ ప్రజలకు తెలుసునని ఆయన పేర్కొన్నారు. ఆది శ్రీనివాస్‌పై అసత్య ప్రచారం చేస్తున్నారని, గతంలో మంత్రి సీతక్కపై కూడా ఇదే విధంగా అసత్య ప్రచారాలు చేశారని ఎంఎల్ఎ రామచంద్రనాయక్ అన్నారు. సొంత చెల్లెలు అడిగిన ప్రశ్నలకు కెటిఆర్ సమాధానం చెప్పకుండా దాటవేశారన్నారు. కాళేశ్వరం, అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు ఇలా ప్రతి దానిలో అవినీతి జరిగిందని సొంత చెల్లెలు కవిత మాట్లాడితే దానికి సమాధానం లేదన్నారు.

### అబద్ధం అయితే ముక్కు నేలకు రాస్తా

ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



'కరీంనగర్ పోలీసు కమిషనర్ అలం గౌస్, ఆయన సతీమణి, స్నేహితులు కలిసి ఇష్టం వచ్చినట్లు ఫైరింగ్ చేస్తున్నారు. 180 బుల్లెట్లు ఫైరింగ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. నేను మాట్లాడేది వాస్తవం. అబద్ధం అయితే ముక్కు నేలకు రాస్తా' అని బిఆర్ఎస్ ఎంఎల్ఎ పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ, అలం గౌస్ తనకున్న అధికారాన్ని ఉపయోగించి అక్రమ పనులు చేస్తున్నారని కౌశిక్ ఆరోపించారు. గౌస్ కుటుంబం సభ్యులతో కలిసి బొమ్మలపల్లి గ్రామంలో ఇష్టానుసారంగా ఫైరింగ్ చేస్తున్నారని అన్నారు. కమిషనర్ చేసిన ఫైరింగ్‌లో అమ్మతమ్మ అనే వృద్ధురాలి తొడకు గాయమైందని తెలిపారు. కమిషనర్‌పై సిఎం ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయని, మరిన్ని విషయాలను త్వరలో వెల్లడిస్తానని తెలిపారు. బండి సంజయ్‌కి దమ్ముంటే సిబిఐ ఎంక్వయిరీ వేయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎంఎల్ఎ మహేష్ కుమార్ గౌడ్ ప్రకటనలు చేసి పారిపోవడం కాదని, అసెంబ్లీలో డ్రగ్స్ టెస్ట్ పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఎంత మంది డ్రగ్స్ తీసుకుంటున్నారో అప్పుడు తెలుస్తుందన్నారు.

### కౌశిక్‌రెడ్డి చెప్పింది అంతా అబద్ధం

ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు



బిఆర్ఎస్ ఎంఎల్ఎ పాడి కౌశిక్ రెడ్డి పోలీసుల మనోధైర్యాన్ని దెబ్బతీసే విధంగా మాట్లాడుతున్నారని కాంగ్రెస్ ఎంఎల్ఎ కెఆర్.నాగరాజు అన్నారు. కౌశిక్‌రెడ్డి డ్రగ్స్‌కు అలవాటు పడ్డ ముఠా బ్యాచ్ కాబట్టి వారి ప్రవర్తన అసెంబ్లీలో అహంకారంగానే ఉంటున్నాయని. హాఫ్ ఇయర్లీ, ఇయర్లీ పోలీసుల పై రెగ్యులర్ కుటుంబ సభ్యులను కూడా పిలవడం ఆనవాయితీ అని అన్నారు. ప్రైవేటు వ్యక్తులతో ఫైరింగ్ చేయించడం జరగదని, కౌశిక్‌రెడ్డి ఈ అంశంపై కావాలని తప్పుడు ఆరోపణలు, దుష్ప్రచారం చేస్తున్నారని, కౌశిక్ రెడ్డి గూండాయిజంతో ప్రవర్తిస్తున్నారని ఆయన అన్నారు.

### సొంత పార్టీ నేతలపై సిఎంకు విశ్వాసం లేదు

ఎమ్మెల్యే కెపి వివేకానంద్



తన సొంత పార్టీ నేతలపై సిఎం రేవంత్‌రెడ్డికి విశ్వాసం లేదని ఎంఎల్ఎ కెపి వివేకానంద్ ఆరోపించారు. కాంగ్రెస్ ఎంఎల్ఎల పార్టీ శాసనసభా పక్షం సమావేశాలకు హాజరుకావడం లేదని హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు నిధులు రాక గ్రామాల్లో తిరుగలేకపోతున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కూడా వారి పార్టీ నేతలకు విశ్వాసం లేదన్నారు.

### ఒక్క కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలేదు

ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయలేదని బిఆర్ఎస్ ఎంఎల్ఎ కల్వకుంట్ల సంజయ్ విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు బయట మార్కెట్‌లో ధాన్యం అమ్ముకుని క్వింటాల్‌కు రూ.700లు నష్టపోతున్నారన్నారు. రైతులు పెట్టిన పెట్టుబడి కూడా రావడంలేదన్నారు. 'రైతుబంధు లేదు. కరెంటు లేదు. ధాన్యం కొనుగోలు లేదు' అని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

### అసెంబ్లీ -వాయిదా తీర్మానం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖలలో రిటైర్డ్ ఉద్యోగులకు, వారికి రావాల్సిన బెనిఫిట్స్,గ్రాట్యుటీ,జిపిఎఫ్ వంటి బకాయిల అంశంపైన శాసనసభలో చర్చించాలని సిపిఐ శాసనసభపక్ష నేత కూనంనేని సాంబశివ రావు శాసనసభలో మంగళవారం వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. రిటైర్డ్ ఉద్యోగులకు సకాలంలో బకాయిలను చెల్లించకపోవడంతో అనేక మంది రిటైర్డ్ ఉద్యోగులు ఆర్థిక, వైద్యపరంగా ఇబ్బందులు పడుతున్నారని కూనంనేని అన్నారు. కాగా వాయిదా తీర్మానాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తిరస్కరించారు.

# 'మహిళా సాధికారత'పై శాసనసభలో మాటల యుద్ధం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళా సాధికారత అంశంపై శాసనసభలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్ మధ్య వాదోపవాదనలు జరిగాయి. మహిళలను కోటీశ్వరులను చేస్తామనే అంశంపై బిఆర్ఎస్ ఎంఎల్ఎ కెటి.రామారావు ప్రస్తావించిన అంశాలపై డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ధనసరి అనసూయ సీతక్క స్పందించారు. 'మీ కుటుంబం' (కవితను ఉద్దేశించి)లోని, సమాజంలోని మహిళలను ఎదగనివ్వాలని మంత్రి సీతక్క సూచించారు. శాసనసభ, శాసనమండలి ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మంగళవారం శాసనసభలో జరిగిన చర్చలో బిఆర్ఎస్ ఎంఎల్ఎ కె.టి.రామారావు ప్రస్తావించిన అంశాలపై మంత్రులు స్పందించారు.

### మహిళల పట్ల కెటిఆర్‌కు చిన్నచూపు : భట్టి



మహిళల పట్ల బిఆర్ఎస్‌కు చిన్నచూపు ఉన్నదని, వారి కుటుంబ ఆడబిడ్డ పట్ల ఏ మేరకు గౌరవం ఉన్నదో ప్రజలకు తెలుసునని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కెటిఆర్ దారి తప్పి మాట్లాడుతున్నట్టుగా అనిపిస్తుందని, మహిళల అభివృద్ధి గురించి వారికి (బిఆర్ఎస్) శ్రద్ధ ఉంటే వారి మొదటి క్యాబినెట్‌లో మహిళలకు అవకాశం కల్పించేవారు కదా? అని అన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కోసం ప్రజలు ఎదురు చూసి కళ్ళు కాయలు కాసాయని, కానీ డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మాత్రం రాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒక్కో ఇంటికి రూ 5 లక్షల చొప్పున మొదటి దశలో ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇండ్లను మంజూరు చేశామని, 4.50 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టామని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఒకే సారి రూ.22,500 కోట్లు మంజూరు చేశామని వివరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను ప్రజా ప్రభుత్వం అమలు చేసుకుంటూ ముందుకు పోతుందన్నారు.

### విజన్ పెట్టుకోవడం తప్పా? శ్రీధర్‌బాబు



మహిళలను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేయాలనే విజన్ పెట్టుకోవడం తప్పా అని మంత్రి శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. మహిళా సాధికారతను చులకన చేయడం మంచిదికాదని కెటిఆర్‌కు సూచించారు. తెలంగాణ రాష్ట్రం విషయంలో సోనియాగాంధీ నిర్ణయం తీసుకోకపోతే 'మీరు' ఉండేవారా అని ప్రశ్నించారు. తాము గత ప్రభుత్వ పాలసీలను కూడా కొనసాగిస్తున్నామని, ఒక విజన్‌తో ముందుకు వెళ్తున్నామని వివరించారు.

### మహిళలను ఎగతాలి చేస్తున్నారు : సీతక్క



కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తున్నదని, కానీ 'మీరు' (కెటిఆర్) ప్రతి సారి మహిళలను ఎగతాలి చేస్తున్నారని మంత్రి ధనసరి అనసూయ సీతక్క గ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌టిసిలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించామని, కానీ బిఆర్ఎస్ మాత్రం సోషల్ మీడియాలో దానిపై దృష్ప్రచారాన్ని చేయడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు. ధనిక రాష్ట్రం అని చెప్పిన బిఆర్ఎస్, వారి పదేళ్ల కాలంలో మహిళలకు వడ్డీ లేని రుణాలను ఎందుకు చెల్లించలేదని, దళితులకు మూడు ఎకరాల భూమిని ఎందుకు పంపిణీ చేయలేదని, నిరుద్యోగ భృతి ఎందుకు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. మహిళలకు చెందిన అభయ హస్తం డబ్బులను ఎందుకు వాడుకున్నారని నిలదీశారు. గతంలో ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్న హరీశ్ రావు మహిళా రుణాలకు రూ.5 లక్షల పరిమితిని విధించారని, తాము పరిమితిని సడలించామని మంత్రి సీతక్క గుర్తు చేశారు.

### కోటీశ్వరులను చేస్తే తెలంగాణ వంద ట్రిలియన్లుగా మారుతుంది కదా? : కెటిఆర్



కోటీ మంది మహిళలను కోటీశ్వరులను చేస్తే తెలంగాణ రాష్ట్రం వంద ట్రిలియన్లుగా మారుతుంది కదా? అని బిఆర్ఎస్ ఎంఎల్ఎ కెటిఆర్ అన్నారు. మహిళలకు పెండింగ్‌లో ఉన్న వడ్డీ లేని రుణాలను ఇవ్వాలని, గృహలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు రూ.2500 సాయం పథకాన్ని అమలు చేయాలని, ఇందుకు సంబంధించిన నిధులను ప్రస్తుత బడ్జెట్‌లో కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కెటిఆర్ కోరారు.

## సిఎం సంతకం చేసిన 'ఆరు గ్యారంటీ'ల దస్త్రం ఎక్కడికి పోయింది : కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆరు గ్యారంటీల దస్త్రంపై సిఎం సంతకం పెట్టినట్టుగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మొదటి శాసనసభ సమావేశంలోని గవర్నర్ ప్రసంగంలో పొందుపర్చారని, సిఎం సంతకం చేసిన ఆ దస్త్రం ప్రస్తుతం ఏమైందని, ఎఫ్ఎస్ఎల్ అగ్ని ప్రమాదంలో కాలిపోయిందా? అని బిఆర్ఎస్ ఎంఎల్ఎ కె.టి. రామారావు (కెటిఆర్) ప్రశ్నించారు. మాయమైన ఆ దస్త్రంపై సిట్ ఏర్పాటు చేయాలన్నారు. శాసనసభ, శాసనమండలి ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మంగళవారం శాసనసభలో జరిగిన చర్చలో కెటిఆర్ మాట్లాడుతూ గవర్నర్ ప్రసంగంలో ఐటి ఎగుమతులు రూ 3.13 లక్షల కోట్లకు చేరుకున్నాయని, 9.39 లక్షల ఉద్యోగాలు అని పొందుపర్చారని, కానీ ఇటీవల ఐటి శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తన ప్రసంగంలో రూ.3.60 లక్షల కోట్లు అని, 9.46 లక్షల ఉద్యోగాలు అని అన్నట్టుగా ఉన్నదని, ఈ రెండింటిలో ఏది వాస్తవమని ప్రశ్నించారు. గవర్నర్ ప్రసంగం ప్రకారం ఐటి ఉద్యోగాల సంఖ్య ఏడు వేలకు తగ్గిందని, ఇది వాస్తవమా? లేదా సాంకేతిక తప్పులా పరిశీలించాలని, ఒక వేళ సాంకేతిక తప్పు జరిగితే అందుకు బాధ్యుని గా ఐటి శాఖ కార్యదర్శిని పక్కన పడేయాలని సూచించారు. పెట్టుబడుల అంశంపై శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. ఫార్మా సిటీ కోసంసేకరించిన భూములతోనే ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీ అంటున్నారని,కానీ ఇందులో ఎంపిలు, ఎంఎల్ఎలు, జర్నలిస్టులకు ప్లాట్లు ఇవ్వడం సాధ్యం కాదని, వాటి కోసం కేటాయించిన భూములను వాటికే ఉపయోగించాలని కెటిఆర్ అన్నారు. ప్రజల ఆస్తుల విలువ జీరో చేశామని సిఎం చెబుతున్నారని, కానీ సిఎం చేసిన సంతకానికే జీరో వ్యాల్యూగా మారిందని, కాంగ్రెస్ జారీ చేసిన గ్యారంటీ కార్డులు, డిక్లరేషన్లకు జీరో వ్యాల్యూ ఉన్నదని, విశ్వసనీయత కోల్పోయిన ప్రభుత్వానికే జీరో వ్యాల్యూ అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరు 'పోశమ్మ పాతం చేస్తే మైసమ్మ మాయం చేసినట్టుగా ఉందన్నారు. కెసిఆర్ కిట్‌కు అవసరమైతే రాహుల్ కిట్ అని పేరుపెట్టైనా ఈ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్‌లో 'ఫ్రీడం, ప్రజాపాలనను దొంగలు, దోమలు మాత్రమే ఎంజాయ్ చేస్తున్నాయని కెటిఆర్ ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఏ కార్యక్రమాన్ని నిర్వహించినా ఆ ప్రాజెక్టు అజెండా మాత్రం భూములేనని అన్నారు.

### పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేస్తాం: మంత్రి శ్రీధర్‌బాబు

తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు రావొద్దనే విధంగా భయబ్రాంతులను సృష్టించొద్దని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రతిపక్షానికి సూచించారు. వివిధ కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలు, పెట్టుబడుల విషయంలో శ్వేతపత్రం విడుదల చేస్తామని మంత్రి ప్రకటించారు. శాసనసభ, శాసనమండలి ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మంగళవారం శాసనసభలో జరిగిన చర్చలో బిఆర్ఎస్ ఎంఎల్ఎ కె.టి.రామారావు ప్రస్తావించిన అంశాలపై మంత్రి శ్రీధర్ బాబు పైవిధంగా స్పందించారు. రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పలువురు ఎంఒయు చేసుకున్నారని వివరించారు.

## జడ్జిమెంట్ చదవకుండానే అభియోగాలు

నాతో మాట్లాడితే నేను జవాబు ఇస్తా: స్పీకర్

హైకోర్టులో అడుగుతాం: కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'జ్యూడిషియరీలోజడ్జ్ తీర్పు ఇస్తారు. జడ్జిమెంట్‌ను మొత్తం చదవకుండానే ఎన్నో అభియోగాలు చేశారు. అయినా నేను మీడియా ముందుకు రాలేదు. ఈ విషయంలో కూడా జడ్జిమెంట్ చదవి నాతో మాట్లాడితే నేను జవాబు ఇస్తాను. అయినా స్పీకర్ స్థానాన్ని ప్రశ్నించడం తక్కువ చేసుకుంటే మంచిది' అని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శాసనసభ, శాసనమండలి ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మంగళవారం శాసనసభలో జరిగిన చర్చలో బిఆర్ఎస్ ఎంఎల్ఎ కె.టి.రామారావు మాట్లాడుతూ పార్టీ ఫిరాయింపుల అంశాన్ని ప్రస్తావించగా స్పీకర్ పైవిధంగా స్పందించారు. బిఆర్ఎస్ ఎంఎల్ఎ కెటిఆర్ తన ప్రసంగంలో పార్టీ ఫిరాయింపుల విషయాన్ని ప్రస్తావించారు. ఆయన స్పీకర్ నిర్ణయంపై తమ అభ్యంతరాన్ని సున్నితంగా చెప్పే ప్రయత్నం చేశారు. 'మా పార్టీ టికెట్ పై గెలిచిన ఎమ్మెల్యే ఆ పార్టీ తరపున లోకసభ ఎన్నికల్లో పోటీ చేశారు. ఆయనను అక్కడ కూర్చో పెట్టారు. అయినా మీ నిర్ణయంపై మాకు ఏ లాంటి విరోధం లేదు' అంటుండగా, స్పీకర్ ప్రసాద్ కుమార్ జోక్యం చేసుకుని జుడీషియరీలో మనం కోర్టుకు పోతాం. జడ్జిమెంట్ జడ్జి ఇస్తారు. ఈ కోర్టు కాకపోతే మరో కోర్టుకు పోతాం. అయినా నువ్వు జడ్జిమెంట్ చదవకుండానే ఎన్నో అభియోగాలు చేశావు. అయినా నేను మీడియా ముందుకు రాలేదు.ఈ విషయంలో కూడా నువ్వు జడ్జిమెంట్ చదివిన తరువాత నాతో మాట్లాడితే జవాబి స్తాను'' అని స్పీకర్ స్పష్టం చేశారు. 'అయినా ఈ విధంగా ప్రశ్నించే అలవాటును నువ్వు (కెటిఆర్) తగ్గించుకుంటే మంచింది' అని కెటిఆర్‌కు స్పీకర్ సలహా ఇచ్చారు.ఇందుకు కెటిఆర్ స్పందిస్తూ, 'మీరంటే నాకు వ్యక్తిగతంగా ఎంతో గౌరవం. మీరు నేను మిత్రులం. ఈ విషయం అందరికీ తెలుసు. అయినా మీరు తీసుకున్న నిర్ణయం తప్పు అయితే సభ్యునిగా ప్రశ్నించే అధికారం నాకు ఉంది. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం మా బాధ్యత, హక్కు. మేం తప్పక హైకోర్టులో అడుగుతాం' అని అన్నారు.

### స్పీకర్ స్థానాన్నే ప్రశ్నిస్తున్నారు : మంత్రి పొంగులేటి

అనంతరం రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీ నివాస్ రెడ్డి స్పందిస్తూ బిఆర్ఎస్ నాయకులు కట్టుకథలు చెప్పడంతో పాటు చివరకు జడ్జి స్థానంలో ఉన్న స్పీకర్‌ను కూడా ప్రశ్నించే స్థాయిలో వారు (బిఆర్ఎస్) ఆహంకారంతో మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ప్రధాన ప్రతిపక్ష నేత అసెంబ్లీకి రాకుండా ఫామ్‌హౌస్‌లో పడుకోవడం దరిద్రం

కాంగ్రెస్ ఎంఎల్ఎ బాలునాయక్ నేనావత్

శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నర్ ప్రసంగానికి కూడా రాని ప్రధాన ప్రతిపక్ష నాయకులలో కె.చంద్రశేఖర రావు ప్రపంచ చరిత్రలో నిలిచిపోతారని కాంగ్రెస్ ఎంఎల్ఎ బాలునాయక్ నేనావత్ అన్నారు. ప్రధాన ప్రతిపక్ష నాయకుడు అసెంబ్లీకి రాకుండా ఫామ్‌హౌజ్‌లో పడుకోవడం దరిద్రమన్నారు. బాధ్యత గల రాజకీయ నాయకులు డ్రగ్స్ కేసులో ఇరికి సమాజానికి ఏమి సంకేతాలను ఇస్తున్నారని ఆ రాజకీయ పార్టీలు కూడా ఆలోచించాలని సూచించారు. శాసనసభ, శాసనమండలి ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని మంగళవారం శాసనసభలో కాంగ్రెస్ సభ్యులు బాలునాయక్ ప్రవేశపెట్టగా, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బలపర్చారు. ఈ సదర్భంగా బాలు నాయక్ మాట్లాడుతూ గవర్నర్ ప్రసంగం భవిష్యత్ తెలంగాణకు అద్దం పడుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారంటీలను ప్రశ్నిస్తున్న వారు, గతంలో వారి ఎన్నికల మ్యానిఫెస్టోను ఎంత వరకు అమలు చేశారో చూసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలును ప్రశ్నించే నైతిక హక్కు బిఆర్ఎస్‌కు లేదన్నారు.

ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ హయాంలో రైతులు వరి వేస్తే ఉరి అని అన్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సన్న బియ్యం పండించే రైతులకు రూ. 500ల బోనస్‌ను అందిస్తున్నామని, రైతు భరోసా, రైతులకు పనిముట్లను అందిస్తున్నామని వివరించారు. కాళేశ్వరం నుంచి చుక్క నీరు తీసుకోకపోయినప్పటికీ 71.86 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించామన్నారు. బిఆర్ఎస్ హయాంలో నిర్మించిన ఒకే ఒక్క కాళేశ్వరం ప్రాజెక్ట్ కూడా కూలిపోయిందని విమర్శించారు.

## పాతబస్తీ అభివృద్ధికి రూ.5వేల కోట్లు కేటాయించాలి

ఎంఐఎం ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా

హైదరాబాద్ అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవడంతో పాటు పాతబస్తీ అభివృద్ధికి ప్రత్యేకంగా ఈ బడ్జెట్‌లో రూ.5వేల కోట్లు కేటాయించాలని ఎంఐఎం ఎంఎల్ఎ అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా కోరారు. మూసీ పునరుజ్జీవనం, అభివృద్ధి అత్యవసరమని, అయితే నిర్వాసితులకు న్యాయబద్ధమైన పునరావాసం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శాసనసభలో మంగళవారం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై జరిగిన చర్చలో బలాలా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు ఎంఐఎం పూర్తి సహకారం ఉంటుందని, అయితే నిర్వాసితులకు న్యాయం చేయాల్సిందేనన్నారు. 2047 నాటికి ప్రభుత్వం 3ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంగా ప్రణాళికను ప్రకటించిందని, దీనిని సాధించడానికి అవసరమైన కార్యాచరణను ప్రభుత్వం వెల్లడించాలన్నారు. ఇప్పటి వరకు 1000 ఎకరాల ప్రభుత్వ భూములను హైడ్రా స్వాధీనం చేసుకోవడం మంచిదేనని, అయితే హైడ్రా చట్ట పరిధిని దాటి వ్యవహరించడం సరైంది కాదని పేర్కొన్నారు.

## రాజకీయాలకు, చట్టసభలకు వన్నె తెచ్చిన

# ఓంకార్ జీవితం చిరస్మరణీయం

శతజయంతి సభలో పలువురు వక్తలు



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** రాజకీయాలకు, చట్టసభలకు వన్నె తెచ్చిన ఎంసిపిఐ(యు) వ్యవస్థాపక నేత, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, మాజీ శాసనసభ్యులు మద్దికాయల ఓంకార్ జీవితం చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఓంకార్ శతజయంతి సందర్భంగా 'చట్టసభలలో ఓంకార్ పాత్ర' అనే అంశంపై సదస్సు మంగళవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగింది. సభకు ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అధ్యక్షత వహించగా, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఎంసిపిఐ(యు) జాతీయ ప్రధానకార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్, సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్, మాజీ ఎంఎల్ఎ గుమ్మడి నర్సయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓంకార్ చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ నిరంతరం ప్రజల కోసం పరితపించిన ఓంకార్ మరణం నర్సంపేటకే కాదు, యావత్ తెలంగాణ రాష్ట్రానికి తీరని లోటు అన్నారు. ఆరు దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో ఏ శక్తులకూ లొంగకుండా రాజకీయాలకు విలువలు అద్దిన రాజకీయ దురంధరుడు, ప్రజా సమస్యలపై చట్టసభలలో గళం వినిపించిన నిస్వార్థ ప్రజాసేవకుడు ఓంకార్ అని కొనియాడారు. సురవరం ప్రతాపరెడ్డి, గద్దర్, అందెశ్రీ వంటి మహనీయుల చరిత్రను భవిష్యత్తు తరాలకు తెలియజేస్తున్నామని, అదే రీతిలో ఓంకార్‌ను రాష్ట్ర ప్రజలు గుర్తుంచుకునేలా ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని తెలిపారు. ట్యాంక్ బండ్ మీద ఓంకార్ విగ్రహం ఉండేలా తన వంతు కృషి చేస్తానన్నారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇస్తున్న వాగ్దానాలు నెరవేర్చలేని పార్టీలు చట్టసభలలో పోగవుతున్నాయని విమర్శించారు. అసలు ప్రజలను పట్టించుకునే స్థాయిని దిగజార్చి మాట్లాడుతున్నారన్నారు. ఓంకార్ చట్టసభలను వేదికగా చేసుకుని ప్రజా సమస్యలపై పోరాడారని, చట్టసభలకు వన్నె తెచ్చారని ఆయన కొనియాడారు. ఓంకార్ పోరాటాల స్ఫూర్తి తమకున్నదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌తో నక్సలిజాన్ని అంతమొందించాలని ప్రకటించడం, యావత్తు ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న వారిని నిర్మూలించేందుకు ఎత్తుగడ అని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వాల తప్పుడు విధానాలను ఎండగట్టాలంటే ప్రస్తుతం వామపక్ష పార్టీలు ఏకం కావాల్సిన అవసరం ఉన్నదని, అది ఓంకార్ ఆశించారని సాంబశివరావు గుర్తు చేశారు. ఓంకార్ ఆశయ సాధనకు తమ వంతుగా చట్టసభలను వేదికగా చేసుకుని పోరాడుతామని చెప్పారు. బి.వి.రాఘవులు మాట్లాడుతూ ఓంకార్ స్ఫూర్తితో అసమానతల రాజకీయాలపై, ఆర్థిక అంశాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. అమెరికా సామ్రాజ్యవాదులతో భారత ప్రభుత్వం చేతులు కలిపి యుద్ధాన్ని ప్రోత్సహించడంతో ప్రజలపైనే ధరల భారం పడుతుందని, ఇందుకు బాధ్యులైన వారికి గుణపాఠం చెప్పాలంటే వామపక్ష, ప్రజాతంత్ర ఉద్యమాలు ఓంకార్ స్ఫూర్తితో పోరాడాలన్నారు. మద్దికాయల అశోక్ ఓంకార్ మాట్లాడుతూ ప్రస్తుతం చట్టసభలలో ప్రజా సమస్యలపై ప్రశ్నించేవారు కాకుండా రాజకీయాలను వ్యాపార దృష్టితో చూసే వారి సంఖ్య పెరిగిపోతుందన్నారు. చట్టసభలలో ప్రాతినిధ్యం వహిస్తున్న వారు ప్రజల పక్షాన ఉండి ప్రజల నేతలనిపించుకోవాలని కోరారు.కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి జెవి.చలపతిరావు, సిపిఐ ఎంఎల్ కేంద్ర కమిటీ సభ్యులు గుర్రం విజయ్‌కుమార్, ఎస్‌యుసిఐ(సి) రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.మురారి, ఎంసిపిఐ(యు) కేంద్ర కమిటీ సభ్యులు మర్రెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు వనం సుధాకర్, వల్లెపు ఉపేందర్‌రెడ్డి, చందర్‌రావు, జిల్లాల నుంచి ఎంసిపిఐయు పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

GREATER HYDERABAD MUNICIPAL CORPORATION
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ

NIT No. 68, పని పేరు: 1 పని కొరకు జిహెచ్ఎంసి రాజేంద్రనగర్ & అత్తాపూర్ సర్కిల్‌లో వరద నీటి లైన్‌లు / యుజిడి నిర్వహణ మరియు మరమ్మతులు, అంచనా విలువ / ఇసివి: రూ.13.00 లక్షలు, డౌన్‌లోడింగ్ ప్రారంభ తేదీ & సమయం: 17.03.2026న సా.4.30గం.లకు, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం: 23.03.2026న సా.4.40గం.ల వరకు, ఇఇ/ఎస్ఇ పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్, జిహెచ్ఎంసి. సెల్ నెం.9989930608, ఇ-మెయిల్ ఐడి: eec11.ghmc2@gmail.com.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 17213-PP/CL/ADVT/1/2025-26, Date: 17-03-2026

శంకర్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయం : రంగారెడ్డి జిల్లా

లేఖ సంఖ్య: E1/MCS/179/2026 ఇ-ప్రొక్యూర్‌మెంట్ (E-Procurement) టెండర్ ప్రకటన తేదీ: 16-03-2026

'1). బోరు బావులను శుభ్రపరచడం మరియు లోతు పెంచడం, 2). బోరు మోటార్ల మరమ్మతులు, 3). సి.సి. (CC) రోడ్ నిర్మాణం, 4). నీటి సరఫరా వ్యవస్థ నిర్వహణ మరియు మరమ్మతులు, 5). భూగర్భ డ్రైనేజీ (UGD) పైపుల నిర్వహణ మరియు మరమ్మతులు, 6). కొత్త మోటార్ పంపుసెట్ల సరఫరా మరియు డెలివరీ, మరియు 7). శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో రోడ్లు మరియు డ్రైనేజీల శుభ్రత కోసం నైపుణ్యం లేని కార్మికులను (Un-Skilled Labour) నియమించడం' - ఈ పనుల నిమిత్తం, సమోదిత కాంట్రాక్టర్ల నుండి టెండర్లు ఆహ్వానించబడుతున్నాయి. ఈ టెండర్లను శంకర్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ 24-03-2026 తేదీన మధ్యాహ్నం 03:00 గంటల వరకు స్వీకరిస్తారు. అదే రోజు మధ్యాహ్నం 03:30 గంటలకు శంకర్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ గారి సమక్షంలో ఇ- టెండర్లు తెరవబడతాయి.

పిలిచిన టెండర్ల వివరాల (Schedule) జాబితా ఈ క్రింది విధంగా ఉంది:

1. టెండర్ పత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకునే తేదీ: 16-03-2026, మధ్యాహ్నం 03:00 గంటలకు
2. ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్ల సమర్పణ: 24-03-2026, మధ్యాహ్నం 03:00 గంటలకు
3. టెండర్ల ప్రారంభం (Opening): 24-03-2026, మధ్యాహ్నం 03:30 గంటలకు

మరిన్ని వివరాల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్లాట్‌ఫారమ్‌అయిన https://tender.telangana.gov.in ను సందర్శించండి లేదా శంకర్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయాన్ని సంప్రదించండి. సంప్రదించాల్సిన నంబర్లు: 7337323577 / 7331127776. నోటీసు బోర్డుపై కాపీ ఉంచబడింది.

సం/- కమిషనర్ శంకర్‌పల్లి మున్సిపాలిటీ

DIPR R.O. No. : 17146-PP/CL/ADVT/1/2025-26, Date: 17-03-2026

శ్రీ కోటమైసమ్మ అమ్మవారి దేవస్థానము
ఇండ్లకోటయ్యగూడెం, నిడమనూరు మండలము, నల్లగొండ జిల్లా.

లేఖ నెం.01/ఎస్.కె.ఎమ్.టి /2026, టెండర్-కం-బహిరంగ వేలముల ప్రకటన తేది: 10-03-2026.

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా ! సదరు దేవస్థానమునకు సంబంధించిన బహిరంగ వేలము ది: 25-03-2026, బుధవారము, రోజున ఉదయం 11-00 గంటలకు సహాయ కమీషనరు వారి కార్యాలయము, నల్లగొండ నందు దేవాదాయ- ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షములో నిర్వహించబడును.

| క్ర.సం. | వేలము వివరము | డిపాజిట్ డి.డి | కాలపరిమితి |
| --- | --- | --- | --- |
| 1 | పూజా సామాగ్రి అమ్ముకొను హక్కు | 1,00,000/- | 01-04-2026 నుండి 31-03-2027 వరకు |
| 2 | కొబ్బరిచిప్పలు ప్రోగుచేసుకొను హక్కు | 1,00,000/- | -దూ- |

కావున పైన తెలిపిన టెండర్ - కం - బహిరంగ వేలం నిర్వహించుటకు ఒక గంట ముందు ఆసక్తిగలవారు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనగలరని కోరనైనది. ఇతర వివరములకు మొబైల్ నెంబర్ 9703662667 సంప్రదించగలరు.

ఇట్లు,
చెవిటి ఆంజనేయులు, ఫౌండర్ ట్రస్టీ
సిరికొండ నవీన్, కార్యనిర్వహణాధికారి

DIPR R.O. No. : 17187-PP/CL/ADVT/1/2025-26, Date: 17-03-2026

తెలంగాణ గౌడ సహకార ఆర్థిక సంస్థ (టిజిటిఐఎఫ్‌సి) ఆధ్వర్యంలోని నీరా ప్రాసెసింగ్ యూనిట్, నీరా కేఫ్, 7 వాణిజ్య షాపులు, బ్యాంకెట్ హాల్ లీజుకు సంబంధించి టెండర్‌ల దాఖలు గడువును పొడిగిస్తూ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డి.ఆర్. ఉదయ్ ప్రకాష్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో నిర్ణయించిన మార్చి 18వ తేదీని ఈనెల 25 సాయంత్రం 4.00 గంటల వరకు పొడిగించారు.

# ప్రకృతి వ్యవసాయంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలవాలి

## మంత్రి తుమ్మల నాగేశ్వరరావు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రకృతి వ్యవసాయ రంగంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆకాంక్షించారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయానికి పెరుగుతున్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని రైతులు ఈ విధానాన్ని అవలంబించాలని సూచించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్‌లో భాగంగా రైతులకు ఫార్మర్ కిట్‌ల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం సచివాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతునేస్తం కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల ద్వారా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్‌లో భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రూ. 42 కోట్ల వ్యయంతో ఈ పథకాన్ని అమలుచేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 489 క్లస్టర్లు దాదాపు 61,125 ఎకరాలలో ఈ సంవత్సరం ప్రకృతి వ్యవసాయం సాగు విధానంలోకి తీసుకువచ్చే విధంగా ప్రణాళికలు రూపొందించామని అందుకు అనుగుణంగా 61,125 మంది రైతులను ఎంపిక చేసి రైతు వేదికలల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు. అంతేకాకుండ వీరికి సాగులో మార్కెటింగ్‌లో తోడ్పడే విధంగా కృషిసఖిలకు క్లస్టర్‌కు ఇద్దరు చొప్పన నెలకి రూ. 5వేల గౌరవ వేతనం ఇచ్చి నియమించడం జరిగిందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన బీజామృతం, జీవామృతం, దశపర్ణి వంటి జీవ ఉత్పాదకాలు స్వయంగా తయారు చేసుకోలేని రైతుల కోసం ప్రభుత్వం బిఆర్‌సిలను (జీవ ఉత్పాదక తయారీ కేంద్రాలు) ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, ఇందుకు ప్రతి బిఆర్‌ఎసి ఇందుకు రూ .లక్ష కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి ,వ్యవసాయ శాఖ కార్యదర్శి కె.సురేంద్రమోహన్, సంచాలకులు బి.గోపి తదితరులు పాల్గొన్నారు.

### రైతు మహోత్సవానికి తరలిరండి

ఈనెల 20,21,22 తేదీల్లో సిద్దిపేట జిల్లా నర్మేట్టలో ప్రభుత్వం నిర్వహించనున్న 'రైతు మహోత్సవ' కార్యక్రమానికి రైతులు భారీగా తరలిరావాలని వ్యవసాయ శాఖ మంత్రి పిలుపునిచ్చారు. 150కి పైగా స్టాల్స్, శాస్త్రవేత్తలతో ముఖాముఖి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కార్యక్రమాలు ఉంటాయని ఆయన వెల్లడించారు. అదేవిధంగా రైతు మహోత్సవం చివరి రోజు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తన చేతుల మీదగా యాసంగి సీజన్ రైతు భరోసా నిధుల రైతుల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు.

# కెటిఆర్ సోషల్ మీడియాలో మాత్రమే సిక్సర్లు కొడితే.. మేము ప్రజాక్షేత్రంలో సిక్సర్లు కొడుతున్నాం

## మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సోషల్ మీడియాలో మాత్రమే సిక్సర్లు కొడితే, తాము ప్రజా క్షేత్రంలో సిక్సర్లు కొడుతున్నామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. కెటిఆర్ తన భాష, ప్రాసలతో శాసనసభలో అయోమయాన్ని సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. రాష్ట్రంలో పెట్టుబడుల పెట్టే అంశంపైన వివిధ సంస్థలతో ఒప్పందాలు, ఆచరణలోకి వచ్చిన వివరాలపై కచ్చితంగా శ్వేత పత్రం విడుదల చేస్తామని స్పష్టం చేశారు. ఒకటి, రెండు రోజుల్లో శాసనసభకు సంబంధించిన కమిటీలు వేస్తామని,ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లోనే డిప్యూటీ స్పీకర్ ఎన్నిక జరుగుతుందనే విషయాన్ని చెప్పలేమని అన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలోని లాబీలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మంత్రి శ్రీధర్‌బాబు మంగళవారం ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డితో తాను తరచుగా మాట్లాడు తున్నానని, ఆయన తన తండ్రితో కలిసి పని చేసిన నాయకుడని గుర్తుచేశారు. జీవన్‌రెడ్డి విషయంలో ఎప్పుడూ నిర్లక్ష్యం చేయలేదని శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. ప్రజా పథకాలను పక్కదారి పట్టించే విధంగా కెటిఆర్ మాట్లాడుతున్నారని విమర్శించారు.'ఎఐ ప్రభావం'పై స్పందిస్తూ సాంకేతిక మార్పుల నేపథ్యంలో ఉద్యోగాల తగ్గుదల ఒక సాధారణ పరిణామమని అన్నారు. జగిత్యాల ఎంఎల్‌ఎ సంజయ్ అంశంపై స్పీకర్‌దే తుది నిర్ణయమన్నారు. మంత్రివర్గ మార్పులు, చేర్పుల విషయంలో పూర్తి స్వేచ్ఛ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే ఉంటుందన్నారు. ఇక బడ్జెట్ సమావేశాలకు మాజీ సిఎం కెసిఆర్ హాజరుకావాలని, ఆయన అనుభవం రాష్ట్రానికి ఉపయోగపడుతుందన్నారు.డిసిసి అధ్యక్షుల ఎంపిక అంశం పైన మాట్లాడుతూ ఎక్కువ మంది కాంగ్రెస్ నేతలేనని, ఒకరిద్దరు మాత్రమే కొత్త వారని,వంశీచంద్ రెడ్డిని కోఆర్డినేషన్ కమిటీలో పెట్టడంలో తప్పేమీ లేదని మంత్రి శ్రీధర్‌బాబు అభిప్రాయపడ్డారు.

# కెటిఆర్ వెంటనే రాజీనామా చేయాలి

## మంత్రి సీతక్క డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహిళా సంఘాలకు రూ.57 వేల కోట్ల బ్యాంకింగ్ రుణాలు ఇస్తే రాజీనామా చేస్తానని కెటిఆర్ గతంలో ప్రకటించారని,తన మా టకు కట్టుబడి ఉంటే వెంటనే రాజీనామా చేయాలని మంత్రి దనసరి అనసూయ సీతక్క డిమాండ్ చేశారు. అసెంబ్లీ ప్రాంగణంలోని లాబీలో తనను కలిసిన మీడి యా ప్రతినిధులతో మంత్రి సీతక్క మంగళవారం ఇష్టాగోష్టిగా మాట్లాడారు. గత రెండు సంవత్సరాల్లో బ్యాంకుల ద్వారా మహిళా సంఘాలకు రూ.57 వేల కోట్ల రుణాలు విడుదల చేశామని, ఇందుకు సంబంధించిన ఆధారాలు కూడా బయటపెట్టామన్నారు. మహిళా సంఘాలకు ఇచ్చే రుణాలపైన వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తోందని,ఇప్పటి వరకు రూ.1390 కోట్ల వడ్డీని చెల్లించామని ఆమె వివరించారు. గత ప్రభుత్వంలో మహిళా సంఘాలకు సంబంధించి రూ. 4వేల కోట్ల వడ్డీని ఎగ్గొట్టారని, అభయహస్తం నిధులను కూడా దుర్వినియోగం చేశారని సీతక్క విమర్శించారు. 'ఆధారాలు బయటపెట్టాను. లెక్కలు సరిచూసుకుని, కెటిఆర్ తన మాట నిలబెట్టుకోవాలి' అని సీతక్క సవాల్ విసిరారు.

# డ్రగ్-రెసిస్టెంట్ టిబి నిర్ధారణ కిట్లను ఆవిష్కరించిన మంత్రి



**ప్రజాపక్షం /హైదరాబాద్:** డ్రగ్ రెసిస్టెంట్ క్షయ వ్యాధి నిర్ధారణ కోసం ఆధునిక డయాగ్నస్టిక్ కిట్ల తయారీలో తెలంగాణ రాష్ట్రం తాజాగా ప్రపంచ పటంలో ప్రత్యేక స్థానం సంపాదించుకుందని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య వ్యవస్థలకు ఔషధాలకు లొంగని ప్రాణాంతక క్షయవ్యాధి పెను సవాలుగా మారిందని ఆయన తెలిపారు. దీనిని సకాలంలో గుర్తించి తగిన చికిత్స అందించడం ద్వారా రోగులను ప్రాణాపాయం నుంచి కాపాడే అవకాశం ఉంటుందని చెప్పారు. మంగళవారం నాడు ఆయన శా సనసభ కమిటీ హాల్‌లో హైదరాబాద్ జినోమ్ వ్యాలీలో తయారైన డ్రగ్ రెసిస్టెంట్ క్షయ వ్యాధి కిట్లను ఆవిష్కరించారు. ఫ్రెంచ్ డయాగ్నటిక్స్ దిగ్గజం బయోమెరియో ఈ కిట్ల ఉత్పత్తి ని ప్రారంభించింది. బెంగళూరులోని ఫ్రెంచ్ రాయబార కా ర్యాలయ కాన్సుల్ జనరల్ మార్క్ లామీ, ఆరోగ్య, సామాజిక వ్యవహారాల కౌన్సిలర్ చార్లస్ మహీ, బయోమెరియో ఎగ్జిక్యూటివ్ చైర్మన్ అలెగ్జాండర్ మెరియో ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. టిబి వ్యాధి నిర్మూలన దిశగా దేశం చేసున్న ప్రయత్నాలకు సహకరిస్తున్న బయోమెరియో యాజమాన్యాన్ని ఈ సందర్భంగా శ్రీధర్ బాబు ప్రశంసించారు. 1963లో స్థాపించిన బయోమెరియో ఇన్‌విట్రో డయాగ్నస్టిక్స్ రంగంలో ప్రపంచ అగ్రగామి సంస్థగా గుర్తింపు పొందింది. సుమారు 4 బిలియన్ అమెరికన్ డాలర్ల (దాదాపు రూ. 36 వేల కోట్ల) వార్షిక టర్నోవర్ తో, 160 దేశాల్లో కార్యకలాపా లు నిర్వహిస్తోంది. అంటు వ్యాధులు, క్యాన్సర్, ఇండస్ట్రియల్ మైక్రోబయాలజీ రంగాల్లో వినూత్న డయాగ్నస్టిక్ పరిష్కారాలను అందిస్తోంది. జినోమ్ వ్యాలీలో ఏర్పాటు చేసిన ఈ ప్లాం టు కోసం బయోమెరియో మొదటి దశలో రూ.50 కోట్లు వ్య యం చేసింది. ఇందులో 100 మందికి ఉ ద్యోగాలు లభిస్తా యి. త్వరలో ఇక్కడ పరిశోధన, అభివృద్ధి లేబరేటరీని కూడా ఏర్పాటు చేయనున్నట్టు సంస్థ వెల్లడించింది. కార్యక్రమంలో తెలంగాణా లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ సర్వేశ్ సింగ్ కూడా పాల్గొన్నారు.

### నివేదిక అందజేత...

ఈ సందర్భంగా ఇండో ఫ్రెంచ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (ఐఎఫ్‌సిసిఐ) రూపొందించిన రెండు దేశాల వాణిజ్య సంబంధాల నివేదికను కాన్సుల్ జనరల్ మంత్రి శ్రీధర్ బాబుకు అందజేసారు. తెలంగాణా అభివృద్ధిలో ఫ్రెంచ్ సంస్థల భాగస్వామ్యాన్ని ఈ నివేదిక ప్రస్తావించింది.

# తెలంగాణకు రావాల్సిన నిధులు, హక్కులపై చర్చించాలి

## ఎంపిలతో సమావేశమైన ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఎ.పి.జితేందర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన నిధులు, హక్కులపై ప్రత్యేక చర్చ జరిపి, వీలైనంత వరకు తెలంగాణ ప్రజలకు మేలు జరిగేలా ఎంపిలు కృషి చేయాలని తెలంగా ణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఎ.పి.జితేందర్ రెడ్డి సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా ఎంపిలు కేంద్రం నుంచి నిధులు రాబట్టేలా కృషి చేయాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం తరఫున అద్వైత్ కుమార్ సింగ్ నూతనంగా సెక్రెటరీ కోఆర్డినేషన్ హోదాలో నియమితులైన సందర్భంగా ఢి ల్లీలోని తెలంగాణ భవన్ గురజాడ కాన్ఫరెన్స్ హాల్‌లో రాష్ట్ర ఎంపిలతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా విభజన హామీల అ మలు, తెలంగాణ ప్రభుత్వ ప్రాధాన్యతలపై జితేందర్ రెడ్డి, ఎంపిలకు వివరించారు. ఈ సమావేశం లో ఎంపిలు డా.మల్లు రవి, చామల కిరణ్‌కుమా ర్ రెడ్డి, రామసహాయం రఘురామిరెడ్డి, కుందూ రు రఘువీర్ రెడ్డి, కడియం కావ్య, రెసిడెంట్ కమిషనర్ డా.శశాంక్ గోయల్, సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్, తెలంగాణ భవన్ అధికారులు పాల్గొన్నారు.

# నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్ పట్టివేత



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఢిల్లీ, గోవా ప్రాంతాల నుంచి ఎయిర్ లైన్స్, రైలు ద్వారా అక్రమంగా తెలంగాణలోకి తీసుకువచ్చారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌టిఎఫ్ టీమ్‌లు 239 నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్‌ను మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ ఎయి ర్ పోర్టు ద్వారా ఢిల్లీ, గోవా ప్రాంతాల నుంచి మద్యం వస్తుందని సమాచారం మేరకు ఎస్‌టిఎఫ్ ఎ టీమ్ లీడర్ అంజిరెడ్డి సిబ్బంది కలిసి పహా డీ షరీఫ్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో 213 నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న మద్యం బాటిళ్ల విలువ రూ.4.26 లక్షల విలువ ఉంటుందని అంచనా వేశారు. మద్యం బాటిళ్లను మారేడ్‌పల్లి ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. ఎస్‌టిఎఫ్ డిడి టీమ్ సిఐ నాగరాజు సిబ్బంది కలిసి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారం 10పై ఢిల్లీ నుంచి వచ్చిన 26 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో భగవాన్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి మారేడ్‌పల్లి ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు.

# రైలులో స్టార్ తాబేలు పట్టివేత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైలులో అక్రమంగా తరలిస్తున్న స్టార్ తాబేలును రైల్వే రక్షణ దళం (ఆర్‌పిఎఫ్) సిబ్బంది పట్టుకున్నారు. సెక్యూరిటీ కంట్రోల్ రూమ్ నుంచి సమాచారం రావడంతో సికింద్రాబాద్ స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా అడ్డగుట్టకు చెందిన సురేష్ కుమార్ (32) అనే ప్రయాణికుడు భువనగిరి నుంచి సికింద్రాబాద్‌కు వస్తున్నప్పుడు తనిఖీలలో భాగంగా తాను తాబేలు తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. వెంటనే అతన్ని అదుపులోకి తీసుకుని ఆర్‌పిఎఫ్ పోలీస్ స్టేషన్ కు తరలించారు.తరువాత ఈ విషయాన్ని అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వెంటనే వారు నిందితుడిని కోర్టులో హాజరుపర్చారు.న్యాయస్థానం నిందితుడికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు హైద్రాబాద్ డిఎఫ్‌ఒ శ్రీనివాస్ తెలిపారు.

# బిజెపి కార్యకర్తలపై దాడులు.. సిఎం స్పందించాలి

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో బిజెపి కార్యకర్తలపై జరుగుతున్న భౌతిక దాడులపై ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డిని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో బిజెపికి పెరిగిన ఓటింగ్ శాతాన్ని జీర్ణించుకోలేకే కాంగ్రెస్ నాయకులు కక్షపూరితంగా దాడులకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. నల్లగొండ జిల్లా చండూరులో 8 మంది కార్యకర్తలు గాయపడ్డారని, పరిగిలో సిఐ స్వయంగా కార్యకర్తపై చేయి చేసుకున్నారని ఆయన చెప్పారు. హోం శాఖ నిర్వహిస్తున్న సిఎం రేవంత్ రెడ్డి ఈ దాడులపై వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. డిజిపి సానుకూలంగా స్పందించి విచారణకు హామీ ఇచ్చారని రాంచందర్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం.జయశ్రీ, ఎన్.వి.సుభాష్, కళ్యాణ్ నాయక్, మూర్తి కిరణ్, ఎ. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# మూసీ ప్రక్షాళన చేపట్టాల్సిందే

## బఫర్ పేరుతో ఇళ్ల తొలగించవద్దు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మూసీనది ప్రక్షాళన చేపట్టాల్సిందేనని హైదరాబాద్ సిటిజన్ ఫోరం (హెచ్‌సిఎఫ్),అర్బన్ డెవలప్ మెంట్ ఫోరం (యుడిఎఫ్) నేతలు అన్నారు. అయితే బఫర్ పేరుతో ఇళ్లను తొలగించకుండ మూసీ నది పరిసర బస్తీలు, కాలనీల ప్రజలతో చర్చించి, మూసి అభివృద్ధి ప్రణాళికలో తగిన మార్పులు చేసి తర్వాతే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని హెచ్‌సిఎఫ్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యుడిఎఫ్ కన్వీనర్ ఎం. శ్రీనివాస్, హెచ్‌సిఎఫ్ అధ్యక్షులు ఎం. శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి వీరయ్య, ఉపాధ్యక్షులు పి. శ్రీనివాసరావు మాట్లాడారు. మూసీ నది అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తమ ప్రణాళికను విడుదల చేయగా దీనికి కౌంటర్‌గా బిఆర్ఎస్ నేత కెటిఆర్ తమ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, ప్రణాళికను వివరించారని, కానీ గత 12 ఏళ్లలో మూసీలో అభివృద్ధి జరిగిందేమీ లేదని,మురుగు కంపు ఇసుమంత కూడా తగ్గకపోగా ప్రభుత్వాల ప్రచారకంపు మాత్రం పెరిగిందనివారు విమర్శించారు. మూసీ అభివృద్ధి ప్రాజెక్టులో భాగంగా మూసీకి ఇరువైపులా 50 మీటర్ల బఫర్ జోన్ పేరుతో భూసేకరణ చేపట్టి 10017 (రివర్ బెడ్ లో 2166, బఫర్ లో 7851) ఇళ్లను తొలగించనున్నట్టు ప్రణాళికలను సిద్ధం చేశారని కానీ సుందరీకరణ కోసం ఇంత భారీగా నష్టం చేయాల్సిన అవసరం లేదని వారు పేర్కొన్నారు. ఎక్కడైనా నదీ ప్రవాహానికి ఆటంకంగా ఉన్న ఇండ్లను తొలగించాల్సి వస్తే వారికి ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలని అయితే ఇందుకు సంబంధించి కూడా ప్రభుత్వం తన ప్రణాళికలో స్పష్టమైన ప్రకటన చేయలేదని తెలిపారు. బిఆర్ఎస్ హయంలో తయారుచేసిన ప్రణాళికలో8594 ఇండ్లను (రిఫర్ బెడ్‌లో 1537,బఫర్ జోన్‌లో 7057) తొలగించి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించాలని నిర్ణయించారని, ఇళ్ల తొలగింపుకు కెసిఆర్ ఒప్పుకోలేదని ఇప్పుటు కెటిఆర్‌వ్యాఖ్యానించడం సరికాదన్నారు. ఇదే కెటిఆర్ వారి ప్రభుత్వ హయంలో ఏ రోజు కూడ ఇలాంటి ప్రకటన ఎందుకు చేయలేదని ప్రశ్నించారు.

# జాతీయ క్రీడాదృష్టిని ఆకర్షిస్తున్న తెలంగాణ

## ట్రైల్‌బ్లేజర్స్ 4.0లో ఫీచర్ స్టేట్‌గా ప్రత్యేక ఆకర్షణ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారతదేశం ప్రపంచ స్థాయి క్రీడా శక్తిగా ఎదగాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న ఈ సమయంలో, తెలంగాణ రాష్ట్రం తన స్పష్టమైన దృష్టి, సమగ్ర విధానాలతో ముందంజలో నిలుస్తోంది. రెవ్‌స్పోర్ట్స్ నిర్వహించిన ట్రైల్‌బ్లేజర్స్ 4.0 కార్యక్రమంలో తెలంగాణ ఫీచర్ స్టేట్‌గా పాల్గొని, క్రీడా రంగ అభివృద్ధికి సం బంధించిన తన ప్రగతిశీల నమూనాను ప్రదర్శించింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభు త్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రం జన్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి క్రీడ ల అభివృద్ధిపై చూపుతున్న ఆసక్తి కీలకమని పేర్కొన్నారు. నాయకత్వం ప్రాధాన్యత ఇస్తేనే రంగం అభివృద్ధి చెందుతుంది. ప్రస్తుతం అనేక కార్యక్రమాలు ముందు కు సాగుతున్నాయి. భారత్ 2036 ఒలింపిక్స్‌కు ఆతి థ్యం ఇవ్వగలదు అని ఆయ న తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చే స్తున్న యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీను ప్రదర్శించింది. క్రీడా విద్య, పరిశోధన, ప్రొఫెషనల్ శిక్షణలో ఉన్న లోటును భర్తీ చేయడంలో ఈ విశ్వవిద్యాలయం కీలక పాత్ర పోషించనుంది. రాష్ట్ర ప్రభుత్వం 14 నుం డి 18 ముఖ్య క్రీడా విభాగాలను ఎంపిక చేసి, వాటిపై ప్రత్యేక దృష్టి సారించనుంది. ఈ క్రమంలో ప్రాధాన్య క్రీడలలో ప్రత్యేక శిక్ష ణ, మౌలిక సదుపాయాలు, అంతర్జాతీయ స్థాయి కోచింగ్ అందించడంతో పాటు, క్రీడాకారులను ప్రపంచ స్థాయి పోటీలకు సిద్ధం చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమంలో 30 మందికి పైగా ప్రముఖ క్రీడాకారులు, సంస్థలు, విధాన నిర్ణేతలు పాల్గొన్నారు. పరస్పర చర్చలు, జ్ఞాన వినిమయం, భాగస్వామ్య అవకాశాలు ఈ వేదిక ద్వారా ఏర్పడ్డాయి. తెలంగాణ ప్రతినిధి బృందం టెక్నాలజీ, శిక్షణ మాడ్యూల్స్, క్రీడా ప్రాజెక్టుల పై భాగస్వామ్య అవకాశాలను పరిశీలించిం ది. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న ఈ ముందుచూపు కార్యక్రమాలు, భవిష్యత్‌లో భారత క్రీడా రంగానికి బలమైన పునాది వే యడమే కాకుండా, ఒలింపిక్ లక్ష్యాలను సా ధించడంలో కీలక పాత్ర పోషించనున్నాయి.

# మహిళా జర్నలిస్టులకు సైబర్ భద్రతపై టిజిసిఎస్‌బి వర్క్‌షాప్

## 'ఆన్‌లైన్‌లో ఉన్నా భయంలేదు' అనే థీమ్‌తో అవగాహన కార్యక్రమం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) మహిళా జర్నలిస్టుల కోసం ప్రత్యేకంగా సైబర్ హైజీన్ వర్క్‌షాప్ నిర్వహించింది. ఆన్‌లైన్‌లో ఉన్నా భయం లేదు అనే థీమ్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమం, డిజిటల్ ప్రపంచంలో సురక్షి తంగా, ధైర్యంగా వ్యవహరించేందుకు అవసరమైన అవగాహన, అందించడంపై దృష్టి సారించింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర డిజిపి బి. శివధర్ రెడ్డి, టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయల్ హాజరయ్యారు. వివిధ మీడియా సంస్థల మహిళా జర్నలిస్టులు ఇందులో పాల్గొన్నారు. వర్క్‌షాప్‌లో వాటిన్స్ సంస్థ సిఇఒ సన్నీ ఎన్‌వి సైబర్ హైజీన్, కొత్తగా పెరుగుతున్న సైబర్ ముప్పులు, భద్రతా చర్యలపై వివరణాత్మకంగా వివరించారు.ఈ సందర్భంగా సైబర్ నేరాల ధోరణులు, జర్నలిస్టులు ఎదుర్కొనే డిజిటల్ ప్రమాదాలు, ముఖ్యంగా మహిళలను లక్ష్యంగా చేసుకునే సైబర్ స్టాకింగ్, ఆన్‌లైన్ వేధింపులు, సెక్స్టార్షన్, నకిలీ సోషల్ మీడియా ప్రొఫైల్స్, ఫోటో మార్ఫింగ్, మ్యాట్రిమోనియల్ మోసాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు విశ్వాసం, వ్యక్తిగత సమాచారం, డిజిటల్ అలవాట్లను ఎలా దుర్వినియోగం చేస్తారో రియల్ లైఫ్ కేస్ స్టడీల ద్వారా వివరించారు. సైబర్ నేరాలను వెంటనే జాతీ య హెల్ప్‌లైన్ 1930 లేదా ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. డిజిపి బి.శివధర్ రెడ్డి మాట్లాడుతూ సైబర్ నేరాల ప్రభావం రోజురోజుకు పెరుగుతోందని, అందరూ అప్రమత్తంగా ఉండి వెంటనే ఫిర్యాదు చేయడం అవసరమని పేర్కొన్నారు. మీడియా వేదికల ద్వారా ప్రజల్లో సైబర్ అవగాహన పెంచడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని తెలిపారు. టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయల్ మాట్లాడుతూ డిజిటల్ ప్రపంచం అవకాశాలతో పాటు ప్రమాదాలను కూడా కలిగి ఉందని, ముఖ్యంగా పబ్లిక్ ప్రొఫైల్ ఉన్న మహిళలకు రిస్క్ ఎక్కువగా ఉంటుందని చెప్పారు. ఈ వర్క్‌షాప్ ద్వారా సమాజంలో సైబర్ అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా టిజిసిఎస్‌బి కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు. ముఖ్యంగా జర్నలిస్టుల వంటి కీలక వర్గాల ద్వారా ప్రజలకు సరైన సమాచారాన్ని చేరవేయాలని ఆకాంక్షించారు.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on X @SCRailwayindia
దక్షిణ మధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inలో చూడగలరు.

ఇ-టెండర్ ప్రకటన సంఖ్యః 47-Dy.CE/GS/GNT, తేదీ: 14-03-2026
PUB/2128

దిగువ సంతకం చేసిన వారు, దిగువ పేర్కొన్న పనుల నిమిత్తం 09-04-2026 తేదీన మధ్యాహ్నం 3:00 గంటల వరకు ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

క్ర.సం.01. టెండర్ ID: 86. విభాగం: Dy.CE/GS/GNT. పని వివరణ: Dy.CE-GS-GNT పరిధిలో 'రోడ్ ఓవర్ బ్రిడ్జిల' (ROBs) నిర్మాణం కోసం ప్రతిపాదిత భూ-సాంకేతిక పరిశోధన (Geotechnical Investigation) మరియు రూపకల్పన తయారీ; అలాగే Dy.CE-GS-GNT పరిధిలోని ROBల కోసం పునాది, ఉప-నిర్మాణం (Sub-Structure) & పై-నిర్మాణం (Superstructure) యొక్క వివరణాత్మక రూపకల్పన సమర్పణ, టెస్ట్ పైల్స్ (test piles) కాస్టింగ్ మరియు పరీక్షించడం మొదలైన పనులు. సుమారు విలువ (రూపాయలలో): 3,15,15,528.96. ముందస్తు ధరావత్తు (EMD): రూ. 3,07,600/-.

1. ఇ-బిడ్లను ఆన్‌లైన్‌లో సమర్పించడానికి చివరి తేదీ: 09-04-2026న 15:00 గంటల వరకు. వివరణాత్మక సమాచారం కోసం www.ireps.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి. 2. తదుపరి సమాచారం లేదా సవరణలు (Corrigendum) ఏవైనా ఉంటే, అవి www.ireps.gov.in అనే ఇ-పోర్టల్ ద్వారా తెలియజేయబడతాయి.
ఉప ప్రధాన ఇంజనీర్ (Dy. Chief Engineer), గతి శక్తి, గుంటూరు.

టెండర్ ప్రకటన
PUB/2129
దక్షిణ మధ్య రైల్వే, విజయవాడకు చెందిన ఉప ప్రధాన ఇంజనీర్ (గతి శక్తి), భారత రాష్ట్రపతి తరపున, ఈ క్రింది పనుల కోసం 'ఓపెన్ టెండర్ / సింగిల్ ప్యాకెట్ / రెండు ప్యాకెట్ల' టెండర్ విధానంలో ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు:

క్ర.సం. 1. టెండర్ సంఖ్య మరియు తేదీ: Dy.CE-GS-BZA-18-2025-26, తేదీ 13-03-2026. పని వివరణ / పని పేరు: విజయవాడ డివిజన్ ELS (విజయవాడ)లో HL బే (KZJ వైపు)ను రెండు స్పాన్ల (2x17x9.5మీ) మేర పొడిగించడం; LL బే (BZA వైపు)ను ఒక స్పాన్ (1x17x9.5మీ) మేర పొడిగించడం; LL బే (KZJ వైపు)ను ఒక స్పాన్ (1x17x9.5మీ) మేర పొడిగించడం; ప్రస్తుతం ఉన్న సర్వీస్ భవనాన్ని (117x10మీ) కూల్చివేయడం; కొత్త సర్వీస్ భవనాన్ని (127x10మీ) నిర్మించడం; చేతులు కడుక్కునే ప్రదేశంతో కూడిన 9.0x6.0మీ పరిమాణంలో కొత్త మరుగుదొడ్లను నిర్మించడం మరియు ప్రస్తుతం ఉన్న మరుగుదొడ్లను కూల్చివేయడం; 200 మంది వినియోగదారుల కోసం సెప్టిక్ ట్యాంక్‌ను నిర్మించడం; LL బే కోసం పూర్తి స్థాయి పారిశ్రామిక ఫ్లోరింగ్ (VDF+Ironite) పనులు; ట్రాక్ పనులు. IRPSM I.D No: 11.06.42.23.1.47.007. టెండర్ విలువ (రూ.): 16,42,09,642.18. ముందస్తు ధరావత్తు (EMD) (రూ.): 9,71,100/-. పని పూర్తి చేయు కాలపరిమితి: 12 నెలలు. టెండర్ ఫారం ధర (రూ.): NIL (ఏమీ లేదు). టెండర్ ముగింపు తేదీ మరియు సమయం: 06-04-2026 @ 15:00 గంటలు.

1. బిడ్ పత్రాలు మరియు ఇతర వివరాల కోసం, దయచేసి https://ireps.gov.in వెబ్‌సైట్‌లో లాగిన్ అవ్వండి. 2. టెండర్ ముగియడానికి పదిహేను రోజుల ముందు ప్రారంభమయ్యే 'టెండర్ సమర్పణ / బిడ్డింగ్' కాలంలో, టెండర్‌దారులు తమ బిడ్లను ఆన్‌లైన్ ద్వారా సమర్పించవచ్చు. 3. టెండర్ సమర్పణ / బిడ్డింగ్ కాలం ప్రారంభమయ్యే తేదీ వరకు జారీ చేయబడే ఏవైనా సవరణలు (corrigenda) (ఇవి కేవలం ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడతాయి) ఉన్నాయేమో టెండర్దారులు గమనిస్తూ ఉండాలి.
డిప్యూటీ చీఫ్ ఇంజనీర్, గతి శక్తి, విజయవాడ.

టెండర్ ప్రకటన నెం.: LGD/L/23/2025-26/OT, తేదీ: 17-03-2026
PUB/2134
భారత రాష్ట్రపతి తరపున మరియు వారి తరపున వ్యవహరిస్తున్న డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/లోగిట్ అడ్మినిస్ట్రేషన్ (Dy.CEE/LGDS), LGD/L/23/2025-26/OT-E-TENDER నెం.కు గాను ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు. చివరి తేదీ 15-04-2026, మధ్యాహ్నం 3:00 గంటలు. బిడ్డర్లు తమ ఒరిజినల్ / సవరించిన బిడ్లను చివరి తేదీ మరియు సమయం వరకు మాత్రమే సమర్పించగలరు. ఈ టెండర్‌కు మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు, మరియు స్వీకరించబడిన అటువంటి ఏ మాన్యువల్ ఆఫర్ అయినా విస్మరించబడుతుంది. కాంట్రాక్టర్లు ఈ టెండర్‌కు గాను ఎర్నెస్ట్ మనీ (బిడ్ సెక్యూరిటీ) చెల్లింపులను ఇ-పేమెంట్ గేట్‌వే ద్వారా నగదు రూపంలో గానీ, భారతదేశంలోని షెడ్యూల్ కమర్షియల్ బ్యాంక్ నుండి బ్యాంక్ గ్యారంటీ బాండ్ రూపంలో గానీ, లేదా టెండర్ పత్రాలలో పేర్కొన్న విధంగా గానీ చేయవచ్చు. బ్యాంక్ గ్యారంటీ బాండ్ అనెక్సర్-VIA ప్రకారం ఉండాలి మరియు బిడ్ చెల్లుబాటు కాలం ముగిసిన తర్వాత 60 రోజుల పాటు చెల్లుబాటులో ఉండాలి. బిడ్ల సమర్పణ గడువు తేదీ నుండి 5 పని దినాలలోపు, టెండర్ పత్రంలో పేర్కొంచిన విధంగా నామినేట్ చేయబడిన అధికారికి అసలు బ్యాంక్ గ్యారంటీని స్వయంగా అందజేయాలి. ఇ-టెండరింగ్ పోర్టల్ (IREPS)లో బిడ్‌తో పాటు బ్యాంక్ గ్యారంటీ యొక్క స్కాన్ చేసిన కాపీని సమర్పించకపోవడం మరియు / లేదా నిర్దేశిత కాలంలోపు అసలు బ్యాంక్ గ్యారంటీని సమర్పించకపోవడం వలన బిడ్ తక్షణమే తిరస్కరించబడుతుంది.

క్ర.సం. 1. టెండర్ నెం. : LGD/L/23/2025-26/OT. పని వివరణ: లాలాగూడలోని క్యారేజ్ వర్క్‌షాప్‌లో మూడు సంవత్సరాల కాలానికి 310/700/1400 HP ట్రాక్షన్ ఆల్టర్నేటర్లకు సర్వీసింగ్ / ఓవర్‌హాలింగ్ మరియు చిన్నపాటి మరమ్మతులు, మరియు ట్రాక్షన్ మోటార్ ఆర్మేచర్ యొక్క కమ్యూటేటర్లకు ఓవాలిటీ మెషినింగ్, (గ్రూవ్ కటింగ్ మరియు డైనమిక్ బ్యాలెన్సింగ్) చేయడం. ప్రకటిత విలువ: రూ.48,91,399,72 (నలభై ఎనిమిది లక్షల తొంభై ఒక్క వేల మూడు వందల తొంభై తొమ్మిది రూపాయల డెబ్బై రెండు పైసలు మాత్రమే). బిడ్ సెక్యూరిటీ: రూ.97,800/-. పూర్తి చేయవలసిన కాలపరిమితి: అంగీకార పత్రం జారీ చేసిన తేదీ నుండి 36 నెలలు. ముగింపు తేదీ: 15-04-2026, సమయం: 15:00 గంటలు.

1. వెబ్‌సైట్ వివరాలు: www.ireps.gov.in
2. టెండర్ పూర్తి వివరాలను వీక్షించగల నోటీసు బోర్డు స్థానం: ఉప ప్రధాన విద్యుత్ ఇంజనీర్ కార్యాలయం, క్యారేజ్ వర్క్ షాప్, లాలాగూడ, సికింద్రాబాద్ - 500017.

తదుపరి టెండర్ నిబంధనలు / వివరాల కోసం (ఇవి టెండర్ పత్రాలలో అందుబాటులో ఉంటాయి), అలాగే టెండర్ పత్రాలు మరియు సవరణలు (corrigendum) డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి మా వెబ్‌సైట్ https://www.ireps.gov.in/ ను సందర్శించండి.
ఉప ప్రధాన విద్యుత్ ఇంజనీర్, క్యారేజ్ వర్క్ షాప్, లాలాగూడ, సికింద్రాబాద్.

టెండర్ ప్రకటన సంఖ్య: C_SG_36_596, తేదీ: 13-03-2026
PUB/2135
భారత రాష్ట్రపతి తరపున, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ డివిజన్‌కు చెందిన సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్, సికింద్రాబాద్, ఇ-ప్రొక్యూర్‌మెంట్ (ఆన్‌లైన్ కొనుగోలు) విధానం ద్వారా ఈ క్రింది పనుల కోసం బహిరంగ టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

క్ర.సం. 1. టెండర్ సంఖ్య & తేదీ: C SG 36 596, తేదీ: 13-03-2026, ముగింపు తేదీ: 06-04-2026. పని పేరు: సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో టెలికాం మౌలిక సదుపాయాల ఆధునీకరణ మరియు విస్తరణ పనులు. 1) సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో బ్యాండ్‌విడ్త్‌ను మెరుగుపరచడానికి మరియు IT ఆధారిత అప్లికేషన్లను (eOffice, ORMS, IPAS, IRWCMS, IREPS, IRPSM, HRMS, SMMS, Points and Crossing Inspections App మొదలైనవి) నిర్వహించడానికి, Railnet పరికరాలు మరియు నెట్‌వర్క్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేసేందుకు సంబంధించిన టెలికాం ప్రతిపాదన. 2) డేటా లాగర్ వ్యవస్థ (Servers, CMUలు, FEP) విభజన మరియు సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని అన్ని కంట్రోల్ బోర్డుల కోసం బహుళ-మానిటర్ డిస్‌ప్లే (Multi monitor display) ఏర్పాటు. 3) సికింద్రాబాద్ డివిజన్‌లోని సిగ్నల్ కంట్రోల్ గది ఆధునీకరణ (Renovation). 4) Sr. DEN /West/SC అధికార పరిధిలో 'అమృత్ భారత్ స్టేషన్ల' (VKB & TDU) మొదటి దశ పనుల పూర్తి కోసం సిగ్నల్ & టెలికాం ప్రతిపాదన. 11) LC సంఖ్య 09 (SC-WD సెక్షన్), కి.మీ. సంఖ్య 55/12-14 వద్ద ఉన్న లెవెల్ క్రాసింగ్‌ను (LC) RCC బాక్స్ (RUB)తో భర్తీ చేయడానికి ప్రతిపాదించిన పనికి సంబంధించి సిగ్నలింగ్ ఏర్పాట్లు. (మొత్తం 11 పనులు). సుమారు విలువ (రూ.): రూ. 6,54,20,272.40. బిడ్ సెక్యూరిటీ / ముందస్తు ధరావత్తు (EMD) (రూ.): రూ. 4,77,100/-.

మరిన్ని వివరాల కోసం www.ireps.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.
సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్, (Co-ord), సికింద్రాబాద్.

టెండర్ సంఖ్య: 08-TSMD-MLY-25-26, తేదీ: 12-03-2026 నాటి టెండర్ ప్రకటనకు సవరణ (Corrigendum)
PUB/2136
భారత రాష్ట్రపతి తరపున మరియు వారి ఆదేశాల మేరకు, DEE/TSMD/MLY వారు టెండర్ సంఖ్య: 08-TSMD-MLY-25-26, తేదీ: 12-03-2026 కు సంబంధించి ఇ-టెండర్లను ఆహ్వానించారు. ఇ-టెండర్ దాఖలుకు చివరి తేదీ: 07-04-2026, సమయం: 10:30 గంటలు. పైన పేర్కొన్న టెండర్‌కు సంబంధించి ఈ క్రింది సవరణ జారీ చేయబడింది.

టెండర్ సంఖ్య : 08-TSMD-MLY-25-26 కు సవరణ. మూల ప్రకటనలో టెండర్ అంచనా విలువ (Advertised Cost) రూ. 40,43,806/- గాను, EMD (ముందస్తు ధరావత్తు) రూ.80,900/- గాను పేర్కొనబడింది. ప్రస్తుతం ఈ వివరాలు సవరించబడి, టెండర్ అంచనా విలువ రూ. 37,66,206.52/- గాను, EMD రూ. 75,300/- గాను నిర్ణయించబడ్డాయి.

దయచేసి గమనించండి: మూల ప్రకటనలో పేర్కొన్న ఇతర నిబంధనలు మరియు షరతులలో ఎటువంటి మార్పు లేదు, అవి యథాతథంగా ఉంటాయి.

వెబ్‌సైట్ వివరాలు: www.ireps.gov.in

టెండర్ పూర్తి వివరాలను వీక్షించగల నోటీసు బోర్డు స్థానం: DEE/TSMD/MLY కార్యాలయం, మౌలాలి, సికింద్రాబాద్-500047.
డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, TSMD, మౌలాలి.
A2695

మరిన్ని టెండర్ షరతులు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.

# సిటీ గ్యాస్ ప్రాజెక్టులకు క్లియరెన్స్ ఇవ్వండి

• ఎల్‌పిజి కొరత తీర్చేందుకు రాష్ట్రాలపై కేంద్రం ఒత్తిడి • ఆందోళన పడొద్దు: తొలుత ఇళ్లకే సరఫరా • హోటళ్ళు, రెస్టారెంట్లకు కమర్షియల్ గ్యాస్ ఆపేశాం
• గతంకంటే ఇప్పుడే ఇళ్ళకు ఎక్కువ సిలిండర్లు ఇస్తున్నాం • దేశంలోని రిఫైనరీల్లో ఎల్‌పిజి ఉత్పత్తి పెరిగింది • కేంద్ర మంత్రిత్వశాఖాధికారి సుజాతా శర్మ ప్రకటన



**న్యూఢిల్లీ:** పైప్ లైన్ల ద్వారా వంటిళ్ళకు సరఫరా చేసే సిటీ గ్యాస్ ప్రాజెక్టులకు సత్వరం క్లియరెన్సులు ఇవ్వాలని రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచింది. యుద్ధం కారణంగా దేశంలో వంటగ్యాస్ కొరతవల్ల హోటళ్ళ వ్యాపారం,గృహ వినియోగదారులు సిలిండర్ల కోసం సుదీర్ఘంగా ఎదురుచూడటం, గ్యాస్ బుకింగ్ కోసం తీవ్ర ఆందోళన చెందడం వంటి పరిణామాల మధ్య ఈ సమస్యల పరిష్కారానికి నగరాల్లో నేరుగా వంట గ్యాస్ ఇళ్ళకు సరఫరా చేసేందుకు ఉద్దేశించిన సిటీ గ్యాస్ ప్రాజెక్టులకు సత్వర అనుమతులు మంజూరు చేయాలని రాష్ట్రాలను కేంద్రం కోరింది. పైపుల ద్వారా వంటగ్యాస్ సరఫరాలు పొందే విధానానికి వెళ్ళేందుకు గృహిణులు, వ్యాపార వర్గాలను కూడా ప్రోత్సహించాలని కోరింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం మార్చి 16వ తేదీలిఖితపూర్వక ఆదేశాలు ఇచ్చింది. పశ్చిమాసియాలో హోర్ముజ్ జలసంధి నుండి వాణిజ్య నౌకల్లో వంటగ్యాస్ సరఫరా గడచిన 18 రోజులుగా స్తంభించిపోవడంతో ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలతోపాటు భారత్‌లో కూడా ఎల్‌పిజి సరఫరాలు నిలిచిపోవడంతో ప్రజలు ఇండక్షన్ కుక్కర్లు వంటి ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరిస్తున్నారు. దాదాపు 60 శాతం ఎల్‌పిజి గ్యాస్ హోర్ముజ్ జలసంధి నుండే భారత్‌కు రావాల్సి ఉండగా యుద్ధం ముగిసే పరిస్థితి లేకపోవడంవల్ల ఈ కొరత తీరే మార్గాలు కనిపించడం లేదు. దీంతో దేశీయంగా ఎల్‌పజి ఉత్పత్తులు పెంచాలని ఆదేశించడంతోపాటు ప్రభుత్వం ఇతర తక్షణ అవకాశాలపై దృష్టి కేంద్రీకరించింది. ''పరిస్థితి ఇంకా ఆందోళన కరంగానే ఉంది, కానీ గృహ అవసరాలకే వంటగ్యాస్ సరఫరా చేయాలని,దానికే ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం గట్టి నిర్ణయం తీసుకుంది'' అని కేంద్ర పెట్రోలియం,సహజవాయువుల మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి సుజాతా శర్మ మంగళవారం న్యూఢిల్లీలో మీడియా సమావేశంలో చెప్పారు. వంటగ్యాస్ కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, గతం కంటే అసలు ఇప్పుడే ఎక్కువగా ఇళ్ళకు గ్యాస్ సిలిండర్ల సరఫరా పెరిగిందని చెప్పారు. యుద్ధం రాకముందు రోజుకు 50 లక్షలమందికి వంట గ్యాస్ సరఫరా చేస్తే, ఇప్పుడు మార్చి 13వ తేదీన రోజుకు 62.50 లక్షలమందికి, మార్చి 14వ తేదీన 60 లక్షల మంది ఇళ్ళకు వంట గ్యాస్ సరఫరాలు చేశామని చెప్పారు. ఐతే గ్యాస్ బుకింగుల విషయంలో ప్రజల్లో ఇప్పటికీఆందోళన నెలకుని ఉందని, అలా కంగారు పడాల్సిన అవసరం లేదని ఆమె చెప్పారు. గృహావసరాలకు ప్రాధాన్యత ఇచ్చేందుకు వీలుగాదేశీయంగా గ్యాస్ ఉత్పత్తులు పెంచమని రిఫైనరీలకు చెప్పామని, మార్చి ఐదోతేదీతో పోలిస్తే ఈ పది రోజుల్లో దేశీయంగా రిఫైనరీలోల వంటగ్యాస్ ఉత్పత్తి 38 శాతంపెరిగిందని, అందువల్ల ఎలాంటి ఆందోళనా అవసరం లేదని చెప్పారు. అనేక రాష్ట్రాలలో అక్రమ నిల్వదారులను కూడా అరికట్టే చర్యలు కొనసాగుతున్నాయని, అలాంటివారిపై దాడులు,సోదాలతో కేసులు నమోదు చేస్తున్నారని, కొరత లేకుండా చూస్తున్నామని చెప్పారు. మొదట హోటళ్ళు, రెస్టారెంట్లకు కమర్షియల్ గ్యాస్ సరఫరాలు నిలిపివేశామని, పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చిన తర్వాత వాటికి సరఫరాలు పుష్కలంగా పునరుద్ధరిస్తామని చెప్పారు. దేశంలో ఉన్న ఎల్‌పిజి నిల్వలు, బుకింగ్ వివరాలకు సంబంధించిన గణాంకాలను కూడా ఆమె వివరించారు. సాధారణంగా దేశంలో ఒక రోజుకు 55 లక్షలమంది గ్యాస్ సిలిండర్ల బుకింగులు చేసుకుంటారని, యుద్ధం మొదలైన తర్వాత మార్చి 13వ తేదీ నాటికి ఈ బుకింగులు రోజుకు 87.70 లక్షల వంతున పతాకస్థాయికి చేరుకున్నాయని, కేంద్ర ప్రభుత్వం పరిస్థితులను చక్కదిద్దేందుకు అన్ని చర్యలూ తీసుకున్న తర్వాత ఈ రోజువారీ వంటగ్యాస్ బుకింగుల సంఖ్య సోమవారం (మార్చి 16) నాటికి 70 లక్షలకు దిగి వచ్చిందని వివరాలు తెలియజేశారు. దేశంలో గృహ వినియోగదారులను పైపుల ద్వారా వంటగ్యాస్ సరఫరాలు పొందాలని ప్రభుత్వం అటు గృహిణులను, వ్యాపారులనూ కూడా ప్రోత్సహిస్తోందని చెప్పారు. సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్ వర్కు వల్ల సిలిండర్ల డెలివరీ సమస్య తగ్గుతుందని, సులభంగా వంటగ్యాస్ లభ్యం అవుతుందని సుజాతా శర్మ చెప్పారు. రాష్ట్రాలలో ప్రభుత్వాలు, జిల్లా యంత్రాంగాలను కూడా చాలా జాగ్రత్తగా ఈ పరిస్థితిని కనిపెట్టుకుని ఉండాలని ఆదేశించామన్నారు. మహారాష్ట్ర, రాజస్థాన్‌లలో ఉమ్మడి బృందాలు తనిఖీలు, దాడులు కొనసాగిస్తున్నాయని చెప్పారు. ఉత్తర ప్రదేశ్‌లో అధికారులు ఆకస్మిక దాడులు చేశారని 1400 ప్రాంతాలలో తనిఖీలు చేసి 20 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారని, 19 మందిని విచారణ చేస్తున్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్, బీహార్, ఒడిసా,కర్ణాటకలలో కూడా దాడులు కొనసాగుతున్నాయని చెప్పారు. ఓఎంసి కూడా ఒక్కరోజుల్లో ఎల్‌పిజి పంపిణీ, రిటైల్ అవుట్‌లెట్‌లలో 1300 ఆకస్మిక తనిఖీలు చేశారన్నారు. ప్రజల్లో అవగాహన ప్రచారం కూడా ఓఎంసి చేపడుతుందన్నారు. వినియోగదారులు ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్‌లు, మొబైల్ యాప్‌లను రీఫిల్లింగ్ కోసం ఉపయోగించుకోవాలని కోరారు.

# బెంగాల్‌లో పది స్థానాల్లో పోటీ

సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య



**న్యూఢిల్లీ:** వామపక్ష కూటమిలో భాగంగా పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ 10 స్థానాల్లో పోటీ చేస్తుందని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య మంగళవారం తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో పరిశీలనలో ఉన్న 60 లక్షలకు పైగా ఓటర్లు ఎన్నికల్లో ఓటు వేయగలిగేలా చూడటంలో ఎన్నికల సంఘం విఫలమైందని ఆయన ఆరోపించారు. తృణమూల్ కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రంలో ఒక బలమైన ప్రత్యామ్నాయాన్ని అందించడానికి, అదే విధంగా ఏ విధంగానైనా సరే అధికారంలోకి రావాలని చూస్తున్న బిజెపిని అడ్డుకోవడానికి వామపక్ష పార్టీలు కృషి చేస్తాయని భట్టాచార్య విలేకరులతో అన్నారు. 2011 వరకు 34 ఏళ్ల పాటు నిరంతరాయంగా రాష్ట్రాన్ని పాలించిన, సిపిఐ(ఎం) నేతృత్వంలోని కూటమి, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేకపోయింది. ఈసారి పశ్చిమ బెంగాల్‌లో వామపక్షాల అవకాశాల గురించి ప్రస్తావిస్తూ, బెంగాల్‌లోని ఈ రాజకీయ కూటమికి సానుకూలమైన ఒక కొత్త పరిణామం చోటుచేసుకుందని ఆయన పేర్కొన్నారు. మొదటిసారిగా, ఇప్పుడు సిపిఐ(ఎంఎల్), వామపక్ష కూటమి (పశ్చిమ బెంగాల్‌లో) మధ్య సీట్ల పంపకం ఒప్పందం కుదిరింది. వామపక్ష కూటమిలో భాగంగా తాము 10 స్థానాల్లో పోటీ చేస్తామని, ఈ సీట్ల పంపకం ఒప్పందంలో ఐఎస్ఎఫ్ డా భాగస్వామిగా ఉంటుందని భట్టాచార్య చెప్పారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల కోసం తమ 192 మంది అభ్యర్థులతో కూడిన మొదటి జాబితాను వామపక్ష కూటమి సోమవారం ప్రకటించింది. సిపిఐ(ఎంఎల్) లిబరేషన్, ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్ (ఐఎస్ఎఫ్) అనుబంధ పార్టీలుగా తమ అభ్యర్థులను బరిలోకి దింపుతాయని వామపక్ష కూటమి చైర్మన్ బిమన్ బోస్ కూడా తెలిపారు. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ వంటి ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో 'సర్' ఇప్పటికే లక్షలాది మంది ఓటర్ల ఓటు హక్కును తొలగించిందని భట్టాచార్య ఆరోపించారు. 'పశ్చిమ బెంగాల్‌లో ఇది కేవలం ఓట్ల తొలగింపుకు సంబంధించిన విషయం మాత్రమే కాదు. 60 లక్షలకు పైగా ఓటర్లను పరిశీలనలో ఉన్న జాబితాలో ఉంచారు. ఈ పరిశీలనలో ఉన్న ఓటర్ల కేసులపై ఎన్నికలకు ముందే ఒక నిర్ణయం తీసుకుంటామని ఎన్నికల సంఘం నుండి ఎటువంటి హామీ లేదు' అని ఆయన అన్నారు. 'బెంగాల్ నుండి వినిపిస్తున్న ప్రధాన డిమాండ్ ఏమిటంటే— ముందుగా న్యాయపరమైన పరిశీలనలో ఉన్న ఓటర్ల ఓటు హక్కులకు భరోసా కల్పించాలి, ఆ తర్వాతే ఓటింగ్ ప్రక్రియను కొనసాగించాలి. ఏ ఒక్క అర్హులైన ఓటరు కూడా విస్మరించబడకుండా ఎన్నికల సంఘం తప్పక చర్యలు తీసుకోవాలి' అని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకుడు పేర్కొన్నారు. తమిళనాడులో తమ పార్టీ డిఎంకెతో పొత్తులో ఉన్నప్పటికీ, 15 స్థానాల్లో మాత్రం స్వతంత్రంగా పోటీ చేస్తుందని ఆయన తెలిపారు. 'కేరళలో మేము ఏ రాజకీయ పార్టీతోనూ పొత్తు పెట్టుకోలేదు. తిరువనంతపురం, త్రిశూర్, కన్నూర్ అసెంబ్లీ స్థానాల్లో స్వయంగా పోటీ చేస్తాము, మిగిలిన స్థానాల్లో వామపక్ష అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తాము' అని భట్టాచార్య జోడించారు.

## మూడు నెలల్లోపు పిల్లల దత్తతకు మాత్రమే...
# ప్రసూతి సెలవును పరిమితంచేసే చట్టం 'సుప్రీం' కొట్టివేత

దత్తత తీసుకున్న తల్లి 12వారాల ప్రసూతి సెలవుకు అర్హురాలని తీర్పు

**న్యూఢిల్లీ :** ప్రసూతి సెలవు విషయంలో అత్యున్నత న్యాయస్థానం కీలక తీర్పును వెలువరించింది. మూడు నెలల కంటే ఎక్కువ వయసున్న బిడ్డను ఒక మహిళ దత్తత తీసుకుంటే ఆమెకు ప్రసూతి సెలవులను నిరాకరించడం సహేతుకం కాదని సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తన తీర్పులో స్పష్టంచేసింది. దత్తత అనేది పునరుత్పత్తి స్వేచ్ఛ హక్కులో భాగమని గమనించిన సుప్రీంకోర్టు, మూడు నెలలలోపు వయసున్న బిడ్డను చట్టబద్ధంగా దత్తత తీసుకున్న మహిళ ప్రసూతి సెలవుకు అర్హత పొందుతుందని పేర్కొన్న చట్టాన్ని మంగళవారం కొట్టివేసింది. న్యాయమూర్తులు జస్టిస్ జె.బి.పార్థివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం దత్తత తీసుకున్న బిడ్డ వయసుతో సంబంధం లేకుండా, దత్తత తీసుకున్న తల్లి 12 వారాల (మూడు నెలలు) ప్రసూతి సెలవుకు అర్హత కలిగి ఉంటుందని తీర్పు ఇచ్చింది. 2020 కోడ్ సెక్షన్ 60(4), దత్తత ద్వారా ప్రసూతి ప్రయోజనాలను పొందేందుకు, దత్తత తీసుకున్న బిడ్డ వయసుపై మూడు నెలల పరిమితిని విధించడం, రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 21లను ఉల్లంఘిస్తోందని ధర్మాసనం పేర్కొంది. పితృత్వ సెలవును సామాజిక భద్రతా ప్రయోజనంగా గుర్తించే నిబంధనను తీసుకురావాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని కోరింది.మూడు నెలల కంటే తక్కువ వయసున్న బిడ్డను దత్తత తీసుకుంటేనే 12వారాల ప్రసూతి సెలవును అనుమతించే సామాజిక నియమావళిలోని సెక్షన్ 60 (4)ను సవాల్ చేస్తూ హంసానందిని నందూరి దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఈ తీర్పునిచ్చింది.

## అమెరికాతో వాణిజ్య ఒప్పందం రద్దు చేసుకున్న మలేషియా
# భారత్ ఎందుకు చురుకుగా వ్యవహరించడం లేదు?

ప్రధాని మోదీని ప్రశ్నించిన కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాన్ని మలేషియా రద్దు చేసుకున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారతదేశపు గౌరవాన్ని త్యాగం చేస్తూ చేతులు కట్టుకుని కూర్చోడానికే సంతృప్తి చెందినట్లు కనిపిస్తున్నారని, భారతదేశం మలేషియా మాదిరిగా ఎందుకు అంత చురుకుగా వ్యవహరించడం లేదని కాంగ్రెస్ మంగళవారం ప్రశ్నించింది. అమెరికాతో కుదుర్చున్న ఒప్పందాన్ని రద్దు చేసుకున్న తొలిదేశంగా మలేషియా నిలిచిందని కాంగ్రెస్ మీడియా, పబ్లిసిటీ విభాగం అధిపతి పవన్ ఖేరా వెల్లడించారు. 2025 అక్టోబరు 26న మలేషియా అమెరికాతో ఈ ఒప్పందంపై సంతకం చేసింది. మలేషియాతో భారతదేశానికి పూర్తి స్థాయి ఒప్పందం జరిగిన దాఖలాలు కూడా లేవని, అయినప్పటికీ భారత్‌కు వ్యతిరేకమైన ఆ వాణిజ్య ఒప్పందం భవితవ్యంపై ప్రభుత్వం ఎలాంటి స్పష్టతా ఇవ్వలేదు. కేవలం అజ్ఞాత వ్యక్తుల ద్వారా వదంతులు మాత్రమే వ్యాప్తి చెందాయని ఆయన చెప్పారు. ఇది చాలదన్నట్లుగా దిగుమతులను అరికట్టడంలో విఫలమైనందుకు , బలవంతపు కార్మిక వ్యవస్థపై అమెరికా భారత్‌పై రెండు 301 విచారణలను ప్రారంభించగా, అధిక పారిశ్రామిక సామర్థ్యం, తయారీలో వక్రీకరణలపై రెండవ విచారణను ప్రారంభించింది అని పవన్ ఖేరా తెలిపారు. కానీ భారతదేశ భవిష్యత్తును వాషింగ్టన్ నిర్ణయిస్తుండగా, ప్రధానమంత్రి మోదీ, పియూష్‌గోయల్ భారతదేశ గౌరవాన్ని త్యాగం చేస్తూ సంతృప్తిగా కూర్చున్నట్లున్నారు. తన భవిష్యత్తును నిర్ణయించుకోవడంలో భారతదేశం మలేషియా మాదిరిగా ఎందుకు చురుకుగా వ్యవహరించడం లేదని పవన్‌ఖేరా ప్రశ్నించారు. మోదీ అమెరికా కోసం ఎందుకింత కష్టాన్ని భరిస్తున్నారు?. 1993నుంచే అమెరికాకు మోదీ రహస్యాలు తెలుసు కాబట్టేనా? అని ఖేరా ప్రశ్నించారు. అమెరికా కొత్త ప్రపంచ సుంకాల విధానం అమలులోకి వచ్చిన తర్వాతే భారత్‌అమెరికాల మధ్య మధ్యంతర వాణిజ్య ఒప్పందం సంతకాలు జరుగుతాయని ఒక సీనియర్ ప్రభుత్వ అధికారి చెప్పిన ఒక రోజు తర్వాత పవన్‌ఖేరా ఈ వ్యాఖ్యలు చేశారు.

# నా కలను నెరవేరుస్తారా?

• సినీనటి నయనతారపై అన్నా డిఎంకె ఎంపి అనుచిత వ్యాఖ్యలు



**చెన్నై :** అన్నా డిఎంకె రాజ్యసభ ఎంపి సి. వేణుగోపాల్ షణ్ముగం వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తనకు హీరోయిన్ నయనతార కావాలని, ఈ కోరికను తీరుస్తారా అని సిఎం స్టాలిన్‌ను ఆయన ప్రశ్నించారు. ఎవరికైనా నయనతారను పెళ్లి చేసుకోవాలని ఉంటే, ఆ కోరికను ముఖ్యమంత్రి నెరవేరుస్తారా అని అడిగారు. సిఎం స్టాలిన్ తాజాగా ప్రకటించిన 'మీ కలను మాతో చెప్పండి' కార్యక్రమాన్ని ఉద్దేశించి వేణుగోపాల్ షణ్ముగం ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు ఇంటింటికి తిరిగి, ప్రభుత్వం నుంచి ప్రజలు కోరుకునే అంశాలను, పాలనపై ఇచ్చే సలహాలు, సూచనలను తెలుసుకుంటారు. డిఎంకె ప్రభుత్వ పాలనా వైఫల్యం, మహిళలపై నేర ఘటనల పెరుగుదల, శాంతిభద్రతలకు భంగం వాటిల్లడం వంటి అంశాలపై రాష్ట్రవ్యాప్తంగా అన్నాడిఎంకె నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా తన సొంత జిల్లా విల్లుపురంలో జరిగిన నిరసన కార్యక్రమం వేదికగా రాజ్యసభ ఎంపి వేణుగోపాల్ షణ్ముగం ఈ కామెంట్స్ చేశారు. ఆయన వ్యాఖ్యలను డిఎంకె వర్గాలు తీవ్రంగా తప్పుపట్టాయి. రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఎవరైనా విమర్శించొచ్చని, కానీ మహిళలపై అశ్లీల వ్యాఖ్యలు చేయడం సరికాదని డిఎంకె అధికార ప్రతినిధి డాక్టర్ సయ్యద్ హాఫీజుల్లా హితవు పలికారు. నయనతార గురించి అలా మాట్లాడటం ద్వారా, యావత్ మహిళాలోకాన్ని ఎంపి షణ్ముగం అవమానించారన్నారు. నాగరిక సమాజంలో ఇలాంటి వ్యాఖ్యలు ఆమోదయోగ్యం కావని పేర్కొన్నారు. మహిళల గురించి ఇలా మాట్లాడినందుకు వేణుగోపాల్ షణ్ముగంపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నాడిఎంకె పార్టీకి ఆయన సూచించారు.

## ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో
# రూ. 81,500 కోట్ల నరేగా నిధులు విడుదల



**న్యూఢిల్లీ :** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ఎంజి నరేగా ఉపాధి పథకం కింద రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు రూ. 81,500 కోట్లకు పైగా నిధులు విడుదల చేసినట్లు ప్రభుత్వం మంగళవారం తెలిపింది. వేతన చెల్లింపులు ప్రత్యక్ష బదిలీ విధానం ద్వారా నిరంతర ప్రాతిపదికన జరుగుతున్నాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాశ్వాన్ లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఈనెల 11, 2026 నాటికి రాష్ట్రాలవ్యాప్తంగా చెల్లించాల్సిన బకాయిలు సుమారు రూ. 18,862 కోట్లుగా ఉన్నాయని తెలిపారు. ఇందులో వేతనాల కోసం రూ. 8,688.29 కోట్లు, సామాగ్రి కోసం రూ. 9,692.28 కోట్లు, పరిపాలనా సంబంధిత అంశాల కోసం రూ. 502.42 కోట్లు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈనెల 11, 2026 నాటికి, 202526 ఆర్థిక సంవత్సరంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజినరేగా) కింద మొత్తం రూ. 81,502.62 కోట్లు విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. ఇందులో వేతన చెల్లింపుల కోసం రూ. 65,875.13 కోట్లు, సామాగ్రి, పరిపాలనా సంబంధిత అంశాల కోసం రూ. 15,627.48 కోట్లు ఉన్నాయని ఆయన వివరించారు. పశ్చిమ బెంగాల్ మినహా, 202425 ఆర్థిక సంవత్సరం వరకు చెల్లించాల్సిన, ఆమోద యోగ్యమైన వేతన బకాయిలన్నీ ఇప్పటికే పూర్తిగా చెల్లించబడ్డాయని సహాయ మంత్రి తెలిపారు. ప్రభుత్వ వివరాల ప్రకారం, కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను పాటించనందున, చట్టంలోని సెక్షన్ 27 నిబంధనల మేరకు మార్చి 9, 2022 నుండి పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి ఎంజి నరేగా కింద నిధుల విడుదల నిలిపివేసింది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి సంబంధించి 2021–22 ఆర్థిక సంవత్సరపు 'కార్మిక బడ్జెట్'ను పెంచాలన్న ప్రతిపాదనను, గ్రామీణాభివృద్ధి శాఖ జారీ చేసిన ఆదేశాలను పాటించనందువల్ల, ఆ శాఖకు చెందిన ఎంజి నేరగా సాధికార కమిటీ ఆమోదించలేదని ఆయన తెలిపారు. ప్రభుత్వపు 'నరేగాసాఫ్ట్' ఇ–గవర్నెన్స్ వేదిక ప్రకారం, పశ్చిమ బెంగాల్‌కు సంబంధించిన పెండింగ్ బకాయిల మొత్తం (08.03.2022 నాటికి) రూ. 3082.52 కోట్లుగా ఉంది. ఇందులో వేతనాల విభాగానికింద రూ. 1457.22 కోట్లు, సామాగ్రి విభాగానికింద రూ. 1607.68 కోట్లు, పరిపాలన విభాగానికింద రూ. 17.62 కోట్లు ఉన్నాయి. ఈ బకాయిల చెల్లింపు అర్హత, కేంద్ర ప్రభుత్వం చేపట్టే పరిశీలనకు లోబడి ఉంటుందని మంత్రి తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ పార్టీ, ఇప్పటికే పూర్తి చేసిన పనులకు సంబంధించి చెల్లించాల్సిన బకాయిలలో వేతనాల విభాగానికింద రూ. 3,700 కోట్లు, వేతనేతర విభాగానికింద రూ. 3,200 కోట్లు ఉన్నాయని పేర్కొంది. ఈ పథకం అమలు జరగని కాలానికి సంబంధించి కేంద్రం చెల్లించాల్సిన అంచనా బకాయిల మొత్తం, వేతనాల విభాగానికింద రూ. 28,400 కోట్లుగానూ, వేతనేతర విభాగానికింద రూ. 16,400 కోట్లుగానూ ఉంటుందని టిఎంసి తెలిపింది. టిఎంసి అంచనా ప్రకారం, పశ్చిమ బెంగాల్‌కు సంబంధించి ఎంజి నరేగా కింద చెల్లించాల్సిన మొత్తం పెండింగ్ బకాయిలు రూ. 51,700 కోట్లుగా ఉన్నాయి.

## ఉత్కంఠ రేపిన
# హర్యానా రాజ్యసభ ఎన్నికలు

సంజయ్ భాటియా, కరమ్‌వీర్ సింగ్ గెలుపు



**చండీగఢ్ :** హర్యానాలో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో ఉత్కంఠ పోరు సాగింది. అయితే బిజెపి నుంచి సంజయ్ భాటియా, కాంగ్రెస్ పార్టీ నుంచి కరమ్‌వీర్ సింగ్ బోద్ విజయం సాధించారు. క్రాస్ ఓటింగ్ జరిగినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో హర్యానా ఎన్నికలపై అందరి దృష్టి పడింది. ఆ రాష్ట్రం నుంచి రెండు సీట్లే ఖాళీ ఉండగా, ఇండిపెండెంట్ అభ్యర్థిగా సతీశ్ నందల్ పోటీ చేశారు. సతీశ్‌కు బిజెపి మద్దతుగా నిలిచింది. సోమవారం అర్థరాత్రి వరకు ఈ రేసు ఆసక్తికరంగా సాగింది. అర్థరాత్రి సిఎం నయాబ్ సింగ్ సైని ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. విజయం సాధించిన ఇద్దరు అభ్యర్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. బిజెపి మద్దతు ఇచ్చిన సతీశ్ నందల్ స్వల్ప తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి చేతిలో ఓడినట్లు సిఎం సైని పేర్కొన్నారు. ఐదుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్ చేశారని, మరో నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఓట్లను అనర్హమైనవిగా ప్రకటించినట్లు సైని చెప్పారు. క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ పార్టీ నేత బికె హరి ప్రసాద్ తెలిపారు.తమ అభ్యర్థిని ఓడించేందుకు బిజెపి తీవ్రంగా ప్రయత్నించినట్లు కాంగ్రెస్ నేత భూపిందర్ సింగ్ హుడా ఆరోపించారు. కానీ ఆ అగ్నిపరీక్షలో నెగ్గినట్లు చెప్పారు. రాజ్యసభ ఎన్నికల పోలింగ్‌కు ముందు ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీ హిమాచల్ ప్రదేశ్‌కు తీసుకెళ్లిందని సిఎం సైని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ తన ఎమ్మెల్యేలను నమ్మడం లేదని ఆయన అన్నారు. ఓటింగ్‌కు దూరంగా ఉన్న ఐఎన్ఎల్‌డి పార్టీపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు బి టీమ్‌గా ఆ పార్టీ వ్యవహరించిందన్నారు.

# బెంగాల్‌లో 19 మంది సీనియర్ పోలీస్ అధికారులు బదిలీ



**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ ఎన్నికల సంఘం రాష్ట్ర అధికార యంత్రాంగాన్ని పునర్వ్యవస్థీకరిస్తోంది. సోమవారం సిఎస్, డిజిపిపై వేటు వేసిన ఎన్నికల సంఘం తాజాగా పోలీసు వ్యవస్థలో బదిలీలు చేపట్టింది. ఇద్దరు ఎడిజిలతో సహా 19 మంది సీనియర్ పోలీసు అధికారులను బదిలీ చేయాలని ఎన్నికల సంఘం మంగళవారం ఆదేశించింది. ఐపిఎస్ అధికారి రాజేష్ కుమార్ సింగ్‌ను దక్షిణ బెంగాల్‌కు కొత్త అదనపు డైరెక్టర్ జనరల్ (ఎడిజి)గా నియమించగా, కె. జయరామన్‌ను ఉత్తర బెంగాల్ ఎడిజిగా నియమించారు. వీరిద్దరూ 1997 బ్యాచ్‌కు చెందిన అధికారులే అని ఒక ప్రకటనలో పేర్కొంది. అసన్‌సోల్–దుర్గాపూర్, హౌరా, బర్రాక్‌పూర్, చందానగర్ ప్రాంతాలకు కొత్త పోలీసు కమిషనర్లు (సిపి) నియమితులయ్యారు. పశ్చిమ బర్ధమాన్‌లోని అసన్‌సోల్–దుర్గాపూర్‌కు ప్రణవ్ కుమార్ కొత్త సిపిగా, హౌరాకు అఖిలేష్ కుమార్ చతుర్వేది సిపిగా, ఉత్తర 24 పరగణాలలోని బ్యారక్‌పూర్‌కు అమిత్ కుమార్ సింగ్ కొత్త సిపిగా, హుగ్లీ జిల్లాలోని చందన్‌నగర్‌కు సునీల్ కుమార్ యాదవ్ సిపిగా నియమితులయ్యారు. ఈ తాజా బదిలీల ప్రక్రియలో 12 జిల్లాల పోలీసు సూపరింటెండెంట్లు (ఎస్‌పి) కూడా బదిలీ అయ్యారు. బారాసత్‌కు పుష్ప, కూచ్ బెహార్‌కు జస్‌ప్రీత్ సింగ్, బీర్‌భూమ్‌కు సూర్య ప్రతాప్ యాదవ్, హుగ్లీ గ్రామీణ ప్రాంతానికి కుమార్ సన్నీ రాయ్, డైమండ్ హార్బర్‌కు ఇషాని పాల్, ముర్షిదాబాద్‌కు సచిన్, బసిర్‌హాట్‌కు అలకానంద భోవాల్, మాల్దాకు అనుపమ్ సింగ్, పూర్వ మేదినీపూర్‌కు అన్షుమాన్ సాహా, జంగీపూర్‌కు సురిందర్ సింగ్ ఎస్‌పిలుగా నియమితులయ్యారు. ఇస్లాంపూర్‌కు కొత్త ఎస్‌పిగా రాకేష్ సింగ్, పశ్చిమ మేదినీపూర్‌కు ఎస్‌పిగా పాపియా సుల్తానా నియమితులయ్యారు. వైఎస్ జగన్నాథరావును కోల్‌కతా పోలీసుల డిసిపి (సెంట్రల్)గా నియమించారు. 'పారదర్శకంగా, భయం లేకుండా, హింసకు తావులేకుండా, ప్రలోభాలకు అతీతంగా ఎన్నికలను నిర్వహించడానికి ఎన్నికల సంఘం కట్టుబడి ఉంది' అని ఒక అధికారి తెలిపారు. ఈ ఆదేశాన్ని తక్షణమే అమలు చేయాలని ఎన్నికల సంఘం (ఇసి) ఆదేశించింది. బదిలీ అయిన అధికారులను ఎన్నికల విధుల నుండి మినహాయిస్తూ, మార్చి 18వ తేదీ ఉదయం 11 గంటల లోపు ఈ ఆదేశాల అమలు నివేదికను సమర్పించాలని కోరినట్లు ఆ ప్రకటన పేర్కొంది. ఆదివారం ఎన్నికల తేదీలు ప్రకటించిన వెంటనే, ఎన్నికల సంఘం ప్రధాన కార్యదర్శి నందిని చక్రవర్తిని, హోం కార్యదర్శి జగదీష్ ప్రసాద్ మీనాను బదిలీ చేసింది. ఆ తర్వాత, డిజిపి పీయూష్ పాండేను, కోల్‌కతా సిపి సుప్రతీమ్ సర్కార్‌ను కూడా వారి పదవుల నుండి తొలగించింది. 294 మంది సభ్యులు కలిగిన పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికలు ఏప్రిల్ 23, 29 తేదీలలో రెండు దశల్లో జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

# జెడియుని వీడిన కె.సి త్యాగి



**న్యూఢిల్లీ :** జెడియు సీనియర్ నేత కె.సి. త్యాగి పార్టీని వీడినట్లు ప్రకటించారు. తన తదుపరి కార్యాచరణను త్వరలోనే నిర్ణయించుకుంటానని తెలిపారు. సమతా పార్టీ, జనతా దళ్ విలీనంతో అక్టోబర్ 2003లో జెడియు ఆవిర్భవించినప్పటి నుండి త్యాగి ఆ పార్టీతో అనుబంధం కలిగి ఉన్నారు. ఆయన జెడియులో ప్రధాన కార్యదర్శి, ప్రధాన అధికార ప్రతినిధి, రాజకీయ సలహాదారుతో సహా వివిధ హోదాల్లో సేవలందించారు. 'అవును, నేను పార్టీని వీడాను' అని ప్రశ్నించినప్పుడు త్యాగి పిటిఐకి చెప్పారు. 'పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ముగిసింది. ఈసారి నేను పార్టీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోలేదు' అని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయితే, అణగారిన వర్గాలు, రైతులు, వ్యవసాయదారులతో సహా సమాజంలోని వంచనకు గురైన వర్గాల ప్రయోజనాలకు సంబంధించిన 'విశాలమైన, విస్తృతమైన సిద్ధాంతపరమైన అంశాల' పట్ల తన నిబద్ధత ఎప్పటిలాగే దృఢంగా కొనసాగుతుందన్నారు. దాదాపు అర్ధ శతాబ్దం పాటు నా సహచరుడిగా కొనసాగిన నితీష్ కుమార్ పట్ల వ్యక్తిగత గౌరవం కూడా ఏమాత్రం మారలేదన్నారు. 'సంబంధిత వ్యక్తులందరితో సంప్రదించిన తర్వాత తన తదుపరి కార్యాచరణ త్వరలోనే ప్రకటిస్తానని త్యాగి చెప్పారు. 'నా రాజకీయ మిత్రులు, సానుభూతిపరులు, కార్యకర్తలలో కొందరు, దేశంలోని రాజకీయ పరిస్థితులపై చర్చించడానికి ఈనెల 22న రఫీ మార్గ్‌లోని మావ్లాంకర్ హాల్‌లో ఏకాభిప్రాయం కలిగిన వ్యక్తుల సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నారు' అని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు. భారతరత్న చౌదరి చరణ్ సింగ్ జీ, డాక్టర్ రామ్ మనోహర్ లోహియా జీ, భారతరత్న కర్పూరి ఠాకూర్ జీల ఆలోచనలు, సిద్ధాంతాల నుండి స్ఫూర్తి పొందుతూనే ఉంటామని ఆ సీనియర్ సోషలిస్ట్ నాయకుడు పేర్కొన్నారు.

# అసెంబ్లీ ఎన్నికలకు 1,111 మంది పరిశీలకులు : ఇసి




**న్యూఢిల్లీ :** వచ్చే నెలలో జరగనున్న రాష్ట్ర శాసన సభ ఎన్నికలు, ఉప ఎన్నికల కోసం ఎన్నికల సంఘం (ఇసి) 1,111 మంది పరిశీలకులను నియమించింది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అసోం, కేరళ, పుదుచ్చేరి శాసనసభలకు ఎన్నికలు జరుగుతుండగా, పలు రాష్ట్రాల్లో ఏప్రిల్‌లో ఉప ఎన్నికలు కూడా జరగనున్నాయి. ఈ పరిశీలకులు ఇసికి కళ్లు, చెవులుగా వ్యవహరిస్తూ, ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూస్తారని ఎన్నికల సంఘం తెలిపింది. గురువారం నాటికి పరిశీలకులు తమ తమ శాసనసభ నియోజకవర్గాల్లో ఉండాలని ఇసి ఆదేశించింది. అక్కడికి చేరుకున్న తర్వాత, పరిశీలకులు తమ సంప్రదింపు వివరాలను బహిరంగపరుస్తారని, అలాగే, అభ్యర్థులు, రాజకీయ పార్టీలు లేదా వారి ప్రతినిధులు లేదా ప్రజలలోని ఎవరినైనా కలిసి ఎన్నికల సంబంధిత సమస్యలను వినడానికి ప్రతిరోజూ ఒక నిర్దిష్ట సమయాన్ని కేటాయిస్తారని ఇసి తెలిపింది.

**సర్టిఫికెట్స్ పోయినవి**

నేను, **మాదుగుల నిరంజన్ తండ్రి సాంబయ్య**, ఇ.నెం. 2-78, మహేశ్వరం గ్రామం, నర్సంపేట మండలం, వరంగల్ జిల్లా. నేను మా ఇంటి నుండి నర్సంపేట ఎంఆర్‌ఓ ఆఫీస్‌కు మోటార్ సైకిల్‌పై వస్తుండగా మార్గమధ్యంలో బండి ట్యాంక్ కవర్ నుండి నా యొక్క **ఎస్.ఎస్.సి మెమో (HT No. 515417)** మరియు **ఇంటర్‌మీడియట్ మెమో (HT No. 713945)** ఒరిజినల్ సర్టిఫికెట్స్ జారి పోయినవి. కావున దొరికిన వారు ఈ నంబర్ **9849606670** తెలుపగలరని మనవి.

ఇట్లు
**మాదుగుల నిరంజన్ తండ్రి సాంబయ్య,**
మహేశ్వరం గ్రామం,
నర్సంపేట మండలం, వరంగల్ జిల్లా.

# ప్రజాస్వామ్య విలువలకు గండి!

ఏ ఒక్క అవకాశాన్నీ విడిచిపెట్టకుండా, కేంద్రంలోని బిజెపి సర్కారు ప్రజాస్వామ్య విలువలకు గండి కొడుతునే ఉంది. భారత ఎన్నికల సంఘం (ఇసిఐ)నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతానికి ప్రకటించిన అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ తీరు ఈ విషయాన్ని మరోసారి స్పష్టం చేసింది. అస్సాం, కేరళలతోపాటు కేంద్రపాలిత ప్రాంతం పాండిచ్చేరిలో ఎన్నికలను ఏప్రిల్ 9న ఒకే విడతలో నిర్వహించాలని నిర్ణయించిన ఇసిఐ, తమిళనాడు లో దాదాపు రెండు వారాల తర్వాత ఒకే విడతతోపాటు, పశ్చిమ బెంగాల్‌లో మొదటి విడత పోలింగ్‌కు అంత సమయం తీసుకోవడం అనుమానాలకు తావిస్తున్నది. ‘ఒకే దేశం.. ఒకే ఎన్నిక’ అంటూ నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రయత్నాలు చేసినప్పుడు, ‘సిద్ధం’ అని ప్రకటించిన ఇసిఐకి కేవలం నాలుగు రాష్ట్రాల్లో ఎన్నికలకు రెండు వారాల సుదీర్ఘ విరామం అవసరమా? అంతేకాదు, పశ్చిమ బెంగాల్‌లో చీఫ్ సెక్రెటరీ, హోమ్ సెక్రటరీ, డిజిపిసహా పలువురు అత్యున్నత అధికారుల బదిలీ వెనక ఆంతర్యం ఏమిటి? నిజానికి, ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడమే ఇసిఐ అహంకార ధోరణికి నిదర్శనం. ఫిబ్రవరి 28న తుది ఓటర్ల జాబితా ప్రచురించిన తరువాత కూడా, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పశ్చిమ బెంగాల్‌లో ‘సర్’ ప్రక్రియ ఆగలేదు. 60లక్షల మంది ఓటర్ల భవిష్యత్తు అనిశ్చితిలోకి జారుకుంది. చట్టం ప్రకారం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే ముందే సంపూర్ణ ఓటర్ల జాబితా సిద్ధంగా ఉండాలి. అయితే ఈ నిబంధనను పక్కన పెట్టి, కేంద్ర ప్రభుత్వం తమ అజెండాను ముందుకు నెట్టినట్టు కనిపిస్తున్నది. ఎన్నికల్లో పోటీ చేయడం ఒక పౌరుని హక్కు, ఓటు వేయడం ఎంత ముఖ్యమో అదీ అంతే ముఖ్యమైనది. కానీ చాలామంది తమ పేర్లు సమయానికి జాబితాలో లేకపోవడం వల్ల పోటీ చేయలేకపోతారు. మరికొందరు ఓటు కూడా వేయలేకపోతారు. ఎన్నికల సంఘం ప్రకటన ప్రకారం పశ్చిమ బెంగాల్‌లో సందేహాస్పద ఓటర్లపై విచారణ జరుగుతుంది. అదే సమయంలో అనుబంధ ఓటర్ల జాబితాలు విడుదల అవుతాయి. షెడ్యూల్ ప్రకటించే సమయంలో, ఈ అనుబంధ జాబితా క్రమంగా విడుదల అవుతుందని, పేర్లు వచ్చేకొద్దీ వాటిని జాబితాలో చేరుస్తామని ఇసిఐ ప్రకటించడం విడ్డూరం. ఒకటికాదు.. రెండుకాదు.. ఏకంగా 60లక్షలకుపైగా పేర్లు ఇంకా అనిశ్చితిలో ఉన్న సమయంలోనే ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేయడంలో ఆంతర్యం ఏమిటి? దేశ చట్టాల ప్రకారం, ఓటర్ల జాబితా పూర్తిగా సిద్ధం కాకుండా ఎన్నికలను ప్రకటించడం నిషిద్ధం. కానీ పశ్చిమ బెంగాల్ సందర్భంలో జరుగుతున్నది చట్ట విరుద్ధం. అసంపూర్తి జాబితాను తుది జాబితాగా చూపిస్తూ ఎన్నికలను నిర్వహించే ప్రయత్నం. బెంగాల్‌లో పాగా వేయాలని చాలాకాలంగా ప్రయత్నిస్తున్న బిజెపి ఆడుతున్న నాటక ప్రహసనం. అస్సాం, కేరళ, పాండిచ్చేరి ఎన్నికల తర్వాత ఎక్కువ సమయం తీసుకోవడం బిజెపి వ్యూహాత్మక ఎత్తుగడ కావచ్చు. అత్యున్నత అధికారుల బదిలీ ఈ అనుమానాన్ని బలపరుస్తుంది. రెండు వారాల వ్యవధి లో ఏదైనా జరగవచ్చు... ఏమైనా చేయవచ్చు.. అనే ధీమా కేంద్రానికి ఉండవచ్చు. రాజ్యాంగ వ్యవస్థలను పార్టీ అనుబంధ సంస్థలుగా మార్చుకున్నదని ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణలు కేవలం విమర్శలు కావని ఇసిఐ తీసుకున్న నిర్ణయం రుజువు చేస్తున్నది.

తమిళనాడులో నటుడు విజయ్ పార్టీ ‘తమిళగ వెట్రి ఖజగం’ (టివికె) తో పొత్తుకు తహతహలాడుతున్న బిజెపి, అస్సాం, కేరళ, పాండిచ్చేరి ఎన్నికల తర్వాత బేరసారాలకు దిగినా ఆశ్చర్యం లేదు. తమిళనాడులో పట్టు సంపాదిస్తే, ఆ తర్వాత దక్షిణ భారత దేశంలో పాగా వేయవచ్చన్నది బిజెపి ఆంతర్యం కావచ్చు. పరిస్థితులను చూస్తుంటే, ఈ అనుమానం కలగక మానదు. ఏదిఏమైనా, మోదీ ప్రభుత్వం తన ఎజెండాను ముందుకు తీసుకెళుతున్నట్టు కనిపిస్తున్నది. బిహార్‌లో ‘సర్’ చెల్లుబాటుపై తుది తీర్పు రాకముందే ఎన్నికలు జరిగాయి. వేలాదిమంది ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయారు. న్యాయం ఆలస్యమైతే అది అన్యాయమే అవుతుందనే లోకోక్తి బిహార్‌లో రుజువైంది. ఇప్పుడు పశ్చిమ బెంగాల్‌లోనూ అదే పరిస్థితి కనిపిస్తున్నది. అసంపూర్తి ఓట్ల జాబితాతోనే ఎన్నికల ప్రకటన వెలువడింది. ఒకవైపు విచారణలు కొనసాగుతునే ఉన్నాయి. మరోవైపు నామినేషన్ల చివరి రోజుకే తుది అనుబంధ జాబితా వస్తుంది. అంటే ఓటు కోల్పోయేవారు... ఎన్నికల్లో పోటీ చేయలేకపోయే వారు ఎక్కువగానే ఉండవచ్చు. ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకొని, ప్రజల కోసం పనిచేస్తూ, న్యాయబద్ధంగా ఓట్లు సంపాదించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలం. అన్ని రాజకీయ పార్టీలు తప్పక అనుసరించాల్సిన మార్గం. కానీ, అధికారం కోసం బిజెపి ఎంతకైనా తెగిస్తుందని ఎన్నో సందర్భాల్లో రుజువైంది. బిహార్‌లో నితీష్ కుమార్‌ను పావుగా వాడుకున్న తీరు రాజకీయ నైతికత పతనమవుతున్నదనడానికి నిలువెత్తు నిదర్శనం. యంత్రాంగాన్ని సమాయత్తం చేయడం కోసమే, అస్సాం, కేరళ, పాండిచ్చేరి పోలింగ్ తర్వాత ఇసిఐ రెండు వారాల సమయం తీసుకుందనుకుంటే, జమిలీ ఎన్నికలను ఏ విధంగా నిర్వహిస్తుందనేది ప్రశ్న.

లోక్‌సభతోపాటు, దేశంలోని అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరిపే సత్తా ఉన్న ఇసిఐకి ఇంత వ్యవధి అవసరమా? ‘సర్’ అంశాన్ని తెరపైకి తీసుకొచ్చి, అర్హులకు ఓటు హక్కు కల్పించడమే లక్ష్యమని కేంద్రం చెప్తున్నప్పటికీ, ఏదో ఒక మార్గంలో అధికారాన్ని చేజిక్కించుకోవడమే లక్ష్యంగా కనిపిస్తున్నది. ఎన్నికల షెడ్యూల్‌లో భారీ వ్యవధి నుంచి పశ్చిమ బెంగాల్‌లో ఉన్నతాధికారుల బదిలీ వరకూ ఇసిఐ నిర్ణయాలు అనుమానాలను తావిస్తున్నాయి. ఇసిఐ స్వయంగానే ఈ నిర్ణయాలు తీసుకుందా లేక కేంద్ర ప్రభుత్వ జోక్యం ఉన్నదా? అనేది ప్రశ్న. వ్యవస్థల ప్రవర్తనపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. అన్యాయం జరుగుతున్నా, అదే ప్రక్రియ కొనసాగుతుండటం ప్రజాస్వామ్యంపై నమ్మకాన్ని దెబ్బతీస్తోంది. మొత్తం మీద, అసంపూర్తి ఓటర్ల జాబితాను తుది జాబితాగా ప్రకటించి, ఎన్నికలు నిర్వహించడం, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో పోలింగ్‌ను ఆలస్యం చేయడం ఇసిఐ చిత్తశుద్ధిని ప్రశ్నిస్తున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో అధికారుల బదిలీల తో స్వేచ్ఛా, నిష్పక్షపాత ఎన్నికలపై నీలినీడలు అలముకున్నాయి. అన్ని గమనిస్తున్న ఓటర్లు ఎలాంటి తీర్పునిస్తారో చూడాలి. ●



## పాక్ దాడిని ఖండిస్తున్నాం

అఫ్గానిస్థాన్‌లోని ఆస్పత్రిపై పాకిస్థాన్ వైమానిక దాడులు తీవ్రంగా ఖండించదగినవి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లింలు శాంతి, ఆత్మపరిశీలన, కరుణతో గడిపే పవిత్ర రంజాన్ మాసంలో ఈ దాడి జరగడం దారుణం. ఒక ఆసుపత్రిని అందులోని రోగులను లక్ష్యంగా చేసుకోవడాన్ని ఏ మతమూ, ఏ చట్టమూ, ఏ నైతికతా సమర్థించలేవు. ఈ నేరపూరిత చర్యకు పాల్పడిన వారిని జవాబుదారీగా చేయాలి. ఆఫ్గానిస్థాన్‌లో పౌరులపై పాకిస్థాన్ చేస్తున్న విచక్షణారహిత దాడులను వెంటనే ఆపేలా అంతర్జాతీయ సమాజం కృషి చేయాలి. మృతుల కుటుంబాలకు భారత్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తుంది. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తుంది. ఈ విషాద సమయంలో ఆఫ్గానిస్థాన్ ప్రజలకు భారత్ సంఘీభావంగా నిలుస్తుంది.

– ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి హరీశ్ పర్వతనేని



## రక్షణ రంగానికి ఆయుధాలను అందిస్తున్న ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీలు

దేశ రక్షణలో అహరహం తలమునకలైన త్రివిధ దళాలు భారతీయ ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నావికా బలగాలకు ఆయుధ శక్తిని నింపుతున్న ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీలు గత రెండు శతాబ్దాలకు పైగా అవిశ్రాంత అమూల్య సేవలను అందిస్తున్నాయి. మన దేశ త్రివిధ దళాలకు అవసరమయ్యే ఆయుధాలు, మందుగుండు సామాగ్రి, రక్షణ కు వినియోగించే ఎలక్ట్రానిక్ ఉపకరణాలను స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసే ప్రభుత్వ రక్షణరంగ సంస్థగా ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీలు అమూల్య సేవలను అందిస్తున్నా యి. భారత దేశ త్రివిధ సాయుధ దళాల వెనుక ఆయుధ శక్తిగా తన విశిష్టతల ను ప్రదర్శిస్తున్న ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీల చరిత్ర చాలా గొప్పది. వలసపాలకుల కాలంలో 18, మార్చి 1801న తొలి ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీ కలకత్తా సమీపాన కొస్సిపోర్ ప్రాంతంలో నెలకొల్పడంతో ఆ చారిత్రాత్మక సన్నివేశానికి గుర్తుగా ప్రతి ఏట 18 మార్చిన దేశ త్రివిధ దళాలు, ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీ బోర్డులు సంయుక్తంగా ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీల దినోత్సవంను ఘనంగా జరుపుకోవడం కొనసాగుతున్నది.

**భారతీయ రక్షణ రంగంలో 4వ దళం – ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు:**

మన త్రివిధ దళాలకు ధీటుగా 4వ సాయుధ బలగంగా ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీలు విశిష్ట సేవలను అందిస్తున్నాయి. కాలానుగుణంగా శాస్త్రసాంకేతిక పరిజ్ఞానాన్ని జీర్ణించుకుంటూ వివిధ రకాలైన ఆయుధాలు, మందు గుండు సామాగ్రి, రక్షణ రంగ వాహనాల రూపకల్పన, సిబ్బంది ప్రత్యేక దుస్తుల తయారీ, పర్వత ప్రాంత రవాణాకు సంబంధించిన ఉపకరణాలు, అత్యాధునిక ఎలక్ట్రానిక్ ఉపకరణాలను మన దేశ అవసరాలకు అనుగుణంగా తయారు చేసి సమయానికి అందిస్తూ దేశ రక్షణలో ప్రధాన భూమికను నిర్వహిస్తున్న ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీల సిబ్బంది సేవలను గుర్తించడం, దేశ రక్షణలో అమరత్వం పొందిన యోధులను స్మరించుకోవడం, అత్యాధునిక ఆయుధాల ప్రదర్శన, ఆధునిక పరిశోధనా ఫలితాల మూట విప్పడం, ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీల సేవకు సంబంధించిన ఫోటో ప్రదర్శనలు, పరేడ్ల నిర్వహణ లాంటి కార్యక్రమాలను ఈ వేదికగా నిర్వహించడం జరుగుతుంది. దేశవ్యాప్తంగా 41 ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీలు 24 ప్రాంతాల్లో స్థాపించడంతో పాటు 9 శిక్షణ కేంద్రాలు, 3 ప్రాంతీయ మార్కెటింగ్ కేంద్రాలు, 4 ప్రాంతీయ భద్రత కార్యాలయాలు 5 ఆపరేషనల్ విభాగాలుగా విస్తరించి ఉన్నాయి. అత్యధికంగా మహారాష్ట్రలో 10, యుపిలో 09, ఎంపి/తమిళనాడుల్లో 06 చొప్పున ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు స్థాపించడం జరిగింది.

రెండవ ప్రపంచ యుద్ధం నుంచి మొన్నటి ఆపరేషన్ సింధూర్ వరకు తన ప్రత్యేకతను నిలుపుకుంటూ వస్తున్న ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీలు రానున్న కాలంలో కూడా త్రివిధ దళాలకు ఆయుధ శక్తిని అందిస్తూ దేశ సమగ్రత, సమైక్యతలను కాపాడటంలో తనదైన పాత్రను పోషిస్తాయి. భరతమాత సేవలో ప్రాణాలర్పించిన ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీలకు సంబంధించిన అమరులకు ఘన నివాళులు అర్పించడం, ప్రస్తుతం సేవలు అందిస్తున్న సైనికులకు ధైర్యంగా నిలవడం మన కనీస బాధ్యత.

**(18 మార్చి ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీల దినోత్సవం సందర్భంగా)**

# లేబర్ కోడ్‌ల అమలు నిలుపుచేయండి!



జి.అనురాధ
BOC రాష్ట్ర అధ్యక్షురాలు,
9959632366

మోదీ ప్రభుత్వం కార్మికులు, సంఘాల వ్యతిరేకతను పెడచెవినపెట్టి ఏప్రిల్ ఒకటో తేదీ నుండి నాలుగు లేబర్ కోడ్‌లను అమలుచేసేందుకు సిద్ధపడి గెజిట్‌ను విడుదల చేసింది. 2020లో బిజెపి ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి దీని స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను రూపొందించింది. రద్దుచేసిన చట్టాలు బ్రిటీష్ కాలంనాటి చట్టాలైనందున వాటిని నవీకరణ చేసినట్లుగా బిజెపి అనుచరులు, మద్దతుదారులు మాట్లాడుతున్నారు. మోదీ ప్రభుత్వం రద్దుచేసిన 29 చట్టాల్లో 25చట్టాలు 1947తర్వాత భారత పార్లమెంటు ఆమోదించినవే. దేశవ్యాప్తంగా కార్మికులు, కార్మిక సంఘాలు అమలులో ఉన్న 29 కార్మిక చట్టాలను రద్దు చేయడాన్ని దాని స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను తేవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. నాలుగు లేబర్ కోడ్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల పిలుపు మేరకు సార్వత్రిక సమ్మెలు జరిగాయి. ఫిబ్రవరి 12న జరిగిన సార్వత్రిక సమ్మెలో సంఘటిత, అసంఘటిత రంగాలకు చెందిన 50కోట్లమంది కార్మికులు పాల్గొని తమ వ్యతిరేకతను తెలిపారు.

**లేబర్ కోడ్‌లు మింగిన అసంఘటిత కార్మిక చట్టాలు..**

మోదీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లలో బలైన చట్టాల్లో ఎంతో కాలం నుండి 37రకాలైన భవన నిర్మాణ కార్మికులు అనుభవిస్తున్న భవన నిర్మాణ కార్మికుల చట్టాలు సైతం ఉన్నాయి. నాలుగు లేబర్ కోడ్లలో ఒకటైన పారిశ్రామిక సంబంధాల కోడ్. 2020లో ట్రేడ్ యూనియన్ల చట్టం..1926,సోషల్ సెక్యూరిటీ కోడ్ (సామాజిక భద్రత కోడ్)..2020లో భవన నిర్మాణ కార్మికుల సెస్ చట్టం..1996,ఆక్యుపే షనల్ సేఫ్టీ,హెల్త్ అండ్ వర్కింగ్ కండిషన్స్ కోడ్ (వృత్తి పరమైన భద్రత ఆరోగ్యం పని పరిస్థితుల కోడ్..2020లో బిల్డింగ్ అండ్ ఇతర నిర్మాణ కార్మికుల చట్టం..1996 ఉన్నాయి. ఇదే కాకుండా వివిధ రకాలుగా అసంఘటిత రంగాలలో పనిచేస్తున్న కార్మికులకు సంబంధించి బీడీ మరియు సిగార్ వర్కర్స్ చట్టం 1966, సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ చట్టం..1976, ప్లాంటేషన్ల లేబర్ చట్టం..1957,అసంఘటిత కార్మికుల చట్టం..2008,సమాన పనికి సమాన వేతన చట్టం.. 1961,అంతర్రాష్ట్ర వలస కార్మికుల చట్టం.. 1979,సినీ కార్మికుల చట్టం..1981, డాక్ వర్కర్స్ చట్టం..1986 ఉన్నాయి. మోదీ ప్రభుత్వం ఉన్న చట్టాలను రద్దుచేసి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లలో కాల్చిన కర్రుతో వాతలు పెట్టే దానిలో జర్నలిస్టుల చట్టాలు కూడా ఉన్నాయి. సోషల్ సెక్యూరిటీ కోడ్ ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్ అండ్ వర్కింగ్ కండిషన్స్ కోడ్‌లో వర్కింగ్ జర్నలిస్ట్ ఇతర న్యూస్ పేపర్ చట్టం..1955, వర్కింగ్ జర్నలిస్టుల చట్టం..1958 ఉన్నాయి. ఇవేవీ మోది ప్రభుత్వం ప్రచారం చేస్తున్నట్లు బ్రిటిష్ వలస కాలంనాటి చట్టాలు కావు. అసంఘటిత కార్మికులు కోట్లాదిమంది పెట్టుబడి దారులకు, సంఘటిత రంగంలో ఉన్న కార్మికు లు విదేశీ స్వదేశీ కార్పొరేట్ సంస్థల అధిపతులకు, జర్నలిస్టులు బడా యాజమాన్యాలకు కట్టుబానిసలుగా పని చేయాలనే ఉద్దేశంతోనే ఈ నాలుగు లేబర్ కోడ్లను మోదీ ప్రభుత్వం తీసుకు వచ్చిందనేది నిర్వివాదాంశము.

**నిర్మాణ కార్మికుల నిధులపై కన్నేసిన కార్పొరేట్లు :** భవన నిర్మాణ రంగ కార్మికుల పోరాటాల ఫలితంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్స్ చట్టం..1996 సెక్షన్(18)కింద ఏర్పడిన భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో 25 లక్షల 72 వేల మంది కార్మికులు సభ్యులుగా చేరారు. ఇందులో 37రకాలైన పనులు చేసే కార్మికులు సభ్యులుగా ఉన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం 2014 సెప్టెంబర్ 17నుండి తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్స్ వెల్ఫేర్ బోర్డుగా మార్పుచేశారు. ఈ బోర్డులో కార్మిక సంఘాల ప్రతినిధులు,ప్రభుత్వ అధికారులు, యాజమాన్యాల ప్రతినిధులను సభ్యులుగా చేర్చి బోర్డును ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు సెస్ పేరు తో 564 కోట్లు వసూలు చేసేవారు.

అధికారపార్టీ నేతల అండ దండలు, అవినీతి అధికారుల సహకారం తో సెస్ చెల్లించకుండా మెట్రో, మెగా తదితర బడా నిర్మాణ సంస్థలు ఎగ్గొట్టేవారు. భవన నిర్మాణ కార్మికుల బోర్డు నిధులు సెస్సులపై ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలు కన్నేసాయి. దీనిలో భాగమే మిషన్ మోదీ పథకం పేరుతో కేంద్ర ప్రభుత్వం బీమా కంపెనీలకు మేలు చేసే పథకాన్ని తెచ్చింది.నాలుగు లేబర్ కోడ్‌ల ద్వారా భవన నిర్మాణ కార్మికుల సెస్సు నిర్వహణను ప్రభుత్వ ఆధీనంలో కాకుండా ప్రైవేట్ సంస్థల అధిపతుల ఆజమాయిషీలో పెట్టేందుకు సామాజిక భద్రత కోడ్ 2020లో రూపొందించబడింది. సెస్సును, నిధులను, బోర్డు నిధులను కార్మికుల కొరకు వినియోగించకుండా ఇతర పథకాలకు మళ్లించే చర్యలను అరికట్టేందుకు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్స్)తో ఆడిట్ చేయించాలని, కార్మిక సంక్షేమ పథకాలకు బోర్డు నిధులను ఖర్చు చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పుడు సామాజిక బాధ్యత కోడ్ 2020లోని నాలుగో అధ్యాయంలో 10 లోపు కార్మికులు పనిచేసేచోట ఏ సౌకర్యాలు, అవకాశాలు వర్తించే అవకాశంలేని విధంగా పేర్కొనబడింది. భవన మరియు నిర్మాణ పనుల నిర్వచనాన్ని మార్పు చేయడం జరిగింది. ఇది ఏమిటంటే ఒక వ్యక్తి లేదా వ్యక్తుల సమూహం సొంత నివాసం కొరకు దానికి సంబంధించిన పనుల విలువను రూ.10లక్షల నుండి 50 లక్షలకు పెంచింది. అంటే 50 లక్షల విలువైన నిర్మాణాలు, భవనాలు నిర్మాణం చేసినా వారు కార్మికులు కారు. వారు సంక్షేమ బోర్డులో పేర్కొన్న పథకాలకు అనర్హులుగా భావించబడతారు. ఒకవైపున మెగా, మెట్రో తదితర బడా నిర్మాణ సంస్థల నుండి సెస్సును వసూలు చేయకుండా వదిలేసి మరో పక్కన ఈ విధంగా చేయడం అంటే కార్మికుల బోర్డును నిర్వీర్యం చేయడమే అవుతుంది. వారికి బోర్డులో పేర్కొన్న హక్కులు సౌకర్యాలు అమలు చేయబడవు అన్నమాట. 50లక్షలు అంతకన్నా ఎక్కువ మొత్తాన్ని, ప్రభుత్వం నోటిఫై చేసిన కార్మికుల సంఖ్య కంటే ఎక్కువ మందిని నియమించుకునే నిబంధన వల్ల వారికి సెస్ నుండి మినహాయింపు కల్పించి సెస్ రాబడి తగ్గించడానికి, సంక్షేమ ప్రయోజనాలను ఎగ్గొట్టటానికి ఉద్దేశించబడినది.

కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తెచ్చిన సమయంలో వివిధ రంగాల కార్మికులకు అమలు చేయబడుతున్న సంక్షేమ పథకాలను రద్దు చేయడం జరిగింది. రద్దు చేయబడిన వాటిలో బీడీ వర్కర్స్ వెల్ఫేర్ సెస్ చట్టం తేదీ 1.7.2017, ఐరన్, మాంగనీస్, క్రోమ్ ఖనిజాల గనుల కార్మికుల వెల్ఫేర్ సెస్ చట్టం తేది.21.5.2016, మైకా మైన్స్ లేబర్ వెల్ఫేర్ సెస్ చట్టం తేది.21.5.2016, లైమ్ స్టోన్ గనుల కార్మికుల వెల్ఫేర్ సెస్ చట్టం తేది.21.5.2016 ఉన్నాయి.

**బోర్డు నిధులు మింగేసే ప్రయత్నంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం**

తెలంగాణ రాష్ట్రంలో 2023లో ఆరు గ్యారెంటీల పేరుతో ఇచ్చిన హామీలలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి తోడ్పడుతామని సైతం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో పేర్కొన్నది. అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడగానే తేది. 21.8.24న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను, బోర్డునిధులను అప్పనంగా ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు పూనుకొని రహస్య టెండర్లను పిలిచింది. దీనికి వ్యతిరేకంగా భవన నిర్మాణ కార్మిక సంఘాలు, కార్మికులు ఐక్యంగా పెద్దఎత్తున ఆందోళనలు చేశారు. కేంద్ర ప్రభుత్వం మిషన్ మోదీ పథకం సాకుతో అమలు చేసేందుకు చేస్తున్న కుటిల ప్రయత్నాలు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డు నిధులకు ప్రమాదకరంగా పరిణమించాయి. మోదీ ప్రభుత్వం అనుసరించే దారిలోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రయాణించ దలచుకున్నట్లు కనిపిస్తోంది.

నాలుగు లేబర్ కోడ్‌లలో కార్మిక సంఘం పెట్టుకొనే హక్కు లేకుండా చేస్తున్నది. మహిళలను రాత్రివేళలలో పనిచేయించేందుకు అవకాశం కల్పిస్తున్నది. భవన నిర్మాణ రంగంలో అత్యధిక మంది మహిళలే ఉన్నందున వారి భద్రత మరింత ప్రమాదంలో పడే అవకాశం ఉంది.

మోదీ అనుచరులు ఎల్ అండ్ టి అధినేత సుబ్రహ్మణ్య స్వామి, ఇన్ఫోసిస్ అధినేత నారాయణమూర్తి లాంటి కార్పొరేట్ సంస్థల అధిపతులు వారానికి 72నుంచి 90గంటలు అంటే రోజుకి 12నుండి 14గంటల పాటు పనులు చేయాలని కార్మికులకు ఉపదేశాలిస్తున్నందున భవన నిర్మాణరంగంలో కార్మికుల పనిగంటలు పెరిగే ప్రమాదకరమైన పరిస్థితులకు అవకాశం ఉంది. ఇప్పటికే 600 నుండి 1500 రూపాయ ల వరకు భవన ఇతర నిర్మాణ కార్మికుల రోజువారీ కూలీ అమలు జరిగింది. అయినా నిత్యావసర సరుకుల ధరలు, పిల్లలు చదువులు, ఇంటి అద్దెలు చెల్లించడానికి, కుటుంబ బతుకు బండిని లాగడం రోజు రోజు కు భారంగా మారుతుంది. ఇలాంటి పరిస్థితిలో ఇప్పుడు లేబర్ కోడ్లలో ఫ్లోర్ లెవెల్ వేజ్ పేరుతో 2019లో రూ.178లు, 2024 నాటికి రూ.174.లు కేంద్రం నిర్ణయిస్తే కార్మికుల జీవన పరిస్థితి ఎలా మారనుందో ఊహించుకోవచ్చు. కార్మికులు సమ్మె చేసే అవకాశాలు లేవు. కార్మిక శాఖ అధికారులను ఉత్సవ విగ్రహాలుగా మార్చి పారిశ్రామిక సంబంధాల కోడ్‌లో కార్మిక సంఘాల చట్టాన్ని మార్చడం జరిగింది.

పనిస్థలాల్లో రక్షణ లేకపోవడం, ప్రమాదాలలో గాయపడటం, ప్రాణాలు కోల్పోవడం లాంటి సమయాలలో సైతం నష్టపరిహారాలు చెల్లించడానికి వీలు కల్పించని లేబర్ కోడ్‌ల వల్ల నిర్మాణరంగ కార్మికులకు రానున్న రోజుల్లో అన్ని రకాల కార్మికులతో పాటు మరింత ఎక్కువగా భవన నిర్మాణ కార్మికులు, అసంఘటితరంగ కార్మికులు ప్రమాదకరమైన పరిస్థితులను అనుభవించాల్సి వస్తుంది.

భవన నిర్మాణరంగ కార్మికులకు ప్రమాదకరంగా మారిన నాలుగు లేబర్ కోడ్‌లను మోదీ ప్రభుత్వం ఏప్రిల్ ఒకటి నుండి అమలు చేస్తామని నవంబర్‌లోనే ప్రకటించింది. బిజెపి యేతర రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ, బెంగాల్ తదితర రాష్ట్రాల్లో నాలుగు లేబర్ కోడ్‌లను అమలుచేసేది లేదని ప్రకటించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి నాలుగు నెలలుగా ఎందుకు మాట్లాడటం లేదు? అధికారంలో ఉన్న కాంగ్రెస్ వైఖరి అనుమానాలకు దారితీస్తుంది.ఏప్రిల్ ఒకటి నుంచి తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కోడ్‌లను అమలుచేయమని స్పష్టంగా ప్రకటించాలి. రానున్న అసెంబ్లీలో ఈ మేరకు తీర్మానం చేయాలి. నాలుగు లేబర్ కోడ్లను రాష్ట్రంలో అమలు చేయకుండా చేసేందుకు ప్రభుత్వంతో తీర్మానం చేయించే వరకు భవన నిర్మాణ కార్మికులు, అసంఘటిత రంగంలోని కార్మికులు ఉద్యమాన్ని సాగించాలి.

# బాధ్యతారహిత ప్రజాప్రతినిధులు...నియంత్రించని సర్కార్

అలిశెట్టి ప్రభాకర్ అన్నట్లు ‘దొంగ’ సినిమా నిర్మాతలకి వేరే దిక్కేది! సగటు తెలుగు ప్రేక్షకుడి జేబే రోజూ దక్కేదీ! రైల్వేకోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తనను బలవంతంగా లొంగదీసుకుని వాడుకున్నాడని హర్ష వీణ అనే ప్రభుత్వ ఉద్యోగి రోజుకో వీడియో రిలీజ్ చేసినా ప్రభుత్వం నుంచి స్పందన లేదు. టిడిపికి చెందిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ ఓ మహిళతో వీడియో కాల్‌లో మాట్లాడుతూ ముద్దులు పెడుతున్న దృశ్యాలు గతంలో వైరల్ అయ్యాయి. దీంతో ఆయనపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఈ వీడియో వ్యవహారం తేల్చాలని ఆయన పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. అదే సమయంలో వీడియోలో ఉన్న టిడిపి మహిళా నేత గుంటుపల్లి వాణి ఓ వీడియో రిలీజ్ చేశారు. తన భర్తతో వీడియో కాల్ మాట్లాడిన వీడియోను డీప్ ఫేక్ చేసి ఎమ్మెల్యేను ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇక సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి అదుమూలం పై నమోదైన లైంగిక వేధింపుల కేసులో ఎంఎల్‌ఎ ని పార్టీ కార్యక్రమాల నుంచి పక్కకు తప్పించారు ఆముదాలవలస ఎంఎల్‌ఎ కూన రవికుమార్ తనను శారీరకంగా, లైంగికంగా వేధించాడని స్వయానా బాధితురాలు కెజిబివి ప్రిన్సిపాల్ సౌమ్య ఆరోపిస్తే నిజానిజాలు తేల్చాల్సిన ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తున్నది. ఇక బిజెపి ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి కుమారుడు సుధీర్ రెడ్డి డ్రగ్స్ కేసులో జైల్లో ఉన్నారు. తాజాగా ఏలూరు ఎంపి పుట్టా మహేష్ యాదవ్ బిఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే ఫైలెట్ రోహిత్ రెడ్డి మొయినాబాద్ ఫామ్ హౌస్‌లో డ్రగ్స్ సేవిస్తూ పట్టుబడ్డాడు. డ్రగ్స్ సేవించినట్లు పాజిటివ్ వచ్చినట్లు పోలీసు అధికారులు తెలియజేసారు. ఇక టివి 5 అధినేత తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బిఆర్ నాయుడు మహిళలతో రంకు భాగోతం వీడియోలో వైరల్ అవుతున్న చర్యలకు ఉపక్రమించని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. లడ్డు కల్తీ పై స్పందించిన సనాతన వాదులు మహిళలపై, చిన్నారులపై జరుగుతున్న లైంగిక హింసలపై స్పందన కరువయ్యింది. రాజమండ్రిలో కల్తీ పాలు తాగి 15 మంది మరణించారు. ఇంకా ఐదుగురు వెంటిలేటర్‌పై ఉన్నారు. 2024 నుంచి బాణాసంచా పేలుళ్లలో చనిపోయిన వారి సంఖ్య 60, మొన్న వేట్లపాలెం ఘటన మరువకముందే నిన్న గోపాలపట్నంలో పేలుడు. ఒక వైపు విద్యార్థులలో మానవ విలువలు సంస్కృతి వారసత్వం ఆధ్యాత్మిక చింతన పెంపొందించేందుకు చాగంటి లాంటి ఘనాపాటిని సలహాదారులుగా నియమించారు. మరోవైపు ఎర్ర చందనం స్మగ్లింగ్ చేస్తున్న ఒక గజదొంగ కథ ప్రేరణగా తీసిన సినిమాకు 1300 టికెట్టు పెట్టి ప్రేక్షకుల నుంచి డబ్బు వసూలు చేసుకోవడానికి ప్రభుత్వం పర్మిషన్ ఇస్తున్నారు. తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారికి పారితోషికం ఇస్తున్నారు. అసలే బెట్టింగ్, ఆన్లైన్ గేమ్స్, జూదం, మోసం అమ్మాయిలపై అఘాయిత్యాలు, దొంగ రవాణా, గుడుంబా, గంజాయి, ఎర్ర చందనం స్మగ్లింగ్, వ్యభిచార రాకెట్, దందాలతో పోలీసులు సతమవుతుంటే విశృంఖలత్వాన్ని, హింస, స్మగ్లింగ్, ధూమపానం, మద్యపానం దొంగ పనులు చేసేవారిని హీరోగా తెరకెక్కించి ఏ మాత్రం సెన్సార్ లేకుండా ఎక్కడ తగ్గకుండా ‘తగ్గేదెలా’ జుగుప్సాకరమైన, అశ్లీల సన్నివేశాలను యువత పెడదోవకు ప్రేరేపించే సినిమాలు సెన్సార్ బోర్డు కళ్ళు మూసుకొని సర్టిఫై చేస్తున్నారు, మరోవైపు హిందూ మనోభావాలు లవ్ జిహాద్ అని గగ్గోలు పెట్టే మతతత్వవాదులకు అశ్లీలత కనిపించకపోవడం సిగ్గుచేటు. పత్రికలు కూడా సినిమా రివ్యూలలో అశ్లీలతను రాయకుండా దర్శకుడిని పొగుడుతూ, సెకండాఫ్‌లోని జాతర ఎపిసోడ్‌లో ఇదిరా పెళ్లాం అంటే అనేట్టు చూపించాడు అంటూ పుంఖాను పుంఖాలుగా రాస్తున్నారు.

చట్ట సభలు వ్యవస్థల్ని దిశా నిర్దేశం చేస్తాయి, ప్రజా ప్రతినిధులు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. కారణమేదైనా మనిషి వావివరసలు పరచిపోతున్నాడు. తప్పెవరిది అని ఒకరినొకరు నిందించుకోవడం కాకుండా, వ్యవస్థ మొత్తం గా ఆలోచించాలి.

డా. ముచ్చుకోట సురేష్ బాబు,
9989988912

# ఇవి ‘వస(చి)తి’ గృహాలా?

వరుస ఘటనలు సంక్షేమ వసతి గృహ విద్యార్థుల తల్లిదండ్రుల్లో భయాందోళన నెలకొంది. విష ఆహారం విద్యార్థుల ప్రాణాల మీదకు తెస్తుంది. వసతి గృహాల సిబ్బంది వ్యవహార తీరు ఈ పరిస్థితికి కారణమవుతుంది. పేదలు, బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారు తమ పిల్లలను సంక్షేమ వసతి గృహాలకు పంపుతున్నారు. సిబ్బంది అన్ని తామై పిల్లలను సంరక్షించాల్సిన పరిస్థితి ఉండగా అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. చాలా వసతి గృహాల్లో క్రమశిక్షణ లోపించిందన్న ఆరోపణలు ఒక పక్క మరో పక్క ఆహారం విషతుల్యమై విద్యార్థులు ఆసుపత్రుల పాలు కావడం సంక్షేమ వసతి గృహాలపై అపనమ్మకాన్ని పెంచేవిధంగా ఉంది. దమ్మపేట, మణుగూరులో జరిగిన ఘటనలు మరువకముందే ముదిగొండ మండలంలో చోటు చేసుకున్న ఘటన ఇప్పుడు తీవ్ర విమర్శలకు దారి తీస్తుంది. ఎప్పుడో ఒకసారి ఎక్కడో ఒక చోట జరిగిందంటే పొరపాటునో జరిగి ఉండవచ్చునని భావించవచ్చు. కానీ ఉమ్మడి జిల్లాలో వరుస ఘటనలు చోటు చేసుకోవడం పదుల సంఖ్యలో విద్యార్థులు ఆసుపత్రుల పాలు కావడం జరుగుతుంది. ఒక ఘటన చోటు చేసుకున్న తర్వాతనైనా అధికార యంత్రాంగం అప్రమత్తం కావాల్సి ఉండగా ఆ పని చేయడం లేదు. విద్యార్థులకు నిత్యం ఏమి వండి వడ్డిస్తున్నారు, వసతి గృహాల్లో పరిశుభ్రత, సిబ్బంది హాజరు తదితర విషయాలపై ఆయా శాఖల అధికారులకు పట్టింపు లేకుండాపోయింది. క్షేత్రస్థాయి సిబ్బంది మొదలు ఉన్నతాధికారుల వరకు ఉన్న ఆర్థిక సంబంధాలు క్షేత్ర స్థాయి సిబ్బందిని సరిగ్గా పనిచేసేలా చేయలేకపోతున్నాయి. విద్యార్థుల ప్రాణాల మీదకు వస్తున్నా తగు రీతిలో స్పందించడం లేదంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అవగతం చేసుకోవచ్చు. ఆహారం విషతుల్యమై విద్యార్థులకు వాంతులు, విరోచనాలు అనగానే ఆగమేఘాల మీద ఘటన స్థలికి చేరుకోవడం, ఒకరినో ఇద్దరినో విధుల నుంచి తప్పించి చేతులు దులుపుకోవడం ఇప్పుడు సంక్షేమ అధికారులకు అలవాటుగా మారింది. విధుల నుంచి తప్పించిన వారిని రెండు మూడు నెలల్లో తప్పించిన వారే విధుల్లోకి తీసుకుని మీకు మేమున్నాం మీరు ఏమైనా చేయండి అంటూ బాసటగా నిలిచినట్లు ఉంది పరిస్థితి. మార్చి మాసంలోనే మూడు ఘటనలు ఉమ్మడి జిల్లాలో చోటు చేసుకున్నాయి. ఆ తర్వాతనైనా నిరంతర పర్యవేక్షణ ఉందా అంటే అది కొరవడింది. విద్యాభ్యాసన గురించి పక్కనపెడితే మిగిలిన అన్ని విషయాల్లో సంక్షేమ హాస్టళ్లు వైఫల్యాలకు కేంద్రాలుగా మారుతున్నాయి. మెనూ అమలుపై ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. విద్యార్థి సంఘాల ఆందోళనలకు, వినతి పత్రాలకు సైతం అధికారులు స్పందించడం లేదు. చదువు సంగతి వదిలిపెట్టి కొందరు విద్యార్థులు గాడితప్పి మత్తు పదార్థాలను సేవించి హల్‌చల్ చేస్తుండగా కొందరు వేధింపులకు గురై ప్రాణాలను తీసుకుంటున్నారు. మొత్తం సంక్షేమ వసతి గృహ వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. ఈ విద్యా సంవత్సరం ముగుస్తున్న క్రమంలో వేసవిలో వసతి గృహాల పనితీరు మెరుగుదల, ఇతరత్రా వ్యవహారాలపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. తప్పిదాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించడంతో పాటు భవిష్యత్తులో తిరిగి ఉద్యోగానికి వచ్చే అవకాశం లేకుండా చర్యలు ఉంటే తప్ప మేలు జరిగే పరిస్థితి లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఆ దిశగా అధికారులు తగు చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం.



## లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకం

### ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన కలెక్టర్

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని రామస్వామి గుట్ట వద్ద 110 ఎకరాలలో నిర్మిస్తున్న 2160 ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌసింగ్ కాలనీని త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న మోడల్ హౌజింగ్ కాలనీని, అంతర్గత రోడ్లు, సభాస్థలిని, మొక్కలు నాటడం, హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించి, మిగిలిపోయిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను అదేశించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రీయ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, అర్హత లేని వారికి ఈ జాబితాలో పేరు ఉండకూడదని స్పష్టం చేశారు. అత్యంత అర్హులైన వారికి ప్రాధాన్యం ఇచ్చి, సూక్ష్మంగా పరిశీలించి ఎటువంటి అవకతవకలకు తావులేకుండా ఈ ప్రక్రీయ చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాసగౌడ్, హౌసింగ్ పిడి సిద్దార్థ, జిల్లా ఉద్యానవన అధికారి నాగయ్య, మిషన్ భగీరథ ఈఈ కరుణాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసిల్దార్ కవిత, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## గ్యాస్ ధరలు నియంత్రించాలి



**ప్రజాపక్షం/రామన్నపేట** : దేశవ్యాప్తంగా పెరిగిన గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో మంగళవారం రామన్నపేట మండల కేంద్రంలోని సుభాష్ సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామన్నపేట సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరి నరసింహ మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం వైఫల్యంతోనే దేశంలో చమురు సంక్షోభం ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట సిపిఐ మండల సహాయ కార్యదర్శి రామచంద్రు, నాయకులు ఎర్ర రమేష్ గౌడ్, సిపిఐ పట్టణ కార్యదర్శి రచ్చ యాదగిరి, ఏఐటీయూసీ మండల అధ్యక్షులు శివరాత్రి సమ్మయ్య, రైతు సంఘం అధ్యక్షుడు ఊట్కూరు కృష్ణ, ఊట్కూరి భగవంత, రమేష్ పాల్గొన్నారు.
గ్యాస్ ధరలకు తగ్గించాలి

## ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం ఆపాలి



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** అమెరికా, ఇజ్రాయెల్ ఇరు దేశాలు ఇరాన్,అరబ్ దేశాల్లోని గ్యాస్, ఆయిల్, ముడి చమురును కా చేయాలనే దురుద్దేశ్యంతో ఇరాన్ దేశంపై అక్రమంగా యుద్ధం చేస్తున్న అమెరికా, ఇజ్రాయిల్ దురహంకార చర్యలను, సామ్రాజ్యవాద అహంకారంతో చేస్తున్న యుద్ధంను వెంటనే ఆపాలని, ప్రపంచ శాంతిని పరిరక్షించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసిల్దార్ స్రవంతికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, ఎఐటియుసి జిల్లా నాయకులు సుధాకర్‌రెడ్డి, నాయకులు ఎడ్ల అంజిరెడ్డి, పోకల అంజనేయులు, షేక్ నబీసాబ్, ప్రతాని సైదులు, పంగ గోవిందు, సైదులు, రవి, కాశయ్య, శేషగిరి, చందాల నగేష్, పిట్టా మైసయ్య పాల్గొన్నారు.

## ఎల్లయ్య మృతి సిపిఐకి తీరని లోటు



**ప్రజాపక్షం/నాంపల్లి:** మండలంలోని కేతపల్లి గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకుడు పల్లేటి ఎల్లయ్య అకాల మరణం పార్టీకి తీరని లోటు అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఆర్.అంజయ్య చారి అన్నారు.మంగళవారం ఎల్లయ్య పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనోధైర్యం కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లయ్య సీపీఐ పార్టీ కోసం నిరంతరం కృషి చేస్తూ,పార్టీ ఉద్యమాలలో చురుకుగా పాల్గొనే నిబద్ధత కలిగిన నాయకుడని కొనియాడారు.గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. అలాంటి నాయకుడి మృతి పార్టీకి,గ్రామ శాఖకు తీరని లోటని అన్నారు.ఎల్లయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి కమ్యూనిస్టు బాధ్యత అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి సుదనబోయిన రమేష్, సహాయ కార్యదర్శి నేతాళ్ల రాజు,మండల కార్యవర్గ సభ్యులు ఊరుపాక వెంకటయ్య,కోరే సత్తయ్య,గిరి స్వామి,కానుగుల మహేష్,ఉప సర్పంచ్ బుషిపాక యాదయ్య పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి సహకారం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : న్యాయవాదుల సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని ఏఐసిసి సభ్యులు రాం రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. సూర్యాపేట బార్ అసోసియేషన్ ఎన్నికల సందర్భంగా మంగళవారం పట్టణంలోని వైట్‌హౌస్‌లో ఆయనను సూర్యాపేట బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు నూకల సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యం లో న్యాయవాదుల ప్రతినిధుల బృందం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి ఆశయసాధనే తన లక్ష్యమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు.

### పెండింగ్ ఎక్స్‌గ్రేషియా వెంటనే చెల్లింపునకు

# 25న ఎక్సైజ్ కార్యాలయం ముట్టడి

### గీత కార్మికుల హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలి
### పబ్బు వీరస్వామి పిలుపు



**ప్రజాపక్షం/నల్లగొండ:** గీత కార్మికులకు ఏళ్ల తరబడి రావలసిన పెండింగ్ ఎక్స్‌గ్రేషియా మొత్తాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25న ఎక్సైజ్ కార్యాలయం ముట్టడికి పెద్దఎత్తున తరలిరావాలని తెలంగాణ గీతా పనివారల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పబ్బు వీరస్వామి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన గీతా పనివార్ల సంఘం నల్లగొండ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. గీత వృత్తిని నిర్వీర్యం చేస్తూ కార్మికుల జీవనోపాధిని దెబ్బతీస్తున్న ప్రభుత్వ విధానాలపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 2022 సంవత్సరం నుండి పెండింగ్‌లో ఉన్న ఎక్స్రేషియా మొత్తాలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హరితహారం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా అన్ని గ్రామాల్లో తాటి,ఈత, ఖర్జూర చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించాలని సూచించారు. గీత వృత్తికి నష్టం కలిగిస్తున్న మద్యం బెల్ట్ షాపులను అరికట్టాలని కోరారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.యాదాద్రి భువనగిరి జిల్లా నందనంలో ఉన్న నీరా ప్రాజెక్టును పునరుద్ధరించి ధర్మభిక్షం పేరుతో కొనసాగించాలని సూచించారు.అలాగే గీత కార్మికుల ఐడెంటిటీ కార్డులు, లైసెన్సులను త్వరితగతిన జారీ చేయాలని ఎక్సైజ్ అధికారులను కోరారు.జిల్లా ప్రధాన కార్యదర్శి బొడిగె సైదులు మాట్లాడుతూ గీత వృత్తిపై ఆధారపడి మరణించిన కార్మికుల భార్యలకు వితంతు పింఛన్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రామాల్లో కల్లు దుకాణాల ఏర్పాటు కోసం వెయ్యి గజాల స్థలాన్ని కేటాయించాలని, నందనంలో నీరా పరిశ్రమలను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు.ఈ సమావేశంలో సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ సురిగి చలపతి, చింతపల్లి పుల్లయ్య, జయరాములు, బొమ్మరబోయిన లాలు, సహాయ కార్యదర్శులు పల్లె శంకర్, జోగు సురేందర్,మాదగోని మల్లయ్య,కొంకా దేవేందర్,లెనిన్, గంగాదేవి, గాలయ్య పాల్గొన్నారు.

## పిహెచ్‌సిలలో సాధారణ ప్రసవాలు పెరగాలి

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్
### మెడికల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/చింతలపాలెం (మేళ్ళచెర్వు)** : ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వైద్య నిపుణులచే ప్రతి పిహెచ్‌సిలో మెడికల్ క్యాంప్‌లు నిర్వహించడం జరుగుతుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కోరారు. మంగళవారం మేళ్లచెర్వు పిహెచ్‌సిలో జరిగే మెడికల్ క్యాంప్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ క్యాంప్‌ల ద్వారా జనరల్ మెడిసిన్, పిడియాట్రిక్, గైనకాలజీ, ఆర్థోపెడిక్, ఆప్తమాలజీ, మహిళలకు గర్భాశయ ముఖ క్యాన్సర్‌ను గుర్తించే టాప్‌స్పెయర్, కంటికి సంబంధించి క్యాట్రాక్ట్ లోపం, బిపి, షుగర్, చిన్న పిల్లల్లో ఎత్తు, పోషకాహార లోపాలకు చెందిన వైద్య నిపుణులు రోజుకొక్క పిహెచ్‌సికి వచ్చి వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. వైద్యంతోపాటు అవసరమైన వారికి మందులను ఉచితంగా అందించడంతోపాటు ఆరోగ్యం మెరుగుపడేలా తగు సూచనలు, సలహాలు ఇస్తారన్నారు. ఇంకా ఏమైనా శస్త్ర చికిత్సలు చేయాల్సి వస్తే మెరుగైన వైద్యం కోసం జనరల్ హాస్పటల్‌కు రిఫర్ చేయడం జరుగుతుందన్నారు. క్యాంప్‌లో 300 మంది ఓపి నమోదు కావడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. పిహెచ్‌సిలలో సాధారణ ప్రసవాలు పెరిగేలా ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు.

**విద్యార్థులతో కలిసి భోజనం...** మేళ్ళచెర్వు మండల కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్కూల్‌లో కలెక్టర్ హాస్టల్‌లోని గదులను, వంట గదిని పరిశీలించి, విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. విద్యార్థులను ప్రతిరోజు వంట బాగుంటుందా, మెను ప్రతిరోజు అమలు చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పదవ తరగతి వార్షిక పరీక్షల్లో ప్రతి విద్యార్థి ప్రతి సబ్జెక్టులో కనీసం 70 శాతానికి పైగా మార్కులు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకొని రావాలని కోరారు. కలెక్టర్ వెంట డిప్యూటి డిఎంహెచ్‌ఓ మాధవ్ కుమార్, డాక్టర్ సుధాకర్ నాయక్, వైద్యులు యశ్వంత్, మణి, ప్రజ్ఞ, సాయిశ్రీ, వెంకటేశ్, సమీర, మెడికల్ అధికారి, వైస్ ప్రిన్సిపాల్ మధు, ఇంచార్జి తహశీల్దార్ సురేందర్ రెడ్డి, సర్పంచ్ బచ్చు పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉగాది నాటికి ఇందిరమ్మ ఇండ్ల సామూహిక గృహప్రవేశాలు



### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఎంపిడిఒలకు ఆదేశం

**ప్రజాపక్షం/నల్లగొండ** : ఉగాది రోజున ఇందిరమ్మ ఇండ్ల సామూహిక గృహప్రవేశాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఎంపీడీవోలకు ఆదేశించారు.మంగళవారం కలెక్టర్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ ఆయన పలు కీలక అంశాలపై సూచనలు ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలతో పాటు, సంబంధిత బిల్లుల చెల్లింపులను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు.వ్యక్తిగత మరుగుదొడ్ల బిల్లులను కూడా చెల్లించాలన్నారు. శాసనసభ్యుల సమ్మతితో గృహప్రవేశాలు నిర్వహించాలని సూచించారు.ఉపాధి హామీ పథకం కింద నిర్మిస్తున్న పాఠశాల టాయిలెట్లు,గ్రామ సమాఖ్య భవనాలు,గ్రామపంచాయతీ కార్యాలయాలు,అంగన్వాడీ భవనాల పనులను ఇంకా ప్రారంభించని పనుల వివరాలు సమర్పించాలని ఆదేశించారు.ఏప్రిల్ 2న జరగనున్న ప్రజాపాలప్రగతి ప్రణాళిక గ్రామసభల కోసం,ఆయా పథకాల లబ్ధిదారుల జాబితాలను సిద్ధం చేసి ఎంపీడీవోలకు పంపాలని చెప్పారు.గ్రామసభల్లో లబ్ధిదారుల పేర్లను చదివి వినిపించాలని సూచించారు.మండల,జిల్లా స్థాయి నివేదికలను కూడా సిద్ధం చేయాలని ఆదేశించారు.జనగణన కోసం అవసరమైన ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు మరియు ఇండ్ల జాబితాను ముందుగానే సిద్ధం చేసుకోవాలని తెలిపారు.ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్ కుమార్,డిపిఓ శంకర్ నాయక్, పంచాయతీరాజ్ ఈఈ గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

## సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం

### యుద్ధ ప్రభావం ప్రతీ ఒక్కరిపై పడుతుంది
### సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**ప్రజాపక్షం/నల్లగొండ :** అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం నిర్వహించాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ,సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. మంగళవారం నల్లగొండలోని స్థానిక క్లాక్ టవర్ సెంటర్లో యుద్ధం వద్దు శాంతి ముద్దు నినాదంతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అమెరికా తన సామ్రాజ్యవాద కాంక్షతో ఇతర దేశాలతో యుద్ధం చేస్తున్నారని విమర్శించారు. యుద్ధం వల్ల అన్ని దేశాలపై ప్రభావం పడుతుందని చమురు ధరలు,గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగిపోయి ప్రజలపై భారాలు పడతాయన్నారు. అమెరికా చేస్తున్న యుద్ధం పై భారత ప్రధాని నరేంద్ర మోడీ మౌనంగా ఉండడం ఏమిటని ప్రశ్నించారు.ఈ మౌనాన్ని వీడాలని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం ప్రజలపై భారాలు వేస్తుందని నూతన చట్టాలు తీసుకువచ్చి ఇబ్బందుల పాలు చేస్తున్నారని ఆరోపించారు. వాటిని తిప్పి కొట్టేందుకు పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి,జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి,నారి ఐలయ్య,బండ శ్రీశైలం,పాలడుగు నాగార్జున,కందాల ప్రమీల, పాలడుగు ప్రభావతి,సయ్యద్ హాషం,జిల్లా కమిటీ సభ్యులు మహ్మద్ సలీం,నర్సిరెడ్డి,జిట్టా నగేష్,సరోజ పాల్గొన్నారు.




## జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయాలి



### మార్చి 28న యాదాద్రి జిల్లా వ్యాప్తంగా నిర్వహణ

**ప్రజాపక్షం/ఆలేరు :** జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, యాదాద్రి భువనగిరి ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ విజయవంతం కోసం ఆలేరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు సూచనల మేరకు ఈ కార్యక్రమం జరిగింది. సంస్థ కార్యదర్శి వి.మాధవిలత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఆలేరు జూనియర్ సివిల్ జడ్జి ఆర్.అజయ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ మార్చి 28వ తేదీ శనివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ను విజయవంతం చేయడానికి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్, మోటార్ యాక్సిడెంట్, బ్యాంకు రికవరీ, చెక్ బౌన్స్ వంటి కేసులను ఎక్కువగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ స్థాయి వరకు ప్రచారం నిర్వహించి ప్రజలకు లోక్ అదాలత్ ప్రాముఖ్యతను వివరించాలని, సంబంధిత కక్షిదారులకు ముందుగానే నోటీసులు అందజేయాలని సూచించారు. అదేవిధంగా ప్రతిరోజూ ప్రీసిట్టింగ్స్ నిర్వహిస్తూ, పరస్పర చర్చల ద్వారా కేసులను ముందుగానే పరిష్కరించే అవకాశం ఉందని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా వేగవంతమైన, ఖర్చు తగ్గించే న్యాయ సేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీపీ బి.హరిబాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు వనమా రాజు, ఉపాధ్యక్షులు టి.హరికృష్ణ, ట్రెజరర్ రవికుమార్, న్యాయవాదులు జూకంటి రవీందర్, సీసా శ్రీనివాస్ గౌడ్, రావుల రవీందర్ రెడ్డి, భీమగాని శ్రీనివాస్ గౌడ్, కె.వి ప్రసాద్, వంగరి శివకుమార్, తోటకూరి రాజు, సామల రమేష్, సంపత్, మొరిగాడి కృష్ణ పాల్గొన్నారు.

## వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి రావొద్దు

### మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి
### సమస్యలు పరిష్కరించి సమన్వయంతో అభివృద్ధి చేయాలి



**ప్రజాపక్షం/చౌటుప్పల్** : మున్సిపల్ కార్యాలయంలోని చైర్మన్ చాంబర్లో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ బాధ్యతలు స్వీకరణ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దంపతులకు వేదమంత్రాలతో పూర్ణకుంభంతో పండితులు పాలకవర్గ సభ్యులు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి, ఆయన సతీమణి లక్ష్మి లు మున్సిపల్ ఛాంబర్‌లో మొగుదాల పావని రమేష్ గౌడ్‌ను కుర్చీలో కూర్చోబెట్టి సన్మానించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచిన కౌన్సిలర్ సభ్యులందరినీ అభినందించారు. పోటీలో చాలామంది ఉంటారు కానీ ప్రజల మద్దతు ఉన్నవారే ఒక్కరే గెలుస్తారని అన్నారు. వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి రాకుండా చూసుకోవాలని పాలకవర్గానికి సూచనలు చేశారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం సమన్వయంతో పనిచేసి మౌలిక సదుపాయాలు, మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పారిశుద్ధ్యం రహదారుల వంటి సమస్యలను త్వరగా పరిష్కరించే దిశగా పనిచేయాలని కోరారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో 46 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మునుగోడు కాంగ్రెస్ ఇంచార్జ్ పబ్బు రాజు గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య,ఆకుల ఇంద్రసేనా రెడ్డి, ఆర్టీవో శేఖర్ రెడ్డి, సర్పంచ్‌లు, మాజీ ప్రజాప్రతినిధులు మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి

**ప్రజాపక్షం/కోదాడ:** ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా కోదాడ టౌన్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పి కె.నర్సింహా అకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం కోదాడ టౌన్ పోలీస్‌స్టేషన్‌లోని పరిసరాలను, రికార్డులు, ఫిర్యాదుల నిర్వాహణ, కేసుల దర్యాప్తు, పెండింగ్ ఫైల్స్‌ను సమీక్షించి వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. అనంతరం సిసి కెమెరాల పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ ఫిర్యాదులపై తక్షణ స్పందనలతో ప్రజలకు భరోసా కల్పించాలని, కేసుల పెండింగ్ లేకుండా వేగంగా చర్యలు తీసుకోవాలని అదేశించారు. సిబ్బంది క్రమశిక్షణతో అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలని, మున్సిపాలిటి అధికారులతో సమన్వయం పెంచి రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను సక్రమంగా నియంత్రించాలని చెప్పారు. రోడ్లపై వ్యాపారాలు నిర్వహించడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని, వాటిని నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. రంజాన్, ఉగాది పర్వదినాల సందర్భంగా ప్రజలు మతభేదాలు లేకుండా సోదరభావంతో ఉత్సవాలు జరుపుకోవాలని కోరారు. ఈ తనిఖీలో కోదాడ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి, పట్టణ ఇన్స్‌పెక్టర్ శివశంకర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ రామారావు, ఎస్ఐ లు సుధీర్, చిన్న మల్సూర్, ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి పాల్గొన్నారు.

## పిల్లల మరణాల నివారణకు చర్యలు

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట** : చిన్నపిల్లల మరణాలకు గల కారణాలను ఆదిలోనే గుర్తించి, నివారించదగ్గ మరణాలు సంభవించకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రామకృష్ణ అధికారులను ఆదేశించారు. మంగళవారం యాదగిరిగుట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో యాదగిరిగుట్ట, సారాజిపేట మరియు రాజపేట మండలాల పరిధిలోని ఐదు సంవత్సరాలలోపు పిల్లల మరణాలపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లస్టర్ స్థాయి అధికారులకు మరియు సిబ్బందికి పలు కీలక శిశు మరణాలకు దారితీసే ఆరోగ్య సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన వైద్యం అందించాలి. గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారికి అవసరమైన అన్ని రకాల వైద్య పరీక్షలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు తల్లీబిడ్డల ఆరోగ్యంపై నిరంతరం నిఘా ఉంచాలని కోరారు. ఈ సమీక్షా సమావేశంలో యాదగిరిగుట్ట, సారాజిపేట, రాజపేట మండలాలకు చెందిన ప్రభుత్వ వైద్యులు, సూపర్వైజర్లు, హెల్త్ సిస్టర్లు మరియు ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్ పరిశ్రమలలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

### ఎఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విప్లవ్ డిమాండ్

**ప్రజాపక్షం/చౌటుప్పల్** : స్థానిక పరిశ్రమలలో స్థానికంగా ఉన్న నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఎఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండూరు విప్లవ్ అన్నారు. నేడు ఎఐవైఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాల నుండి చౌటుప్పల్ పరిసర ప్రాంతాల్లోని నిరుద్యోగులు అనేక ఉద్యమాలు చేసిన పరిశ్రమలలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం లేదని, అనేకమంది డిగ్రీ, పీజీలు పూర్తి చేసి పట్టాలు చేతపట్టుకొని ఉద్యోగ అవకాశాలు రాక మనోవేదనకు గురవుతుంటే, స్థానికులు అనే సాకుతో తమప్రాంతంలో బోలెడు కంపెనీలు ఉన్న ఉద్యోగం కోసం బయట వెతుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడిందని అన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న పంట పొలాలు, బూగర్భ జలాలు పూర్తిగా కలుషితం చేస్తున్నారని, రసాయన పరిశ్రమలు వ్యర్థలను యదేచ్ఛగా రోడ్లపై పారబోస్తున్న అధికారులు పట్టించుకోడంలేదని అన్నారు. ఈ ప్రాంతంలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా, ఇక్కడ ఉన్న వాతావరనాన్ని నాశనం చేస్తా ఉంటే ఇక్కడి ప్రజలు ఊరుకోబోరని, తప్పకుండ భవిష్యత్తులో తిరుగుబాటు తప్పదని అన్నారు. ఈ సమావేశంలో ఎఐవైయఫ్ నాయకులు బద్దుల సుధాకర్, దాసరి మనోహర్, గుండెబోయిన భాస్కర్, ఉడుత రాజు, దాసరి సిద్దు, రాంచరణ్, సాయితేజ తదితరులు పాల్గొన్నారు.






## ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష

**ప్రజాపక్షం/చార్మినార్:** పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చార్మినార్ జెడ్‌సీ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి ఇంజనీర్ విభాగం అధికారులను ఆదేశించారు. జోన్‌లోని అన్ని సర్కిళ్ల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి, మరమ్మత్తు, నిర్మాణ పనులపై జెడ్‌సీ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో జోనల్ ఇంజినిరింగ్ విభాగం ఎస్ఈ ఇందిర, ఈఈ సనావుద్దీన్, డిఈలు, ఏఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక పనులు



**ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా 12వ రోజు సందర్భంగా మంగళవారం చార్మినార్ జెడ్‌సీ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి స్థానికంగా కొనసాగుతున్న అభివృద్ధి నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. సంతోష్‌నగర్, యాకుత్‌పురా సర్కిళ్ల పరిధిలోని సైదాబాద్ సింగరేణి కాలనీ, లక్ష్మీ నగర్, పూర్ణోదయ కాలనీ, మాదన్నపేట్ ఈద్గా ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. జెడ్‌సీ వెంట సంతోష్‌నగర్ డీసీ మంగతాయారు, ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ ఇందిర, యూబిడి డిప్యూటీ డైరెక్టర్ దేవజ, ఎస్‌డబ్ల్యూఎం డిఈలు వెంకట్‌రాజు, రంజిత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/కంటోన్మెంట్:** ఆశా వర్కర్ల దీర్ఘకాలిక న్యాయమైన సమస్యలను పరిష్కరించేంత వరకు పోరాటం కొనసాగుతుందని సిఐటియు నగర నాయకుడు వెంకటేష్ అన్నారు. ఆశా వర్కర్ల న్యాయపరమైన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆమోదించి అమలు చేయాలని నిరసన వ్యక్తం చేస్తూ ఆశా వర్కర్లు సికింద్రాబాద్ హరిహర కళాభవన్ వద్ద ఉన్న డిస్టిక్ మెడికల్ ఆఫీసర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి బైఠాయించారు. కార్యక్రమంలో వెంకటేష్, దశరథ్, మల్లేష్, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

## 20న ఒయులో ఫార్మసిస్ట్ పోస్టుల జాబ్‌మేళా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉస్మానియా యూనివర్సిటీలోని ఎంప్లాయిమెంట్ బ్యూరో, అపోలో ఫార్మసీ సంయుక్త ఆధ్వర్యంలో ఓయు ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో ఈ నెల 20 న ఉదయం 11 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నారు. అపోలో ఫార్మసీలో ఫార్మాసిస్టు, అసిస్టెంట్ ఫార్మసిస్ట్‌లకు చెందిన 100 పోస్టులను ఈ జాబ్ మేళా ద్వారా భర్తీ చేయనున్నారు. డి.ఫార్మసీ, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ లేదా ఏదైనా డిగ్రీ చేసిన 18 నుండి 35 సంవత్సరాల వయసు గల యువతి, యువకులకు మాత్రమే ఈ జాబ్ మేళాలో అవకాశం కల్పిస్తున్నట్లు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డిప్యూటీ చీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.16,383 నుండి రూ.19,769 వేల వరకు వేతనం ఉండే ఈ ఫార్మసిస్ట్ ఉద్యోగాలకు మరిన్ని వివరాలకు టి. రఘుపతి(హెచ్ఆర్) ఫోన్ నంబర్ 8247656356 లో సంప్రదించాలన్నారు. విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్‌తో ఉస్మానియా యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ బ్యూరో వద్ద నేరుగా ఈ నెల 20 న హాజరు కావాలని పేర్కొన్నారు.

## 800 కిలోల చికెన్ స్వాధీనం

**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** నిలువ ఉంచిన చికెన్‌ను టాస్క్‌ఫోర్స్, బల్దియా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పార్శిగుట్టలోని ఏ1 ఫ్రెష్ చికెన్ సెంటర్‌పై దాడి చేసిన సందర్భంలో నిలువ ఉంచిన 800 కిలోల చికెన్ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇక్కడి నుంచి గ్రేటర్‌లోని బార్లు, రెస్టారెంట్లకు చికెన్‌ను సరఫరా చేస్తున్నట్లు సమాచారం. గత నెలలోనే ట్రేడ్ లైసెన్స్ గడువు ముగిసినా లైసెన్స్ రెన్యూవల్ చేసుకోకుండానే కొనసాగిస్తున్నారు. ఈ మేరకు షాపు నిర్వాహకుడు షకీల్‌తో పాటు అక్కడ విధులు నిర్వహిస్తున్న వారిని అదుపులోకి తీసుకోవడం జరిగింది.

## గ్యాస్ ఏజెన్సీ ఆకస్మిక తనిఖీ

గ్యాస్ అక్రమ కొరత సృష్టిస్తే
కఠిన చర్యలు : సిఆర్ఓ రాజిరెడ్డి
ఇప్పటి వరకూ 643 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** గ్యాస్ అక్రమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చీఫ్ రేషనింగ్ అధికారి (సిఆర్ఓ) రాజిరెడ్డి గ్యాస్ ఏజెన్సీలను హెచ్చరించారు. ఖైరతాబాద్‌లోని సందీప్తి హెచ్‌పిసిఎల్ గ్యాస్ ఏజెన్సీని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎటువంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడవద్దని గ్యాస్ డిస్ట్రిబ్యూటర్‌కు ఆయన చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు 643 గృహావసర గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నమన్నారు. గ్యాస్ ఏజెన్సీలో తాజా ఎల్‌పిజి సరఫరా పరిస్థితిని పరిశీలించారు.అక్కడికి వచ్చిన వినియోగదారులతో మాట్లాడి సరఫరా పరిస్థితిని, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ తనిఖీలో ఆయనతో పాటు జిల్లాపౌరసరఫరాల శాఖాధికారి శ్రీనివాస్,ఖైరతాబాద్ ఫీల్డ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### బలిమెల సంఘటనలో అమరులైన పోలీసు కుటుంబాలకు ..

# ఇళ్ల స్థలాల పట్టాలు అందజేత

డిజిపి బి.శివధర్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బలిమెల రిజర్వాయర్ లో మావోయిస్టులు దాడి చేసి 38మందిని హత్య చేసిన ఆనాటి దారుణ మారణ కాండ పోలీసు యంత్రాంగానికి తీరని వేదనను మిగిల్చిందని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి అన్నారు. బలిమెల సంఘటనలో అమరులైన పోలీసు కుటుంబ సభ్యులకు ఇళ్లస్థలాల పట్టాలను మంగళవారం డిజిపి కార్యాలయంలో ఆయన అందజేశారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ... 2008 జూన్ 29న మావోయిస్టులు జరిపిన ఆకస్మిక దాడిలో 32 మంది గ్రేహౌండ్స్ విభాగపు వీర జవాన్లు సహా మొత్తం 38 మంది మరణించిన సంఘటన రాష్ట్ర పోలీసు శాఖను విషాదంలో ముంచిందన్నారు. ఆ సమయంలో తాను ఎస్ఐబి డిఐజిగా బాధ్యతలు చేపట్టిన రెండు నెలల కాలంలోనే ఇటువంటి భారీ విషాదం ఎదురవ్వడం ఇప్పటికీ ఒక చేదు జ్ఞాపకంగా వెంటాడుతోందని శివధర్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన ఆ వీరుల కుటుంబాలను అక్కున చేర్చుకోవాలనే ఆకాంక్షతో హైదరాబాద్ శివారులో భూమి కేటాయింపు కోసం చేసిన ప్రయత్నాలు సుదీర్ఘ కాలం పాటు కొనసాగాయన్నారు. దాదాపు 18 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు నేడు తెరపడటం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అమరవీరుల వారసులకు అండగా నిలవాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడం వల్లే ఈ సమస్య పరిష్కారమైందని, బాధితులకు తగిన న్యాయం చేకూరిందని వెల్లడించారు. ఇన్నేళ్ల తర్వాత అమరుల కుటుంబాల చిరకాల వాంఛను నెరవేర్చినందుకు తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ తరపున, అమరుల కుటుంబ సభ్యుల పక్షాన ముఖ్యమంత్రికి డిజిపి కృతజ్ఞతలు తెలియజేశారు. వీరి త్యాగానికి గుర్తింపుగా నాటి ప్రభుత్వం అమరవీరుల వారసులకు 200 గజాల చొప్పున ఇళ్ల స్థలాలను కేటాయిస్తూ 2013లో జీవో నంబర్ 339 జారీ చేసింది.తొలుత కుత్బుల్లాపూర్ మండలం గజులరామారం గ్రామంలోని సర్వే నంబర్ 23, 27లలో రెండెకరాల భూమిని కేటాయించారు. అయితే ఆ భూమిలో ఆక్రమణలు ఉండటంతో, ప్రత్యామ్నాయంగా అదే గ్రామంలోని సర్వే నంబర్ 16లో 3.10 ఎకరాలను గుర్తించారు. జిఓలో ఉన్న సర్వే నంబర్లకు, క్షేత్రస్థాయిలో ఉన్న స్థలానికి మధ్య వ్యత్యాసం ఉండటంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అడ్డంకులు ఏర్పడ్డాయి. దీంతో అమరవీరుల కుటుంబాలు దాదాపు 13 ఏళ్లుగా పట్టాల కోసం ఎదురుచూడాల్సి వచ్చింది.ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం స్పందిస్తూ గత ఏడాది అక్టోబరు 18న సవరణ ఉత్తర్వులు (జిఓ నం. 132) జారీ చేసింది. గాజులరామారంలోని సర్వే నంబర్ 16లో భూమి కేటాయింపును క్రమబద్ధీకరించింది. ఈ నేపథ్యంలో లబ్ధిదారులైన 33 మంది వారసులకు మంగళవారం నాడు డిజిపి చేతుల మీదుగా అధికారికంగా ఇళ్ల స్థలాల పట్టాలు అందజేశారు. ఇంటెలిజెన్స్ అడిషనల్ డిజిపి విజయ్ కుమార్, ఎస్ఐబి ఐజిపి బి. సుమతి, గ్రేహౌండ్స్ అదనపు డిజి అనీల్‌కుమార్, కమాండర్ రాఘవేందర్ రెడ్డి, కుత్బుల్లాపూర్ ఎమ్మార్వో అశోక్ కుమార్ లతోపాటు అమరవీరుల కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### గ్రేహౌండ్స్ అధికారులకు ప్రత్యేక ఆపరేషన్ మెడల్స్

గ్రేహౌండ్స్‌లో ప్రతిభ కనబరిచిన నలుగురు అధికారులకు 2024 సంవత్సరానికి గాను 'కేంద్రీయ గృహమంత్రి దక్షతా పదక్' (స్పెషల్ ఆపరేషన్ మెడల్) లభించింది. గ్రూప్ కమాండర్ జాజాల రాఘవేందర్ రెడ్డి, సీనియర్ కమాండోలు తిప్పని రాకేష్, ఉడుత నూరి మల్లయ్య, జూనియర్ కమాండో గంటా సాయి కుమార్ ఈ పురస్కారాలకు ఎంపికైన సందర్భంగా వారిని డిజిపి అభినందించారు.

## తెలంగాణ విద్యా కమిషన్‌పై ఎఐఎస్‌ఎఫ్ చర్చా గోష్ఠి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లోని రాజ్ బహదూర్ హాల్‌లో తెలంగాణ విద్యా కమిషన్‌పై కీలక చర్చా గోష్ఠి నిర్వహించారు.ఈ చర్చాగోష్ఠి విద్యా రంగానికి సంబంధించిన పలు కీలక అంశాలపై విస్తృత చర్చలకు వేదికైంది. విద్యా రంగ నిపుణులు, విద్యార్థి నాయకులు, ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు పాల్గొని రాష్ట్రంలోని విద్యా వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ విధానాలు, విద్యా కమిషన్ అవసరం, దాని నిర్మాణం, భవిష్యత్ కార్యాచరణపై తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. తెలంగాణలో విద్యా రంగంలో సమగ్ర సంస్కరణలు అత్యవసరమని వక్తలు అభిప్రాయపడ్డారు. ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యా వనరులను పెంపొందించడం, ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయడం ద్వారా విద్యా నాణ్యతను మెరుగుపరచాలని సూచించారు. తెలంగాణ విద్యా కమిషన్ ఏర్పాటు ద్వారా విద్యా రంగంలోని లోపాలను గుర్తించి, సమర్థవంతమైన విధానాలు అమలు చేయాలని కోరారు. ఈ చర్చా గోష్ఠిలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు,పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, జార్జి రెడ్డి పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్ నాగేశ్వర్ రావు, పిడిఎస్‌యు నాయకులు రాకేష్, ఎఐడిఎస్‌ఓ నాయకులు నితీష్, పిడిఎస్‌యూ విజృంభణ రాష్ట్ర కార్యదర్శి విజయ్, రాష్ట్రోపాధ్యాయ సంఘం అధ్యక్షుడు సదానందం, ఎంవి ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ వెంకట్ రెడ్డి, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీ నారాయణ, విద్యా పరిరక్షణ కమిటీ సభ్యులు రవి చంద్ర, సాధిక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సాధిక్ తదితరులు పాల్గొన్నారు.



## సిఎంకు ఆహ్వానం

**ప్రజాపక్షం/కంటోన్మెంట్:** మహావీర్ జయంతి వేడుకల్లో పాల్గొనాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరడం జరిగింది. ఈ మేరకు ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆధ్వర్యంలో జైన్ సేవా సంఘ్ సభ్యులు సీఎంకు ఆహ్వానించారు. ఈనెల 26న నాంపల్లి ఎగ్జిబిషన్ సొసైటీ గ్రౌండ్స్‌లో జరుగనున్న భగవాన్ మహావీర్ 2625వ జయంతి వేడుకలకు హాజరు కావాలని సీఎంకు ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆధ్వర్యంలో మంగళవారం శాసనసభ ప్రాంగణంలో ఆహ్వాన పత్రం అందజేశారు. ఆహ్వానం అందజేసిన వారిలో శ్రీజైన్ సేవా సంఘ్ చైర్మన్ యోగేష్ కుమార్ జైన్, అధ్యక్షుడు ఉమేష్ కుమార్ జైన్, కార్యదర్శి విమల్ చంద్‌జైన్, మహేందర్‌జైన్, దిలీప్, అమిత్, ప్రవీణ్, సుమిత్, యోగేష్ తదితరులు ఉన్నారు.



## ఎంఎంసి పరిధిలో.. దోమల నియంత్రణకు ముమ్మర చర్యలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) పరిధిలో దోమల నియంత్రణకు ప్రత్యేక ఎంటమలాజి కార్యక్రమాలు చేపట్టినట్లు సీనియర్ ఎంటమాలజిస్ట్ మాధవ రెడ్డి తెలిపారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా ఉప్పల్, ఎల్.బి. నగర్, మల్కాజిగిరి జోన్లలోని చెరువులు, నాలాల్లో ఆయిల్ బాల్స్ వేయడంతో పాటు ఎంఎల్ఓ ఆయిల్ స్ప్రేయింగ్ నిర్వహించారు. 200 ఆయిల్ బాల్స్, 2000 గాంబుసియా చేపల విడుదల, సరూర్ నగర్ చెరువులో డ్రోన్ ద్వారా ఆయిల్ స్ప్రేయింగ్, యాప్రాల్, మోత్తికుంట చెరువుల్లో 15,000 గాంబుసియా చేపల విడుదల, దోమల పెరుగుదలను అరికట్టేందుకు కాలనీల్లో అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.

## వెలుగుమట్ల బాధితులకు 'కమిటీ' అండ

750 పేద కుటుంబాలకు న్యాయం జరిగేలా పోరాడుతాం
తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత



**ప్రజాపక్షం/సోమాజిగూడ :** ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో ఇండ్లు కోల్పోయిన బాధితులందరికీ న్యాయం జరిగేలా నిజ నిర్ధారణ కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంఎల్‌సి కవిత తెలిపారు. మంగళవారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ధర్మసమాజ్ పార్టీ వ్యవస్థాపకులు విశారదన్ మహారాజ్, జస్టిస్ చంద్రకుమార్, ఆర్మీ మేజర్ (రిటైర్డ్) మదన్‌కుమార్‌లతో కలిసి ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి హెచ్చరిక లేకుండా, నోటీసులివ్వకుండా వెలుగుమట్లలో 750పేద కుటుంబాల ఇళ్లను కూల్చివేయడం దారుణమన్నారు. 750మంది ఇళ్లను కూల్చేసి, 410మందికి మాత్రమే ఇళ్లు ఇస్తామనడం సరికాదన్నారు. చాలామందికి న్యాయం జరగలేదన్నది స్పష్టంగా తెలుస్తున్నదన్నారు. దీనిపై విశారదన్ మహారాజ్ మొన్న ఖమ్మ వెళ్తే పోలీసులు అరెస్టు చేయాల్సిన అవసరం ఎందుకొచ్చిందన్నారు. వెలుగుమట్ల బాధితుల అంశంపై ప్రభుత్వం ఏమాత్రం పారదర్శకంగా లేదన్నారు. ప్రభుత్వం బాధ్యాతయుతంగా మెలిగేలా చేసేందుకు తాము కమిటిని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ కమిటీలో రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్, ఆర్మీ మేజర్ (రిటైర్డ్) మదన్‌కుమార్, ప్రొఫెసర్లు అనురాధ, నాగం కుమార స్వామి, రామయ్య, న్యాయవాదులు సుంకర నరేశ్, శ్రావణ్‌గౌడ్, నూర్జన్, జర్నలిస్టులు తెలంగాణ విఠల్, ఆకాశ్‌గౌడ్, క్రాంతి ఉన్నారని వివరించారు. డిసెంబర్ 9 నాటికి పేదల ఇళ్లను పూర్తి చేస్తామని చెబుతున్నారని, కానీ అప్పటివరకు వారు ఎక్కడ ఉండాలని ప్రశ్నించారు. కమిటీ ద్వారా బాధితులకు న్యాయం జరిగేవిధంగా పోరాడుతామని స్పష్టంచేశారు. విశారదన్ మహారాజు మాట్లాడుతూ లక్షల విలువ చేసే ఇళ్లను కూల్చేసి రూ.5లక్షలే ఇస్తామనటం, 75 గజాలకే పరిమితం చేయటం సరికాదన్నారు. ఈ కమిటీ ఈ రోజు ఖమ్మం వెళ్లి బాధితులను కలుస్తుందని, అధికారులతో మాట్లాడుతుందని తెలిపారు. రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ రాజకీయ నాయకులు చెప్పినట్టుగా అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించొద్దని, చట్టప్రకారమే ముందుకెళ్లాలని సూచించారు. బాధితుల సమస్యల పరిష్కారానికి తమ కమిటీ చేసే సలహాలు, సూచనలు ప్రభుత్వం పాటించి పేదలకు మంచి చేస్తుందని నమ్ముతున్నట్టు ఆయన తెలిపారు.

## ఆరోగ్య పరిరక్షణలో ఆహార భద్రత కీలకం

వీధి వ్యాపారులకు కిట్లు : కలెక్టర్ హరిచందన దాసరి




**ప్రజాపక్షం/సిటీ బ్యూరో :** ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఆహార భద్రత అత్యంత కీలకమని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి తెలిపారు. తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ సహకారంతో ఎం బ్రాండ్స్ ఆధ్వర్యంలోని కేఎఫ్‌సి ఇండియా సహయోగ ప్రాయోజకత్వంలో వీధివ్యాపారులకు ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్ అండ్ సర్టిఫికేషన్ కార్యక్రమాన్ని మంగళవారం రెడ్‌హిల్స్‌లోని కెఎల్ఎన్ ప్రసాద్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సంస్కృతిలో ఆహారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. ఆహారం పవిత్రమైనదని చెప్పారు. ఆహారం తయారుచేసి అందించే వ్యాపారస్థులు నైతిక, సామాజిక బాధ్యతతో పనిచేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. శుభ్రత, నాణ్యతా ప్రమాణాలను పాటించాలని తెలిపారు. వినియోగదారులను కుటుంబసభ్యులుగా భావించి నాణ్యతతో ఆహారం తయారు చేయాలన్నారు. కల్తీ వస్తువులు, కల్తీ ఆహారం ద్వారా అనేక వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. కృత్రిమ రంగులు, హానికర పదార్థాల వినియోగం ఆరోగ్యానికి ప్రమాదకరమన్నారు. ఆహార భద్రత నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అర్హులైన వ్యాపారస్థులకు బ్యాంకుల నుండి రుణాలు ఉండడం వల్ల ప్రభుత్వం సబ్సిడి ఇస్తుందని చెప్పారు. ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార ప్రాసెసింగ్ సంస్థల ఫార్మలైజేషన్ పథకం కింద ప్రభుత్వం వీధి వ్యాపారులు, సూక్ష్మ వ్యాపారులకు ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. అంతకు ముందు ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రతినిధులు, ఫాస్టాగ్ రీసోర్స్ పర్సన్లు ఆహార భద్రత, పరిశుభ్రత ప్రమాణాలు, నిబంధనలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ వీధి వ్యాపారులకు కిట్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్టీసిసిఐ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ గారిమెల్ల, ఎఫ్ఎస్ఎస్ఏఐ రీజియన్ డైరెక్టర్ బాలునాయక్, ఫుడ్ సేఫ్టీ శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యవేక్షణ మరింత కట్టుదిట్టం

అధికారులను ఆదేశించిన
రైల్వే జిఎం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గుంతకల్లు డివిజన్‌లో రైల్వే భద్రతా ప్రమాణాలను మరింత బలోపేతం చేసే దిశగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ కీలక చర్యలు చేపట్టారు. గుంతకల్లు–బళ్లారి సెక్షన్‌లో మంగళవారం ఆయన సమగ్ర భద్రతా తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో గుంతకల్లు డివిజనల్ రైల్వే మేనేజర్ చంద్ర శేఖర్ గుప్తా సహా సీనియర్ అధికారులు పాల్గొన్నారు. గుంతకల్లు నుంచి రియర్ విండో ఇన్స్పెక్షన్ ప్రారంభించిన జనరల్ మేనేజర్, ట్రాక్‌లు, వంపులు, లెవెల్ క్రాసింగ్‌లు, సిగ్నలింగ్ వ్యవస్థ, వంతెనల భద్రతపై ప్రత్యేకంగా పరిశీలించారు. సెక్షన్‌లో రద్దీ, ట్రాక్ సాంద్రత, రైళ్ల నిర్వహణలో ఎదురవుతున్న సవాళ్లపై అధికారులతో చర్చించిన ఆయన నిర్వహణ పనులు చేపట్టే ముందు సంబంధిత విభాగాలైన ఇంజనీరింగ్, సిగ్నల్స్, ఆపరేషన్స్ మధ్య సమన్వయం కల్పించి ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. అదే సమయంలో, పనుల సమయంలో కూడా రైళ్ల సమయపాలనకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కీలక ప్రాంతాల గుర్తింపు, ట్రాక్ బలపరిచే ప్రణాళికలు, సెక్షనల్ వేగం పెంపు అంశాలపై అధికారులు జనరల్ మేనేజర్‌కు వివరాలు అందించారు. రైల్వే కార్యకలాపాల్లో అప్రమత్తత పెంచాలని, భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సిబ్బందికి సూచించారు. వేగపరిమితులను కచ్చితంగా పాటిస్తూ రైళ్లను సమయానికి నడిపేలా పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు.

## వాహనదారులకు శుభవార్త

ఆన్‌లైన్‌లో వాహనాల రిజిస్ట్రేషన్
కేంద్ర ప్రభుత్వ 'వాహన్' పోర్టల్‌తో అనుసంధానం
ఇంట్లో కూర్చుని సేవలు పొందే అవకాశం




**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** ఆర్సీ డూప్లికేట్ కాపీ తీసుకోవడం.. పేరు మార్పు చేసుకోవడం.. అడ్రస్ మార్చుకోవడం.. హైపోథికేషన్ తొలగింపు.. వంటి సేవలు నేరుగా ఆన్‌లైన్ ద్వారా ఇంట్లో కూర్చుని పొందవచ్చు. ముఖ్యంగా ఒకటికంటే ఎక్కువ వాహనాలు అవసరమైన కుటుంబాలకు రెండవ వాహనంపై విధించే రెండు శాతం లైఫ్ టాక్స్ రద్దు చేయడం శుభవార్తగా చెప్పొచ్చు. ఇతర రాష్ట్రాల నుంచి వాహనాల కొనుగోలు సులభతరంగా మారుతుంది. ఇటువంటి సౌకర్యాలను ఆన్‌లైన్ ద్వారా పొందేలా తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ వెసులుబాటు కల్పిస్తున్నది. ఈ నెలాఖరు లోగా రాష్ట్రంలో వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కేంద్ర ప్రభుత్వ వాహన్ పోర్టల్ ద్వారా జరుగుతుందని ప్రకటించారు. ఈ విధానం ద్వారా క్యూర్ పరిధిలోని లక్షలాధి మంది వాహనాదారులకు సమయం, ఖర్చు ఆదా అయ్యే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయి. ప్రస్తుతం జరుగుతున్న వాహనదారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇక నుంచి కేంద్ర ప్రభుత్వ వాహన్ పోర్టల్‌తో అనుసంధానం చేయడం జరుగుతుంది. దీంతో రాష్ట్రంలోని వాహనాల వివరాలు జాతీయ డేటాబేస్‌లోకి వెళ్తాయి. వాహనాలకు సంబంధించిన అన్ని సేవలు ఆన్‌లైన్‌లోనే అందుబాటులోకి వస్తాయి. రెండవ వాహనం కొనుగోలుపై అదనంగా విధించే రెండు శాతం లైఫ్ టాక్స్‌ను కూడా రద్దు చేస్తున్నారు. జాతీయ పోర్టల్‌తో అనుసంధానం వల్ల లాభమిదే. ఇది మధ్యతరగతి వాహనదారులకు భారీ ఆర్థిక ఊరటను ఇస్తుంది. రూ.10 లక్షల విలువైన కారును కొనుగోలు చేస్తే వారికి రూ.20 వేలు ఆదా అవుతుంది. వివిధ రాష్ట్రాల్లో వాహన తనిఖీలు జరిగినప్పుడు లేదంటే వాహనాలను ఇతర రాష్ట్రాలకు విక్రయించినప్పుడు డాక్యుమెంటేషన్ ప్రక్రియ ఈజీ అవుతుంది.

## గవర్నర్ ప్రెస్ సెక్రటరీగా.. ఎం.దశరథం నియామకం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖకు చెందిన అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.దశరథం బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఆయన జిహెచ్ఎంసిలో పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ (పిఆర్ఓ)గా డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. గవర్నర్‌కు ప్రెస్ సెక్రటరీగా లోక్ భవన్‌లో డిప్యుటేషన్‌పై నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సి.హెచ్. ప్రియాంక ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. దశరథం వెంటనే జిహెచ్ఎంసి విధుల నుంచి రిలీవ్ అయ్యి, కొత్త బాధ్యతలు చేపట్టాలని ఆదేశించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం తదుపరి నివేదికను అందజేయాలని సూచించారు.

# ఆస్పత్రిపై దాడి యుద్ధ నేరమే

## ఆఫ్ఘన్ క్రికెటర్ రషీద్ ఖాన్




**బాగ్దాద్ :** ఆఫ్ఘనిస్తాన్‌లోని ఓ డ్రగ్స్ చికిత్సాలయంపై సోమవారం రాత్రి పాకిస్థాన్ ఆకస్మిక దాడి చేసింది. ఆ దాడిలో కాబూల్‌లోని ఆస్పత్రిలో 400 మంది మృతిచెందగా, మరో 250 మంది గాయపడ్డారు. డ్రగ్ రిహాబిలిటేషన్ ఆస్పత్రిపై రాత్రి 9 గంటలకు దాడి జరిగినట్లు ఆఫ్ఘన్ ప్రభుత్వ ప్రతినిధి హమ్దుల్లా ఫిత్రత్ తెలిపారు. అయితే ఈ ఘటన పట్ల ఆఫ్ఘన్ క్రికెటర్ రషీద్ ఖాన్ స్పందించారు. పాక్ మిలిటరీ చర్యను ఆయన ఖండించారు. పాకిస్థాన్ వైమానిక దాడులతోనే ఈ ప్రాణనష్టం జరిగినట్లు ఆ క్రికెటర్ చెప్పారు. పవిత్రమైన రంజాన్ మాసం సమయంలో ఈ దాడి జరగడం దారుణమన్నారు. తన ఎక్స్ అకౌంట్‌లో రషీద్ ఖాన్ స్పందించారు. సాధారణ పౌరులు చనిపోవడం బాధగా ఉందన్నారు. ఇండ్లను, విద్యా సంస్థలను, వైద్య కేంద్రాలను కావాలని లేదా అనుకోకుండా అటాక్ చేసినా అది యుద్ధ నేరమే అవుతుందని రషీద్ పేర్కొన్నారు. రంజాన్ పవిత్ర మాసం వేళ మనుషుల ప్రాణాలు విలువ ఇవ్వకుండా వ్యవహరిస్తున్న తీరు తీవ్రంగా కలచివేస్తున్నట్లు చెప్పారు. దీని వల్ల వైరం, ద్వేషం పెరుగుతుందన్నారు. ఐక్యరాజ్యసమితి, ఇతర మానవ హక్కుల సంఘాలు ఈ ఘటన పట్ల దర్యాప్తు చేపట్టాలని కోరారు. బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి కష్ట సమయంలో ఆఫ్ఘన్ ప్రజలకు అండగా ఉండనున్నట్లు చెప్పారు.

# టి–20ల్లో అమేలియా కొత్త చరిత్ర

## అత్యంత వేగంగా వెయ్యి పరుగులు, వంద వికెట్లతో రికార్డు!

అంతర్జాతీయ క్రికెట్‌లో న్యూజిలాండ్ క్రికెటర్ అమేలియా కేర్ చరిత్ర సృష్టించింది. స్వదేశంలో దక్షిణాఫ్రికాతో జరుగుతున్న ద్వైపాక్షిక సిరీస్‌లో చెలరేగిపోతున్న కివీస్ కెప్టెన్ రెండో టి–20 మ్యాచ్‌లో వందో వికెట్ సాధించింది. తద్వారా టి–20 ల్లో ఆమె అరుదైన మైలురాయిని అధిగమించింది. పొట్టి ఫార్మాట్లో అత్యంత వేగంగా వెయ్యికి పైగా పరుగులు బాదేసి, వందకు పైగా వికెట్లు తీసిన మహిళా క్రికెటర్‌గా అమేలియా అవతరించింది. ఈ ఆల్‌రౌండర్ 94వ ఇన్నింగ్స్‌లోనే ఈ ఫీట్




సొంతం చేసుకుంది. సంచలనాలకు నెలవైన టి–20ల్లో అమేలియా జోరు కొనసాగిస్తోంది. ఇటీవల కాలంలో బ్యాటుతో, బంతితో చెలరేగిపోతున్న కివీస్ క్రికెటర్. నిరుడు టి–20ల్లో తొలి సెంచరీతో రికార్డులకెక్కింది. తాజాగా స్వదేశంలో దక్షిణాఫ్రికాపై పంజా విసురుతున్న అమేలియా అత్యంత వేగంగా వంద వికెట్ల క్లబ్‌లో చేరింది. తద్వారా ఈ ఫార్మాట్‌లో అత్యంత వేగంగా వెయ్యికి పైగా పరుగులు, వందకు పైగా వికెట్లతో చరిత్ర లిఖించిందీ డాషింగ్ బ్యాటర్. మొత్తంగా.. తమ దేశం నుంచి ఈ ఘనత సాధించిన మూడో క్రికెటర్ తనే. ఆమె కంటే ముందు సోఫీ డెవినె, మిచెల్ శాంట్నర్ ఈ మార్క్ అందుకున్నారు. ఓవరాల్‌గా చూస్తే.. అసోసియేట్ నేషన్స్ క్రికెటర్ క్యారీ చాన్ 74 ఇన్నింగ్స్‌లోనే ఈ మైలురాయిని దాటింది. పురుషుల క్రికెట్‌లో బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ షకీబుల్ హసన్ అగ్రస్థానంలో ఉన్నాడు. ఈ వెటరన్ ఆటగాడు 84 ఇన్నింగ్స్‌లో వెయ్యికి పైగా రన్స్, వందకు పైగా వికెట్లు సాధించాడు. మహిళా క్రికెటర్ల పరంగా చూసుకుంటే దీప్తి శర్మ (భారత్), నిడాదార్(పాకిస్థాన్), ఎలీసా పెర్రీ(ఆస్ట్రేలియా), సోఫీ డెవినె(న్యూజిలాండ్), హీలీ మాథ్యూస్(వెస్టిండీస్)లు ఈ క్లబ్‌లో ఉన్నారు.

# ఐపిఎల్ కోసం రంగంలోకి ముంబై దిగ్గజం



పంతొమ్మిదో సీజన్ ఐపిఎల్ కోసం రోహిత్ శర్మ సిద్ధమవుతున్నాడు. రెండు రోజుల క్రితం కుటుంబంతో కలిసి మాల్దీవ్స్‌లో వెకేషన్‌లో సరదాగా గడిపిన రోహిత్.. స్వదేశం వస్తూనే నేరుగా ముంబై స్క్వాడ్‌తో కలిశాడు. మంగళవారం సహచరులు, కోచ్ మహేల జయవర్ధనేతో కాసేపు ముచ్చటించిన హిట్‌మ్యాన్.. కిట్ బ్యాగ్‌తో మైదానంలోకి దిగాడు. నెట్స్‌లో బ్యాటింగ్, ఫీల్డింగ్.. ప్రాక్టీస్ చేసిన రోహిత్ ఐపిఎల్‌లో రఫ్ఫాడించాలనే కసితో ఉన్నాడు. ఐపిఎల్ దిగ్గజ కెప్టెన్లలో ఒకడైన రోహిత్ శర్మ మరో సీజన్‌కు రెడీ అవుతున్నాడు. గత సీజన్‌లో దంచేసిన హిట్‌మ్యాన్ (15 మ్యాచుల్లో 418 పరుగులు) ఈసారీ శుభారంభాలు ఇవ్వాలనే కసితో ఉన్నాడు. మంగళవారం ముంబై స్క్వాడ్‌తో కలిసిన రోహిత్ వెంటనే బ్యాటింగ్ ప్రాక్టీస్ మొదలెట్టాడు. శార్దూల్ ఠాకూర్, ఇతర ముంబై బౌలర్లను కాచుకున్న అతడు.. డిఫెన్స్, భారీ షాట్లు సాధన చేశాడు. అనంతరం సహచరులతో కలిసి ఫీల్డింగ్ చేశాడు. మొన్నటి వరకూ టి–20 ప్రపంచకప్ అంబాసిడర్‌గా మైదానాల్లో సందడి చేసిన రోహిత్.. కాస్త బ్రేక్‌లో మాల్దీవ్స్‌లో కుటుంబంతో కలిసి సేదతీరాడు. ఐపిఎల్‌కు కౌంట్‌డౌన్ తన కెప్టెన్సీలో ముంబైని ఐదుసార్లు (2013, 2015, 2017, 2019, 2020) ముంబైని ఛాంపియన్‌గా నిలిపిన రోహిత్.. గత రెండేళ్లుగా హార్దిక్ పాండ్యా సారథ్యంలో ఆడుతున్నాడు.

**పాంటింగ్ వారసుడిగా...** పంతొమ్మిదో సీజన్ కు మరో పది రోజులే ఉండడంతో ఈ దిగ్గజ ఆటగాడు ప్రాక్టీస్ మొదలెట్టాడు. ఐపిఎల్ ఆరంభంలో దక్కన్ ఛార్జర్స్ తరఫున విజేతగా నిలిచిన రోహిత్.. ఆపై ముంబై ఇండియన్స్ గూటికి చేరాడు. అక్కడ రికీ పాంటింగ్ వారసుడిగా 2013లో సారథ్యం స్వీకరించిన ముంబైకర్ విజయవంతమైన నాయకుడిగా చరిత్రకెక్కాడు.

# మహిళ

# ఆర్థిక సాక్షరత

మహిళల ఆర్థిక సాక్షరత అనేది కేవలం డబ్బు గురించి అవగాహన కలిగి ఉండటం మాత్రమేనని చాలా మంది అనుకుంటారు. కానీ, నిజానికి ఆదాయం సంపాదించడం, ఖర్చులను నియంత్రించడం, పొదుపు చేయడం, పెట్టుబడులు పెట్టడం, అప్పులను నిర్వహించడం, భవిష్యత్తు భద్రతను నిర్మించడం వంటి సమగ్ర ఆర్థిక సామర్థ్యాల సమాహారంగా ఆర్థిక సాక్షరతను చూడాల్సి ఉంటుంది. ఆధునిక సమాజంలో మహిళల విద్య, ఉద్యోగాలు, వ్యాపార అవకాశాలు పెరుగుతున్నప్పటికీ, ఆర్థిక నిర్ణయాల్లో స్వతంత్రత మాత్రం ఇంకా పరిమితంగానే ఉంది. భారతదేశంలో సుమారు 21 శాతం మహిళలకే పూర్తి స్థాయి ఆర్థిక సాక్షరత ఉందని వివిధ అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇది కేవలం వ్యక్తిగత సమస్య కాకుండా సామాజికఆర్థిక అసమానతలకు కారణమవుతున్న నిర్మాణాత్మక సమస్యగా చూడాలి. మహిళల ఆర్థిక స్వాతంత్ర్యం కుటుంబ స్థాయిలోనే కాదు, దేశ ఆర్థిక వ్యవస్థలో కూడా కీలక పాత్ర పోషిస్తుంది. డబ్బును అర్థం చేసుకునే సామర్థ్యం ఉన్న మహిళలు ఉద్యోగంలో మంచి నిర్ణయాలు తీసుకుంటారు. వ్యాపారాలు ప్రారంభించడానికి, ఆదాయాన్ని విస్తరించడానికి, ఆర్థిక ప్రమాదాలను తగ్గించడానికి ఎక్కువ అవకాశాలు అందిపుచ్చుకుంరు. ఆర్థిక అవగాహన లేకపోతే సంపాదించిన ఆదాయం ఉన్నప్పటికీ దీర్ఘకాలిక సంపద నిర్మాణం సాధ్యం కాదు. అందుకే మహిళల ఆర్థిక సాక్షరతను అభివృద్ధి చేయడం అభివృద్ధి విధానాల్లో ప్రధాన లక్ష్యంగా మారుతోంది. భారతీయ సమాజంలో లింగ అసమానతలు ఆర్థిక రంగంలో స్పష్టంగా కనిపిస్తాయి. చాలా కుటుంబాల్లో ఆదాయం సంపాదించే మహిళలు ఉన్నప్పటికీ, పెట్టుబడులు, బీమా, ఆస్తి కొనుగోలు వంటి నిర్ణయాలు పురుషుల చేతుల్లోనే ఉంటాయి. దీని వల్ల మహిళలు తమ సొంత ఆర్థిక స్థితి గురించి స్పష్టమైన అవగాహన లేకుండా జీవించాల్సి వస్తుంది. ఉద్యోగ విరామాలు, ప్రసూతి కాలం, కుటుంబ బాధ్యతలు



వంటి కారణాల వల్ల మహిళల ఆదాయం నిరంతరంగా ఉండకపోవడం కూడా ఆర్థిక ప్రణాళికలో సమస్యలను సృష్టిస్తుంది. ఈ పరిస్థితుల్లో ఆర్థిక సాక్షరత మహిళలకు భద్రతా కవచంలా పనిచేస్తుంది. ఆర్థిక సాక్షరతలో మొదటి ముఖ్యమైన అంశం బడ్జెట్ నిర్వహణ. వ్యక్తి సంపాదన ఎంత, ఖర్చులు ఎంత, పొదుపు ఎంత అనే సమతుల్యతను అర్థం చేసుకోవడం ఆర్థిక స్థిరత్వానికి మూలాధారం.


## పొదుపు అవసరం



సాధారణంగా వ్యక్తిగత ఆదాయంలో అప్పుల చెల్లింపులు 30 శాతం దాటకూడదని ఆర్థిక నిపుణులు సూచిస్తారు. అదే సమయంలో కనీసం 30 శాతం ఆదాయాన్ని పొదుపుగా నిల్వ చేయడం భవిష్యత్తు భద్రతకు అవసరం. ఈ అలవాటు చిన్న మొత్తాలతో ప్రారంభమైనప్పటికీ కాలక్రమేణా పెద్ద ఆర్థిక బలంగా మారుతుంది. పొదుపు, పెట్టుబడుల మధ్య తేడా అర్థం చేసుకోవడం కూడా మహిళల ఆర్థిక విద్యలో కీలక దశ. చాలా మంది మహిళలు బ్యాంక్ సేవింగ్స్ ఖాతా లేదా బంగారం కొనుగోలును మాత్రమే భద్రతగా భావిస్తారు. అయితే ద్రవ్యోల్బణం కారణంగా డబ్బు విలువ కాలక్రమేణా తగ్గుతుంది. అందువల్ల మ్యూచువల్ ఫండ్లు, పింఛన్ పథకాలు, దీర్ఘకాల పెట్టుబడులు వంటి మార్గాలను అర్థం చేసుకోవడం అవసరం. చిన్న వయస్సులోనే పెట్టుబడులు ప్రారంభిస్తే చక్రవడ్డీ ప్రభావం వల్ల సంపద వేగంగా పెరుగుతుంది. బీమా అవగాహన కూడా మహిళల ఆర్థిక భద్రతలో మరో కీలక అంశం. ఆరోగ్య బీమా. జీవిత బీమా కుటుంబాన్ని ఆర్థిక సంక్షోభాల నుంచి రక్షిస్తాయి. చాలా సార్లు మహిళలు భర్త ఉద్యోగం ద్వారా వచ్చే బీమాపై ఆధారపడుతుంటారు. కానీ వ్యక్తిగత బీమా లేకపోతే ఉద్యోగ మార్పులు లేదా కుటుంబ పరిస్థితుల మార్పుల సమయం లో ప్రమాదం ఏర్పడుతుంది. తమ పేరుతో బీమా తీసుకోవడం ఆర్థిక స్వతంత్రతకు సూచిక. రిటైర్మెంట్ ప్రణాళిక మహిళలకు మరింత ముఖ్యమైనది. మహిళల సగటు జీవితకాలం పురుషుల కంటే ఎక్కువగా ఉండటం వల్ల వృద్ధాప్యంలో ఎక్కువ కాలం ఆర్థిక భద్రత అవసరం అవుతుంది. అయితే ఉద్యోగ విరామాలు, తక్కువ వేతనాల కారణంగా పింఛన్ పొదుపులు తక్కువగా ఉండే అవకాశం ఉంది. అందువల్ల చిన్నమొత్తాలతోనైనా నిరంతరంగా రిటైర్మెంట్ ఫండ్ నిర్మించడం అవసరం.

దీర్ఘకాలిక పెట్టుబడులు వృద్ధాప్యంలో ఆర్థిక ఆధారాన్ని తగ్గిస్తాయి. మహిళల ఆర్థిక సాక్షరత సామాజిక అసమానతలను తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. స్త్రీపురుషుల ఆధారంగా సాగుతున్న వేతన వ్యత్యాసం సమస్యను ఎదుర్కోవడంలో ఆర్థిక అవగాహన కీలకం. తమ పనికి సరైన పారితోషికం కోరడం, వేతన చర్చలు జరపడం, ఉద్యోగ ప్రయోజనాలను అర్థం చేసుకోవడం వంటి సామర్థ్యాలు ఆర్థిక జ్ఞానంతో వస్తాయి. ఆర్థికంగా అవగాహన ఉన్న మహిళలు ఉద్యోగ అవకాశాలను వ్యూహాత్మకంగా ఎంచు

## దీర్ఘకాల పెట్టుబడులు



కోవడంలో ముందుంటారు. వ్యాపార రంగంలో కూడా ఆర్థిక విద్య ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. చిన్న స్థాయి స్వయం ఉపాధి నుండి పెద్ద వ్యాపారాల వరకు విస్తరించాలంటే లాభనష్టాల విశ్లేషణ, పెట్టుబడి నిర్వహణ, నగదు ప్రవాహ నియంత్రణ వంటి అంశాలు తెలుసుకోవాలి. ఆర్థిక అవగాహన ఉన్న మహిళా వ్యాపారులు తమ వ్యాపారాన్ని నిలబెట్టుకోవడంలో ఎక్కువ విజయాన్ని సాధిస్తారని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఇది కుటుంబ ఆదాయాన్ని మాత్రమే కాదు స్థానిక ఆర్థిక వ్యవస్థను కూడా బలోపేతం చేస్తుంది. అయితే మహిళలు ఆర్థిక సాక్షరత సాధించడంలో అనేక అడ్డంకులు ఎదుర్కొంటున్నారు. పితృస్వామ్య సమాజాల్లో మహిళలకు డబ్బు నిర్వహణ నేర్పే అవకాశాలు తక్కువగా ఉంటాయి. చిన్నప్పటి నుంచే ఆర్థిక నిర్ణయాలు పురుషుల బాధ్యతగా భావించడం వల్ల మహిళలు ఆ రంగానికి దూరమవుతారు. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ బ్యాంకింగ్ సేవలకు ప్రాప్యత లేకపోవడం కూడా ఒక పెద్ద సమస్య. విడాకులు లేదా కుటుంబ విభేదాల తర్వాత ఐదుగురిలో ఒక మహిళ పేదరికానికి చేరే ప్రమాదం ఉందని కొన్ని పరిశోధనలు తెలియజేస్తున్నాయి. ఈ పరిస్థితిని నివారించడానికి 'అత్యవసర నిధి' నిర్మించడం అవసరం.

## వారసత్వ ఉద్యోగాలు పాత పద్ధతిలోనే అమలు చేయాలి

### వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** సింగరేణి సంస్థలో వారసత్వ ఉద్యోగాలను పాత పద్ధతిలోనే అమలు చేయాలని సింగరేణి కార్మిక సంఘం (ఏఐటియుసి) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. సింగరేణి వ్యాప్తంగా పేరుకుపోయిన కార్మిక సమస్యల పరిష్కారం కోసం మంగళవారం అన్ని గనులపై ఏఐటియుసి ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించి వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరై సీతారామయ్యమాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం నుంచి సంస్థకు రావాల్సిన బకాయిలను వెంటనే రాబట్టాలన్నారు. కార్మికుల సొంతింటి కలను నెరవేర్చాలని, అధికారులకు ఇస్తున్నట్లుగానే కార్మికుల పెర్క్‌పై ఆదాయపు పన్నును యాజమాన్యమే చెల్లించాలని డిమాండ్ చేశారు. నూతన గనులను ప్రారంభించాలని, మారుపేర్ల సమస్యను పరిష్కరించాలన్నారు. కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 18న ఆర్కే7 గని నుండి సేవ్ సింగరేణి జాతా ప్రారంభిస్తున్నామని, 30న కొత్తగూడెంలో ధర్నాతో ముగుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కే సమ్మయ్య, ఎస్‌కె.బాజీ సైదా, కొట్టే కిషన్ రావు, మోత్కూరి కొమురయ్య, రాచర్ల చంద్రమోహన్, బద్రి బుచ్చయ్య, అఫ్రోజ్ ఖాన్, దాడి రాజయ్య, మురళీచౌదరి పాల్గొన్నారు.

## మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె

### కార్మిక సంఘాల నాయకుల హెచ్చరిక




**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** మునిసిపల్ కార్మికుల సమస్యలు 14 రోజుల్లో పరిష్కరించకపోతే సమ్మెకు వెళ్తామని కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. మంగళవారం ఏఐటియుసి, సిఐటియు, టియుసిఐ సంఘాల ఆధ్వర్యంలో మునిసిపల్ కార్మికులు, డ్రైవర్ల పాత మునిసిపల్ కార్యాలయం నుంచి కోర్టు చౌరస్తా, ధర్నా చౌక్ మీదుగా కొత్త మునిసిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి కమిషనర్ చాంబర్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా కార్యదర్శి ఓమయ్య, టియుసిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఏ.రమేష్‌బాబు, డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు లక్ష్మణ్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెకు వెళ్తామని అడిషనల్ కమిషనర్ పి.రవిందర్ సాగర్‌కి సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ కార్మిక సంఘాల నాయకులు భూపతి, రాజేశ్వర్, కిరణ్, గోవర్ధన్, రవి, శివకుమార్, భానుచందర్, మహేశ్, యాదమ్మ, లక్ష్మి, శైలజ, కిరణ్, లింగం తదితరులు పాల్గొన్నారు.

# సబ్ ప్లాన్ నిధుల ఖర్చుపై శ్వేతపత్రం

## డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ డిమాండ్




**ప్రజాపక్షం/భువనగిరి :** రాష్ట్రంలో దళితులు, అభివృద్ధి కోసం కేటాయిస్తున్న ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధుల వినియోగంపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్ పిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. దళిత హక్కుల పోరాట సమితి యాదాద్రి భువనగిరి జిల్లా సమితి సమావేశం మంగళవారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయంలో కాశపాక దయాకర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మారుపాక అనిల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్లో ప్రతి సంవత్సరం ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ కింద వేల కోట్ల రూపాయలు కేటాయిస్తున్నప్పటికీ, ఆ నిధులు నిజంగా దళితులు, ఆదివాసుల అభివృద్ధికే ఖర్చవుతున్నాయా లేదా అన్న విషయంపై స్పష్టత లేకపోవడం ఆందోళనకరమన్నారు. సబ్ ప్లాన్ చట్టం ప్రకారం దళితులు, ఆదివాసుల జనాభా శాతానికి అనుగుణంగా నిధులు కేటాయించి, ఆ వర్గాల విద్య, ఉపాధి, ఆరోగ్యం, గృహాలు, భూమి పంపిణీ వంటి రంగాల్లో అభివృద్ధి కోసం ఖర్చు చేయాలి. కానీ అనేక శాఖలు ఈ నిధులను ఇతర పథకాల కింద చూపించడం లేదా ఖర్చు చేయకుండా నిల్వ చేయడం జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గత సంవత్సరాల్లో ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ కింద కేటాయించిన మొత్తం నిధులు, ఖర్చు చేసిన మొత్తం, మిగిలిన నిధులు మరియు అవి ఏ పథకాలపై ఖర్చు అయ్యాయన్న వివరాలతో కూడిన పూర్తి స్థాయి శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సబ్ ప్లాన్ నిధులను ఇతర అవసరాలకు మళ్లింపులు చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, దళితులు మరియు ఆదివాసుల అభివృద్ధికి ఈ నిధులు పూర్తిగా వినియోగించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. లేదంటే దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ దళితులు ఇంకా విద్య, ఉపాధి, ఆర్థిక రంగాల్లో తీవ్ర వెనుకబాటుతనాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో సబ్ ప్లాన్ నిధులు వారికి అత్యంత అవసరమన్నారు. అయినప్పటికీ ఈ నిధుల వినియోగంలో ప్రభుత్వం పారదర్శకత పాటించకపోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. సమావేశంలో డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి సలిగంజి వీరాస్వామి, జిల్లా నాయకులు ఇంజ హేమలత, భాగ్య, కొమ్ము బాల నర్సింహా, లింగస్వామి, మూల పోచయ్య, చెడె సుందర్, శాంతి కుమార్, రమేష్, స్వామి, మనోహరమ్మా తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ(ఎం) రాష్ట్ర నాయకుడు భీమ్‌రావు సిపిఐలో చేరిక

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** సిపిఐ(ఎం) మాజీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, గిరిజన సంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి తోడసాం భీమ్‌రావు మంగళవారం సిపిఐలో చేరారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎస్.విలాస్, సిపిఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి భూక్యా రమేష్, సీనియర్ నాయకులు ఎస్‌ఎన్.రెడ్డి సమక్షంలో చేరిక కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విలాస్ మాట్లాడుతూ తోడసాం భీమ్‌రావు వంటి చురుకైన యువ నాయకులు సిపిఐలో చేరడం అభినందనీయమన్నారు. భీమ్‌రావు రాకతో నిర్మల్ జిల్లాలో పార్టీతో పాటు గిరిజన సంఘం మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి భూక్యా రమేష్ మాట్లాడుతూ జిల్లాలో సిపిఐలోకి వలసలు కొనసాగుతాయని, రాబోయే కాలంలో సిపిఐ ఒక బలమైన రాజకీయ శక్తిగా అవతరించబోతోందన్నారు. రాబోయే జడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో సిపిఐ ఒంటరిగానే బరిలోకి దిగుతుందన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు కోట్ల నారాయణ, అనంత్‌రావు, డిహెచ్‌పిఎస్ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# మూడో ప్రపంచయుద్ధం తెచ్చేందుకు ట్రంప్ కుట్రలు

## సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ప్రపంచ దేశాలను తన గుప్పిట్లో ఉంచుకునేందుకు అమెరికా అధ్యక్షులు ట్రంప్ మూడో ప్రపంచ యుద్ధానికి కుట్రలు చేస్తున్నాడని, యుద్ధాన్ని వెంటనే నిలిపి వేసి ప్రపంచ శాంతిని కాపాడాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు కోరారు. ఇరాన్‌పై అమెరికా యుద్ధంతోపాటు కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలకు నిరసనగా మంగళవారం సిపిఐ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించి జిల్లా కేంద్రంలోని రాఘవా ప్లాజా వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ సంస్థలను తనవశం చేసుకునేందుకు ట్రంప్ యుద్ధానికి తెరలేపాడన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్వార్థంతో చేసే స్వార్థపూరిత ఆలోచనలను ప్రపంచ దేశాలు ఖండించాలన్నారు. యుద్ధానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడు నిరసన తెలుపాల్సిన అవసరముందన్నారు. యుద్ధంపై మన దేశ ప్రధాని మోదీ నోరు మెదపకనే గ్యాస్ ధరలు పెరిగాయన్నారు. తక్షణమే మోదీ నోరు విప్పి ప్రపంచ శాంతిని కాపాడాలన్నారు. దేశవ్యాప్తంగా సిపిఐ నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా సూర్యాపేటలో యుద్ధానికి వ్యతిరేకంగా పెంచిన గ్యాస్ ధరలకు నిరసనగా ధర్నా నిర్వహించినట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, నాయకులు రేగటి లింగయ్య, ఎండి పాషా, పొదిల వెంకటమ్మ, దేశగాని హేమలత, ఐతరాజు లింగయ్య, అయితగాని కామేష్, రెడ్డిమల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### గ్యాస్ కొరత, ధరల పెరుగుదలకు బిజెపి ప్రభుత్వ విధానాలే కారణం

**వరంగల్ :** గ్యాస్ కొరత ధరల పెరుగుదలకు బిజెపి ప్రభుత్వ వినాధాలే కారణంమని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా ఆరోపించారు. ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయిల్ యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లాలో నిరసన ధర్నా కార్యక్రమాలు నిర్వహించారు. ఖిలా వరంగల్ మండల కేంద్రంలో వరంగల్, ఖమ్మం జాతీయ రహదారిపై సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమంలో షేక్ బాష్ మియా మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రపంచ నియంతగా వ్యవహరిస్తూ తన ఆధిపత్యాన్ని చలాయించడం కోసం ప్రభుత్వ అధినేతలను ఎత్తుకెళ్లి నిర్బంధించడం, ఇరాన్‌పై ఇజ్రాయెల్ తో కలిసి ఏకపక్షంగా దాడులు నిర్వహించి ప్రపంచ సంక్షోభానికి కారణమవుతున్నా ప్రధాని నరేంద్రమోడీ ఆమెరికాను పల్లెత్తు మాట అనకుండా ఆమెరికాకు దాసోహమై దేశ స్వారభౌమత్వాన్ని మంటగలిపారన్నారు. గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధర ఒకేసారి రూ.60 పెంచడం, గ్యాస్ సిలిండర్ల తీవ్ర కొరత ఏర్పడడంతో హోటల్స్, హాస్టల్స్ మూసి వేసుకోవాల్సిన పరిస్థితి దాపురించి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రధాని నరేంద్రమోడీ బాధ్యతా రహితమైన విధానాలే దీనికి కారణమన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరలను తగ్గించి, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి దండు లక్ష్మణ్ ,జిల్లా కార్యవర్గ సభ్యులు సంఘీ ఏలేందర్, జిల్లా సమితి సభ్యులు తాళ్లపల్లి జాన్ పాల్, యాకాంబ్ర చారి, సుంకరి భవాని, రాజేందర్ నాయకులు, ఎండి యాకూబ్, జెట్టి విజయలక్ష్మి, బాశెట్టి ఉమ, శ్రీను, ప్రభాకర్, కరుణాకర్, తస్లీం, ఖాజామైనుద్దీన్, ఆరోగ్యం, గౌతమి, రాజాలు, ఇమానియల్, తదితరులు పాల్గొన్నారు.



## ప్రకృతి వ్యవసాయంతో ఆర్థికంగా అభివృద్ధి : ఎంఇఒ



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రకృతి వ్యవసాయంతోనే అన్నదాతలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలని ఫరూఖ్‌నగర్ మండల వ్యవసాయ అధికారి నిశాంత్‌కుమార్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని బూర్గుల రైతు వేదికలో కేంద్ర ప్రభుత్వ పథకమైన నేషనల్ మిషన్ ఫర్ నేచురల్ ఫార్మింగ్ కింద ఎంపికైన 125మంది రైతులకు ప్రకృతి వ్యవసాయ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతోనే అధిక లాభాలు పొందడంతోపాటు ప్రజల ఆరోగ్యాలు సంపూర్ణంగా ఉండేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. అన్నదాతలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నదే లక్ష్యంగా ప్రభుత్వం అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువస్తుందని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రాంబాబు, తేజ్‌కుమార్‌తోపాటు అన్నదాతలు పాల్గొన్నారు.

## భూసేకరణ పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదు



**ప్రజాపక్షం/యాచారం :** భూసేకరణ పేరుతో ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురి చేయాలని చూస్తే సహించేది లేదని, ఫార్మాసిటికి భూములు ఇవ్వని రైతుల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మంగళవారం కుర్మిద్ద , కుర్మిద్ద తండాకు చెందిన రైతులు నిరహార దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ రైతుల పేర్లను అన్‌లైన్‌లో నమోదు చేయకుండా గ్రీన్ ఫీల్డ్ రోడ్డుకు భూములు ఇవ్వాలని అధికారులు చెప్పడం ఎంత వరకు సమంజసమన్నారు. రైతుల పట్ల ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే తక్షణమే ఆన్‌లైన్‌లో రైతుల పేర్లు ఎక్కించాలని డిమాండ్ చేశారు. అధికారులు రైతులకు స్పష్టమైన హామీ ఇచ్చేవరకు దీక్ష కొనసాగుతుందని తెలిపారు.

## రైతు భరోసాకు దరఖాస్తు

**ప్రజాపక్షం/యాచారం :** రైతులు రైతు భరోసాకు ధరాఖాస్తు చేసుకోవాలని యాచారం మండల వ్యవసాయాధికారి అర్.రవినాథ్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో అయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2025|26 యాసంగి పంటకు గాను ధరఖాస్తులు చేసుకోవాలన్నారు. కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు వచ్చిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భూమి పాసుబుక్, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్, రైతు భరోసా ధరఖాస్తు ఫారంతో ఈనెల 25లోగా ధరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## ప్రకృతి వ్యవసాయంతో సంరక్షణ




**ప్రజాపక్షం/షాబాద్:** ప్రకృతి వ్యవసాయంతో మానవాళికి సంరక్షణ ఉంటుందని మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర అన్నారు. మంగళవారం షాబాద్ మండల పరిధిలోని మాచన్‌పల్లి రైతు వేదికలో నాగరకుంట రైతులకు ప్రకృతి వ్యవసాయం పై అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు ప్రకృతి వ్యవసాయం కిట్లు అందజేశారు. కార్యక్రమంలో నాగర్‌కుంట సర్పంచ్ పాలమాకుల మల్లయ్య, వ్యసాయ విస్తరణ అధికారి గాయత్రీ, క్రిషిసఖీ, శ్రీలత గ్రామ రైతులు పాల్గొన్నారు.

## నీర కేఫ్ టెండర్‌లకు ఆహ్వానం

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** హైదరాబాద్‌లో గల నీర కేఫ్ రెండు సంవత్సరాల పాటు నిర్వహించడానికి గీత కార్మిక సంఘాల నుంచి టెండర్ ఆహ్వానిస్తునట్లు రంగారెడ్డి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి బి.కేశురాం తెలిపారు. బిడ్ ఫైలింగ్ చివరి తేది ఈనెల 18 అని వివరించారు. మరింత సమాచారం కోసం www.tgtcfc.com వెబ్‌సైట్‌లో గాని, దగ్గరలో గల ఎక్సైజ్ డిపార్టుమెంట్‌లో సంప్రదించాలని సూచించారు

## హామీలను అమలు చేయాలి



**ప్రజాపక్షం/తుర్కయంజాల్:** రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చని హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జిహెచ్‌ఎంసి డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణరెడ్డికి మంగళవారం తుర్కయంజాల్ బిజెపి అధ్యక్షుడు ఎలిమినేటి నరసింహరెడ్డి వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో బోసుపల్లి ప్రతాప్,కొంద్రు పురుషోత్తం, నోముల కార్తీక్, రమేష్ బాచిగాళ్ళ,మల్లెల ప్రేమ్, సురేష్ నందగిరి,సురేష్ సాగర్ పాల్గొన్నారు

## ప్రమాదకరంగా బడి పిల్లల ప్రయాణం



**ప్రజాపక్షం/అబ్దుల్లాపూర్ మెట్ :** ఆర్కేనగర్‌లో ప్రభుత్వ పాఠశాల లేకపోవటంతో చిన్నవయసు పిల్లలు ఆటోల్లో బస్సుల్లో ప్రమాదకరంగా ప్రయా ణం చేయాల్సి వస్తుందని సిపిఐ అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్‌నాయక్ అన్నారు. ఇరవై ఏండ్ల క్రితం ఏర్పడిన ఆర్కే నగర్‌లో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటుకు సర్కార్ కృషి చేయాలనీ సిపిఐ ఆర్కే నగర్ శాఖ తరుపున శాఖ కార్యదర్శి భైరగోని రాజుగౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల విద్యాశాఖ అధికారి జగదీష్‌కి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ ఆర్కే నగర్ శాఖ కార్యదర్శి భైరగోని రాజు గౌడ్, సహాయ కార్యదర్శి పేరాల గోపి పాల్గొన్నారు.

# 99 రోజుల ప్రణాళికతో పారిశుద్ధ్య బలోపేతం



ఎస్ఎఫ్ఎలకు కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి దిశానిర్దేశం



క్షేత్ర స్థాయిలో తనిఖీలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నగర పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు ఎంఎంసి కమిషనర్ టి.వినయ్ కృష్ణా రెడ్డి చర్యలు చేపట్టారు. శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్స్ (ఎస్ఎఫ్ఎ)తో నిర్వహించిన ప్రత్యేక అవగాహన సదస్సులో కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. 'ప్రతి ఎస్ఎఫ్ఎ తమ పరిధిలోని ఇళ్ల వివరాలను నమోదు చేయాలి. చెత్త ఇవ్వని గృహాలను గుర్తించి, వారికి అవగాహన కల్పించి సంపూర్ణ సేకరణ సాధించాలి. స్వచ్ఛ ఆటో టిప్పర్లు (సాట్) ప్రతిరోజూ డోర్‌టుడోర్ సేవలు అందించాలి. రోడ్ల మీద, నాలాల్లో లేదా మీడియన్‌లలో ఎక్కడా చెత్త వేయకూడదు. పారిశుద్ధ్య పనులకు అవసరమైన పారలు, కొడవళ్లు వంటి పరికరాలను వెంటనే కొనుగోలు చేయాలని డిప్యూటీ కమిషనర్లను' కమిషనర్ ఆదేశించారు. 99 రోజుల కార్యాచరణ ఆధారంగానే సిబ్బంది పనితీరు నివేదికలు ఉంటాయని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమం చివరలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతాం విధులను అంతఃకరణ శుద్ధితో నిర్వహిస్తాం అని అధికారులతో కలిసి ఎస్ఎఫ్ఏలు ప్రతిజ్ఞ చేశారు. ఈ సదస్సులో అదనపు కమిషనర్ సి.ఎన్. రఘుప్రసాద్, జోనల్ కమిషనర్లు హేమంత పాటిల్, రాధిక గుప్తా పాల్గొన్నారు.

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణలో 12వ రోజు మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి క్షేత్రస్థాయిలో పర్యటించారు. మిర్జాలగూడ ప్రాంతంలోని పివిఎన్ కాలనీ, రాజా శ్రీనివాస నగర్, యాదవ నగర్‌లలో పర్యటించిన ఆయన, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ర్యాంపులను తొలగించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ క్యాంటీన్ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, అపార్ట్‌మెంట్‌ల నుండి రోడ్‌లపై వేసే నిర్మాణ వ్యర్థాలను తొలగించాలని, లేనిపక్షంలో జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. దుకాణాల వద్ద డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేసుకోవాలని వ్యాపారులకు సూచించారు.



## ఉస్మానియాకు రూ.1000 కోట్ల బడ్జెట్ కేటాయించాలి

### ఎఐఎస్ఎఫ్ ఒయు నేతల డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధి కోసం రూ.1000 కోట్ల నిధులు కేటాయించాలని, అలాగే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని ఎఐఎస్ఎఫ్ ఒయు కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం ఒయులో ఎఐఎస్ఎఫ్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ రాష్ట్రానికి గుండెకాయ వంటి ఉస్మానియా విశ్వవిద్యాలయానికి నిధుల కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉండటంతో ప్రైవేట్ కాలేజీ యాజమాన్యాలు విద్యార్థుల సర్టిఫికెట్‌లను ఆపుతున్నాయని, దీనివల్ల బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు పైచదువులకు వెళ్లలేక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్ సమావేశాల్లో ఈ సమస్యలపై సానుకూల నిర్ణయం తీసుకోకపోతే విద్యార్థుల భవిష్యత్ అంధకారమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి మెట్టెల చైతన్య, అధ్యక్షుడు అనిల్ కుమార్, ఒయు ప్రెసిడెంట్ ఉదయ్ కుమార్ ఉప్పల, సాయి, శీను, లింగం, అశ్వన్, భాను, సిద్ధార్థ్, విద్యార్థి నాయకులు క్రాంతి కుమార్, సుమన్, అవినాష్ పాల్గొన్నారు.



## దోమల నిర్మూలనపై జిహెచ్‌ఎంసి ప్రత్యేక దృష్టి

### జూబ్లీహిల్స్‌లో కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తనిఖీలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌ను క్లీన్‌సిటీగా మార్చడమే లక్ష్యంగా దోమల నిర్మూలన, పారిశుద్ధ్య పనులను వేగవంతం చేయాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. జూబ్లీహిల్స్ సర్కిల్‌లో మంగళవారం ఆయన ఆకస్మిక పర్యటన జరిపారు. ఫిల్మ్ నగర్ వద్ద డోర్ టు డోర్ చెత్త సేకరణ తీరును, లోటస్ పాండ్ వద్ద వెక్టర్ కంట్రోల్ (దోమల నివారణ) చర్యలను కమిషనర్ స్వయంగా పరిశీలించారు. దేవరకొండ బస్తీలో చెత్త పోగుపడే ప్రాంతాలను శాశ్వతంగా తొలగించే పనులను తనిఖీ చేశారు. వర్షాకాలం దృష్ట్యా వెక్టర్ కంట్రోల్ చర్యలు మరింత బలోపేతం చేయాలని, ఇంజనీరింగ్ పనులను సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కమిషనర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ పర్యటనలో అదనపు కమి



షనర్(ఆరోగ్యం, పారిశుద్ధ్యం) ఎన్.రవి కిరణ్, జోనల్ కమిషనర్ ప్రియాంక అల పాల్గొన్నారు.

## హైడ్రా మెరుపు చర్యలు

### రూ.1650 కోట్ల విలువైన 11ఎకరాల భూమి కబ్జా నుంచి విముక్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైడ్రా తాజాగా వివిధ ప్రాంతాల్లో జరిపిన ఆపరేషన్‌లలో సుమారు రూ.1650 కోట్ల విలువైన 11ఎకరాల ప్రభుత్వ భూమిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శేరిలింగంపల్లి మండలం కొండాపూర్‌లోని సెంట్రల్ పార్క్ కాలనీలో పార్కు కోసం కేటాయించిన 2 ఎకరాల స్థలాన్ని హైడ్రా కాపాడింది. ఆక్రమణదారులు వేసిన తాత్కాలిక షెడ్‌లను తొలగించి, చుట్టూ ఫెన్సింగ్ వేసి బోర్డులు ఏర్పాటు చేశారు. అంబీర్ చెరువు ఆనుకుని ఉన్న 5ఎకరాల శ్మశాన వాటిక, 4 ఎకరాల డంపింగ్ యార్డు స్థలాలను ఆక్రమణల నుండి విముక్తం చేశారు. మొత్తం 9 ఎకరాల భూమికి రక్షణగా ఫెన్సింగ్ వేయడమే



కాకుండా, అది ప్రభుత్వ స్థలమని హెచ్చరిస్తూ బోర్డులు ఏర్పాటు చేశారు. హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ చర్యలపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై హైడ్రా తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంది.

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



**ప్రజాపక్షం/కేశంపేట :** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించడం సంతోషంగా ఉందని మాజీ జడ్పిటిసి తాంద్ర విశాల శ్రావణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం షాద్‌నగర్ పట్టణంలో నిర్వహించిన రతన్ టాటా ఆల్ నేషనల్ కుంగ్‌ఫూ కరాటే ఛాంపియన్‌షిఫ్ పోటీల్లో శ్రీ కాకతీయ పాఠశాల విద్యార్థులు మార్షల్ ఆర్ట్స్ నైపుణ్యంతో ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. స్పైరింగ్ విభాగంలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థి విఘ్నేష్, 8వ తరగతి చదువుతున్న విద్యార్థి కార్తీక్‌లను మాజీ జడ్పిటిసి సభ్యురాలు తాంద్ర విశాల శ్రావణ్‌రెడ్డిలు ప్రత్యేకంగా అభినంధించారు. 6వ తరగతికి చెందిన తనీష్ నాయక్ ద్వితీయ బహుమతి గెలుచుకోగా కట్ట విభాగంలో అభిషేక్, అన్షుద్, వైష్ణవ్‌రెడ్డి, సాక్షి, నిత్యశ్రీ, నిహాల్, నితీష్, విద్యశ్రీ, ప్రశాంత్‌లు అద్భుత ప్రదర్శన ఇచ్చిన ఇచ్చిన విద్యార్థులకు బహుమతులు అంధించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ స్వాతిరెడ్డి, మాస్టర్లు బాలరాజు, అహ్మద్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యసేవలు వినియోగించుకోవాలి

### రంగారెడ్డి జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ లలితాదేవి

**ప్రజాపక్షం/కొందుర్గు:** ప్రజాశ్రేయస్సుకు ప్రభుత్వం కల్పిస్తున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ కె.లలితాదేవి సూచించారు. మంగళవారం కొందుర్గు మండల కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన..ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ అమృత జోసేఫ్ ఆధ్వర్యంలో స్పెషలిస్ట్ వైద్యులతో మెగా హెల్త్‌క్యాంపు నిర్వహించారు. హెల్త్ క్యాంపును సర్పంచ్ ప్రభాకర్, ఉపసర్పంచ్ చందు, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ విజయలక్ష్మి , షాద్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన కృష్ణారెడ్డి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారిణి లలితాదేవి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులలో కావాల్సిన వైద్యసేవలు అంధించడమే కాకుండా తగిన మందులను సైతం



ఇస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం హెచ్‌పివి వ్యాక్సిన్‌ను 14ఏళ్ల నుండి 15ఏళ్ల లోపు అమ్మాయిలకు ఉచితంగా ఇస్తున్నామని వివరించారు. ఈ హెచ్‌పివి వ్యాక్సిన్ ప్రైవేట్ ఆసుపత్రుల్లో తీసుకుంటే నాలుగు నుండి ఐదు వేల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. సర్పంచ్ ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామస్తులు శ్రేయస్సు కోసం ఏర్పాటు చేసిన వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన హెల్త్ క్యాంపులో 432మందికి వైద్యసేవలు అందించినట్లు డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ జె.శ్రీనివాస్, రామ్మోహన్, హెల్త్ అసిస్టెంట్లు రాఘవులు, అశ్వక్, ఎల్‌డి కంప్యూటర్ శివ, ల్యాబ్ టెక్నిషియన్లు వెంకటముని, పరమేశ్వర్, వైద్యసిబ్బంది పుష్ప, గోపాలకృష్ణ, ప్రత్యేక వైద్యాధికారులు డాక్టర్ చరణ్‌కుమార్, డాక్టర్ నబి, దివ్వరెడ్డి, అనుష, డాక్టర్ దారా కిషన్ క్యూరాయిషి, డాక్టర్ గాయత్రి, అశ్విన్ జ్యోతి, నర్సింగ్‌తో పాటు ఆశావర్కర్లు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

## చెరువులు కబ్జా చేస్తే ఉపేక్షించేది లేదు

### డిఇఇ సమ్మయ్య

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** చెరువులను కబ్జా చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఇరిగేషన్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(డిఇఇ)సమ్మయ్య హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా మాడ్గుల్ మండల పరిధిలోని అప్పారెడ్డిపల్లి గ్రామ సమీపంలోని సర్వే నెంబర్ 168లోని కొత్తచెరువు అలుగు, నాలా అన్యాక్రాంతమవుతున్న విషయమై ఆదివారం అప్పారెడ్డిపల్లి గ్రామస్తులు చెరువు ఎదుట నిరసవ్యక్తం చేయగా అందుకు స్పందించిన ఇరిగేషన్ డిఇఇ సమ్మయ్య ఆధ్వర్యంలో అధికారులు మంగళవారం చెరువు, అలుగు ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆక్రమణదారులను, రైతులను పిలి



పించి మాట్లాడుతూ అలుగుకు అడ్డంగా వేసిన ఫెన్సింగ్ తొలగించాలని, ఈభూమికి సంబంధించిన పత్రాలను సోమవారం వరకు అందజేయాలని ఆదేశించారు. లేనిపక్షంలో నాలా డిజైన్‌ను పునరుద్ధరిస్తామన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎఇఇ మహేష్, గ్రామస్తులు, రైతులు, నాయకులు వున్నారు.

## పేదల ఆరోగ్యానికి అండ సిఎం రిలీఫ్ ఫండ్

### ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**ప్రజాపక్షం/హయత్ నగర్:** సిఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు లబ్ది చేకూరుతుందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నాగోల్ డివిజన్ పరిధిలోని జైపురి కాలనీకి చెందిన విజయకుమారి గుండెనొప్పికి సంబంధించిన పలు సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో ఆర్థికస్థితులు బాగలేక వారి కుటుంబసభ్యులు ఎమ్మెల్యేని సంప్రదించారు. స్పందించిన సుదీర్‌రెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రెండు లక్షల రూపాయలు ఎల్‌ఒసి చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా సుదీర్‌రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు



నాణ్యమైన అధునాతన వైద్య సేవలను పొందేందుకు సిఎం సహాయనిది అండగా ఉంటున్నారు. కార్యక్రమంలో ఆనంతుల రాజిరెడ్డి, ఆందోజు సత్యంచారి, పగిడిమర్రి శంకర్, నారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపసర్పంచ్ అంజయ్య మృతి బాధాకరం

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/కేశంపేట:** రోడ్డు ప్రమాదంలో సంతాపూర్ ఉపసర్పంచ్ అంజయ్య మృతి బాధకరమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం కేశంపేట మండలం సంతాపూర్ గ్రామానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెళ్ళి ఉప సర్పంచ్ అంజయ్య మృతదేహానికి నివాళ్ళు అర్పించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ప్రజల మనిషిగా పేరు ప్రతిష్టలు సాధించి రెండు పర్యాయాలు గ్రామ సర్పంచ్‌గా, ప్రస్తుతం ఉప సర్పంచ్‌గా అంజయ్య పని చేస్తున్నారు. అలాంటి వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధకరమైన విషయమని పేర్కొన్నారు. అంజయ్య ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో గూడ వీరేష్, తాంద్ర విశాల శ్రావణ్ రెడ్డి, పల్లె ఆనంద్, కరుణాకర్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

## వినియోగదారుల హక్కుల చట్టాలపై అవగాహన

### అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మల్యాల సాహితి

**ప్రజాపక్షం/కొత్తూరు:** వినియోగదారుల హక్కుల చట్టాలపై అవగాహన ఉండాలని షాద్‌నగర్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మల్యాల సాహితి అన్నారు. మంగళవారం నందిగామ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో సర్పంచ్ కొమ్ము కృష్ణ ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కు చట్టం దినోత్సవం సందర్భంగా వినియోగదారుల హక్కు చట్టంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మల్యాల సాహితి మాట్లాడుతూ వినియోగదారుడు ఏవస్తువు కొనుగోలు చేయాలన్న ముందుగా వాటి నాణ్యత ప్రమాణాలపై అవగాహన ఉండాలన్నారు. నాణ్యమైన వస్తువులు కొనుగోలు చేసే సమయంలో విధిగా రశీదు తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రశ్నించే హక్కు కోల్పోవాల్సి వస్తుందన్నారు. గడువు ముగిసిన వస్తువులను కొనుగోలు చేయరాదని సూచించారు. ఆన్‌లైన్



మోసాలను బలికావద్దని, అవసరం లేని వెబ్‌సైట్లను ఓపెన్ చేయరాదని సూచించారు. వ్యాపారుల నుంచి నష్టాలను చవిచూస్తే జిల్లా, రాష్ట్రస్థాయిలోను వినియోగదారుల ఫోరంలు ఉంటాయని, వాటిలో ధరఖాస్తులు చేయాలని సూచించారు. తద్వారా నష్టపరిహారం పొందే అవకాశం ఉంటుందని, మోసపోయినప్పుడు నష్టపరిహారం పొందడం మనహక్కు అనే విషయాన్ని గమనించాలన్నారు. కల్తీ వస్తువులు విక్రయించినట్లు వినియోదారుల ఫోరానికి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో నందిగామ సిఐ ప్రసాద్, షాద్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్వ వేణుగోపాల్‌రావు, నందిగామ ఉపసర్పంచ్ వెంకటేష్, న్యాయవాదులు నరేంద్రనాథ్, జయమ్మ, అంతారం నర్సింలు, శ్రీనివాసమూర్తి, రూప్‌సింగ్, బొమ్మగళ్ల రమేష్, వార్డు సభ్యులు నర్సింలు, చించేటి లత శివ, కొనుముల కిట్టు, శివగళ్ల ప్రవీణ్, నాయకులు పిట్టల రాములు, బాలరాజ్, అంతయ్య స్వామి, రామచంద్రితో పాటు నందిగామ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎంఎంసి కార్యాలయానికి ఉప్పల్ భగాయత్‌లో 10ఎకరాల స్థలం కేటాయింపు

## రూ.98 కోట్ల నిధులతో నిర్మాణం




**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** నగర శివారు ప్రాంతాల జిహెచ్ఎంసిలో విలీనం తర్వాత నూతనంగా ఏర్పాటైన మూడు కార్పొరేషన్లలో ఒకటైన మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) పరిపాలనా కార్యాలయానికి గాను శాశ్వత భవన నిర్మాణానికి ప్రభుత్వం అనుమతించింది. దీని కోసం ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో పది ఎకరాల భూమిని కేటాయించి రూ.98 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టనున్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని అత్యంత ఆధునిక వసతులతో విశాలంగా ఈ పరిపాలనా కార్యాలయాన్ని నిర్మించనున్నారు. కమిషనర్, మేయర్ ఛాంబర్లు, వివిధ విభాగాల ఉన్నతాధికారులు, సిబ్బంది పని చేసేందుకు అనుకూలమైన గదులు, కౌన్సిల్ సమావేశ మందిరం, నూతనంగా రానున్న 74 మంది కార్పొరేటర్లకు కూర్చొనే గదులు, పార్కింగ్, మౌలిక సదుపాయాలన్నింటితో ఈ నూతన భవనం నిర్మితం కానుంది. అనంతరం పూర్తి స్థాయిలో పరిపాలనా విభాగాలతో పాటు 74 డివిజన్ కార్పొరేటర్లతో కౌన్సిల్ సమావేశాలకు వీలుగా సువిశాల సమావేశ మందిరం నిర్మితం కానుంది. మంగళవారం ఉప్పల్, ఎల్‌బి నగర్ అసెంబ్లీ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిలు మందుముల పరమేశ్వరరెడ్డి, మధుయాష్కి గౌడ్‌లు కాంగ్రెస్ మాజీ ప్రజా ప్రతినిధులతో కల్సి ఎంఎంసి పరిపాలనా కార్యాలయ భవన నిర్మాణానికి ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఎంఎంసి పరిధిలోకి వచ్చే ఎల్‌బి నగర్, మల్కాజిగిరి, ఉప్పల్, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గాలకు అత్యంత అనుకూలంగా ఉండే స్థలంగా ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో శాశ్వత భవన నిర్మాణానికి రూ. 98 కోట్లు ప్రతిపాదనతో పదెకరాల స్థలాన్ని కేటాయించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



**కార్పొరేషన్ ఏర్పాటిలా...**

నూతనంగా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా 2013 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన టి.వినయ్ కృష్ణారెడ్డిని ప్రభుత్వం నియమించగా గత నెల 11న బాధ్యతలు స్వీకరించారు. తాత్కాలికంగా పరిపాలనా కార్యాలయాన్ని తార్నాకలోని పాత హెచ్ఎండిఓ కార్యాలయ భవనాన్ని కేటాయించగా ప్రస్తుతం అక్కడి నుండే పరిపాలన కొనసాగుతోంది. మేడ్చల్ జిల్లాలోని ఉప్పల్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలోని ఎల్‌బి నగర్ అసెంబ్లీ పరిధిలో వచ్చే 74 డివిజన్లతో ఏర్పాటైన ఈ నూతన మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిపాలనా నిర్వహణ నిమిత్తం మల్కాజిగిరి, ఉప్పల్, ఎల్‌బి నగర్ జోనల్ కార్యాలయాలను ఏర్పాటు చేసి ఐఎఎస్ స్థాయి అధికారులను జోనల్ కమిషనర్లుగా నియమించారు. . మల్కాజగిరి జోనల్ కార్యాలయ పరిధిలో కీసర, ఆల్వాల్, బోయినపల్లి, మౌలాలి, మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయాలు, ఉప్పల్ జోనల్ కార్యాలయ పరిధిలో ఘట్‌కేసర్, కాప్రా, నాచారం, బోడుప్పల్, ఎల్‌బి నగర్ జోనల్ కార్యాలయ పరిధిలో నాగోల్, సరూర్‌నగర్, ఎల్‌బి నగర్, హయత్‌నగర్ సర్కిల్ కార్యాలయాలను ఏర్పాటు చేసి ఒక్కో సర్కిల్ కార్యాలయాధికారిగా డిప్యూటి కమిషనర్లను నియమించారు. మల్కాజిగిరి మున్సిపల్ కమిషనరరేట్‌లో ఏర్పాటైన డివిజన్ల విషయానికి వస్తే కీసర సర్కిల్ పరిధిలో 6, ఆల్వాల్ సర్కిల్ పరిధిలో 6, బోయినపల్లి సర్కిల్ పరిధిలో 5, మౌలాలి సర్కిల్ పరిధిలో 5, మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో 4, ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలో 4, కాప్రా సర్కిల్ పరిధిలో 5, నాచారం సర్కిల్ పరిధిలో 5, ఉప్పల్ సర్కిల్ పరిధిలో 6, బోడుప్పల్ సర్కిల్ పరిధిలో 4, నాగోల్ సర్కిల్ పరిధిలో 6, సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో 7, ఎల్‌బి నగర్ సర్కిల్ పరిధిలో 5, హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో 6 డివిజన్ల ఏర్పాటుతో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌లో మొత్తంగా ఉన్న 74 డివిజన్లకు ప్రత్యక్ష ఎన్నికల ద్వారా కార్పొరేటర్లు రానున్నారు.

**ఆయా సర్కిళ్లలో డివిజన్లు ఇలా..**

కాప్రా సర్కిల్ పరిధిలో కీసర, చంద్రపురి కాలనీ, జవహర్‌నగర్, దమ్మాయిగూడ, యాప్రాల్, శామీర్‌పేట, ఆల్వాల్ సర్కిల్ పరిధిలో తుర్కపల్లి, మచ్చ బొల్లారం, టెంపుల్ ఆల్వాల్, వెంకటాపురం, భూదేవినగర్, కన్నాజిగూడ, బోయినపల్లి సర్కిల్ పరిధిలో మోండా మార్కెట్, ఫతేనగర్, ప్రకాష్‌నగర్, ఓల్డ్ బోయినపల్లి, హస్మత్‌పేట, మౌలాలి సర్కిల్ పరిధిలో బలరాంనగర్, వినాయక్‌నగర్, మౌలాలి, కాకతీయనగర్, నేరేడ్‌మెట్, మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో ఈస్ట్ ఆనంద్‌బాగ్, మిర్జాలగూడ, గౌతంనగర్, మల్కాజిగిరి డివిజన్లు ఉంటాయి. ఉప్పల్ సర్కిల్ పరిధిలో నాగారం, ఘట్‌కేసర్, ఏదులాబాద్, పోచారం, కాప్రా సర్కిల్ పరిధిలో వంపుగూడ, కాప్రా, ఏఎస్ రావునగర్, కుషాయిగూడ, చెర్లపల్లి, నాచారం సర్కిల్ పరిధిలో శాంతి సాయినగర్, హెచ్‌బి కాలనీ, మల్లాపూర్, నాచారం, హెచ్ఎంటి నగర్, ఉప్పల్ సర్కిల్ పరిధిలో చిలుకానగర్, బీరప్పగూడ, హబ్సిగూడ, రామంతాపూర్, వెంకట రెడ్డినగర్, ఉప్పల్, బోడుప్పల్ సర్కిల్ పరిధిలో మేడిపల్లి, ఫిర్జాదిగూడ, బోడుప్పల్, చెంగిచెర్ల డివిజన్లు ఉంటాయి.నాగోల్ సర్కిల్ పరిధిలో నాగోల్, మన్సూరాబాద్, లెక్చరర్స్ కాలనీ, కుంట్లూర్, పెద్ద అంబర్‌పేట, సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో కొత్తపేట, చైతన్యపురి, గడ్డిఅన్నారం, సరూర్‌నగర్, డాక్టర్స్ కాలనీ, ఆర్ కె పురం, ఎన్‌టిఆర్ నగర్, ఎల్‌బి నగర్ సర్కిల్ పరిధిలో లింగోజిగూడ, చంపాపేట, కర్మాన్‌ఘాట్, బైరామల్‌గూడ, హస్తినాపురం, హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో బిఎన్ రెడ్డి నగర్, వనస్థలిపురం, చింతలకుంట, హైకోర్టు కాలనీ, సాహెబ్‌నగర్, హయత్‌నగర్ డివిజన్లు ఉంటాయి.



### స్థల పరిశీలన

ఎఎంసి కార్యాలయానికి ఉప్పల్ భగాయత్‌లో నిర్మించేందుకు మంగళవారం మేడ్చల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, ఎల్బీనగర్ నియోజకవర్గం ఇంఛార్జీ మధుయాష్కీ గౌడ్, ఉప్పల్ నియోజకవర్గం ఇంఛార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు,కార్యకర్తలు ఉప్పల్ భగాయత్‌లో ప్రతిపాదిత స్థలాన్ని సందర్శించి పరిశీలించారు.



## ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దడమే లక్ష్యం

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య సహకారంతో లింగంపల్లి గ్రామంలో సిసి రోడ్డు పనులను ప్రారంభించినట్లు లింగంపల్లి గ్రామ సర్పంచ్ వడ్ల శోభ పరమేశ్వర్ తెలిపారు. నవాబుపేట్ మండల పరిధిలోని లింగంపల్లి గ్రామంలో 1, 2, 5, 8 వార్డులో రూ.20 లక్షల (ఎన్ఆర్ఈజీఎస్) ఉపాధి హామీ నిధులతో సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగంపల్లి గ్రామంలో కొన్ని వార్డులలో రోడ్లు కొన్నిచోట్ల లేకపోవడంతో అక్కడ వేయడం జరుగుతుంది. అంతే కాకుండా గ్రామంలో మొత్తం అండర్ డ్రైనేజీ పనులు కూడ స్థానిక ఎమ్మెల్యే సహకారంతో త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. వార్డులో రోడ్లు లేక గుంతలమయంగా ఉందని, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాము. వెంటనే ఆయన స్పందించి సిసి రోడ్డు నిర్మాణానికి ఎన్ఆర్ఇజీఎస్ నిధులు మంజూరు చేశారని తెలిపారు. నిధులు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు చెప్పారు. గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ గంగ్యాడ ప్రవీణ్ కుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటలక్ష్మి, వార్డు సభ్యులు కండ్లపల్లి పాండు, మాదిగ మల్లమ్మ, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



## క్రీడలు మానసిక ఉత్సాహాన్ని పెంచుతాయ్

### ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** క్రీడలు మానసిక ఉత్సాహాన్ని పెంచుతాయని మాజీ మంత్రి స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. ఎస్‌వైఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు సామల యాదిరెడ్డి అధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఫైనల్ మ్యాచ్‌కి బహుమతి ప్రదానోత్సవం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా చామకూర మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌వైఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు సామల యాదిరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో చైతన్యమైన యువత క్రీడలలో నైపుణ్యం సాధించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాలలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసి క్రీడా రంగాలను ప్రోత్సహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి బండారి శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్‌లు ఓరుగంటి వెంకటేష్ గౌడ్, వంగూరి శివశంకర్, కొంతం వెంకట్‌రెడ్డి, మొట్టు బాల్‌రెడ్డి, సింగిరెడ్డి సాయిరెడ్డి, బండారి ఆంజనేయులు, బిఆర్ఎస్ అధ్యక్షులు పాల్గొన్నారు.



## ప్రత్యేక వైద్య శిబిరం విజయవంతం

### వైద్యాధికారి డాక్టర్ స్వర్ణ కుమారి

**ప్రజాపక్షం/నవాబుపేట్:** నవాబుపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నవాబుపేట నందు ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం క్యాంపుకు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించడం చాలా సంతోషం అని జిల్లా వైద్యాధికారిణి స్వర్ణ కుమారి అన్నారు. అదేవిధంగా వైద్య పరీక్షలు చేసిన వారందరికీ ఉచిత మందులు పంపిణీ చేశామన్నారు. నవాబుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 'ప్రజాపాలన 99రోజుల ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వైద్య నిపుణులతో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై నిపుణుల వద్ద ఉచిత వైద్య పరీక్షలు చేయించుకొని అవసరమైన చికిత్సలు, ఆరోగ్య సూచనలు పొందినారని పేర్కొన్నారు.ఉదయం 10:00గంటల నుండి మధ్యాహ్నం 3:00గంటల వరకు మండల ప్రజలు అందరు సద్వినియోగం చేసుకున్నందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ వైద్య శిబిరంలో జనరల్ మెడిసిన్, పిల్లల, కంటి వైద్యం, ఆర్థోపెడిక్స్, గైనకాలజీ, దంత వైద్య విభాగాలకు చెందిన మొత్తం ఆరుగురు నిపుణులు పాల్గొని రోగులను పరిశీలించి అవసరమైన వైద్య సేవలు అందించి విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ రోహిత్, డెంటల్ వైద్యురాలు సుహాసిని, ఆర్థోపెడిక్ శశాంక్, జనరల్ వైద్యులు ప్రణయ్, కంటి వైద్య నిపుణులు నిఖిత, గైనకాలజిస్ట్ సాయిప్రియ, తదితరులు పాల్గొన్నారు.



## సేంద్రియ వ్యవసాయంపై రైతులకు శిక్షణ

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** సేంద్రీయ వ్యవసాయంపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించామని జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ అన్నారు. మంగళవారం మూడుచింతలపల్లి మున్సిపల్‌లోని రైతు వేదికలో వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం సేంద్రీయ ఎరువుల వాడకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన డైరీ ఆవిష్కరించారు. రైతులకు వ్యవసాయంలో మెళకువలతో కూడిన క్యాలండర్లను అందజేశారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలుయాదవ్, మున్సిపల్ చైర్మన్ జాం రవిలు మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ వెంకట్రామ్‌రెడ్డి, కౌన్సిలర్ నీరజ్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## ఎన్‌డిఆర్‌ఎఫ్ మాక్ డ్రిల్ ప్రదర్శనలు







**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** కర్మాగారాలు, రద్దీగా ఉండే జనావాస ప్రాంతాల్లో కెమికల్ బ్లాస్టింగ్, బాంబ్ బ్లాస్టింగ్‌లాంటి ప్రమదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల విషయమై జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డిఆర్‌ఎఫ్) మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో మాక్ డ్రిల్ నిర్వహించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజల చొరవ, సహాయక సంస్థల సమన్వయంతో ప్రమాదాల్లో చిక్కుకొని పోయిన వారి ప్రాణాలను రక్షించటం, క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించటం, ప్రమాద స్థాయిని తగ్గించటంతోపాటు పూర్తిగా నివారించటం వంటి అంశాలపై మాక్ డ్రిల్‌లో ఎన్‌డిఆర్‌ఎఫ్ ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించారు. పేలకుం డా ఉండే బాంబులను గుర్తించి వాగొని నిర్వీర్యం చేయటం, మంటలు పెరిగి పోవటాని కి కారణమయ్యే కెమికల్స్ వాటిని తొలగించ టం, కెమికల్ బ్లాస్ట్ అయినప్పుడు విడుదలయ్యే వాయు కాలుష్య సాంద్రతను బట్టి అత్యవసరమైన, అవసరమైన మేరకు పరిస్థితులకు అనుగుణంగా సహజమైన వాతావరణాన్ని నెలకొల్పేందుకు ఎన్‌డిఆర్‌ఎఫ్ చర్యల గురించి అధికారి గౌతం కుమార్ స్పష్టం చేసారు. ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు వేగంగా స్పందిస్తూ క్షతగాత్రులకు అవసరమైన ప్రత్యేక కిట్స్, మాస్కులు, డ్రెస్, గ్లౌజులు వంటివి అందిస్తూ ఆస్పత్రికి తరలించాల్సి వస్తుందన్నారు. ఈ మాక్‌డ్రిల్‌లో జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, పోలీస్ విభాగ అడిషనల్ డిసిపిలు వెంకటరెడ్డి, హన్మంతరావు, డిఆర్‌ఒ చంద్రావతి, తదితరులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తాం

### అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ హామీ



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఆశా వర్కర్ల సమస్యలను తప్పనిసరిగా పరిశీలించి పరిష్కారం చేస్తానని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ హామీ ఇచ్చారు. మంగళవారం తెలంగాణా ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ధర్నా నిర్వహిస్తున్న వారి వద్దకు వచ్చిన ఆయన ఈ మేరకు హామీ ఇచ్చారు. నిరసనకారులతో మాట్లాడి వారి సమస్యలన్నిటిని అడిగి తెలుసుకొన్న అనంతరం జిల్లా వైద్యారోగ్య శాఖాధికారితో చర్చించి నియమ నిబంధనల మేరకు పరిష్కరిస్తానన్నారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద జరిగిన ఆశా వర్కర్ల ఆందోళన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగినులు వచ్చి నినాదాలు చేస్తూ తమ సమస్యలను ఇకనైనా పరిష్కరించాలంటూ ధర్నా చేసారు. వారి ఆందోళన ఓ దశలో ఉద్రిక్తతకు దారితీసింది. తమ సమస్యలన్నిటిని పరిష్కరిస్తానంటూ ఎన్నికలకు ముందు హామీలిచ్చి అధికారంలోకి చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లు పూర్తయినా నేటికీ పట్టించుకోకపోవటం పట్ల ఆగ్రహం వ్యక్తంచేసారు. సమయ పాలన లేకుండా ఆశా వర్కర్లతో సంబంధంలేని పనులను సైతం వెట్టి చాకిరీలా చేయిస్తున్న ప్రభుత్వం కార్మిక శాఖ నిబంధనల మేరకు అయినా కనీస వేతనాలు ఇవ్వకపోవటం ఎంతవరకు సబబని ఆందోళనలో పాల్గొన్న ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి, సిఐటియు మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎర్ర అశోక్‌లు ప్రశ్నించారు. కలెక్టరేట్ కార్యాలయం వద్ద తలపెట్టిన నిరసనలో పాల్గొనకుండా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చే ఆశా వర్కర్లను అడ్డుకొన్న పోలీసులు సమీప పోలీస్‌స్టేషన్లకు తరలించటం పట్ల నిరసకారులు తీవ్ర అభ్యంతరం తెలపటంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి రేవతి, అధ్యక్షురాలు అనిత, యూనియన్‌కు చెందిన శంకరమ్మ,తదితరులు పాల్గొన్నారు.

## పశువులకు గాలికుంటు నివారణ టీకా తప్పనిసరి

### మున్సిపల్ చైర్ పర్సన్ అనన్య

**ప్రజాపక్షం/వికారాబాద్ :** రైతులు తమ పశువులకు గాలి కుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ అనన్య తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం పశువైద్య, సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జాతీయ పశు వ్యాధుల నివారణ టీకాలు కార్యక్రమంలో భాగంగా ఈ రోజు వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 25వ వార్డులో గేదెలకు గాలి కుంట నవారణ టీకాలు వేశారు. వికారాబాద్ ఏరియా ఆసుపత్రి పశువైద్య సహాయసంచాలకులు కె.పూర్ణచందర్ రావు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశుసంపదను పెంచటానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. పశువులకు సోకే వ్యాధులను ముందే గుర్తించడం వల్ల పశువుల యాజమానులకు నష్టం రాకుండా చూడవచ్చన్నారు. గాలి కుంటు వ్యాధి పశువులకు సోకితే తీవ్రమైన జ్వరం, పాడి పాశువులలో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు వినోద్‌కుమార్, రామకృష్ణారెడ్డి ఎడి విజయలక్ష్మి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

**రంజన్ తోఫాలు పంపిణీ:** రంజన్ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలకు అందిస్తున్న రంజాన్ తోఫాను వికారాబాద్ ఎమ్మెల్యే క్యాపు కార్యాలయంలో లబ్దిదారులకు అందజేసిన చైర్‌పర్సన్ అనన్య మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని, పేద ముస్లింలు పండుగ రోజు కొత్త బట్టలు ధరించి అనందంగా ఉండాలనే మంచి ఉద్దేశంతో రాష్ట్ర పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.



## వికారాబాద్ జిల్లాలో ఎసిబి దాడులు

**ప్రజాపక్షం/వికారాబాద్ :** జిల్లాలోని పెద్దేముల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐగా పనిచేస్తున్న సైమన్ రూ.15000వేలు లంచం తీసుకుంటు పట్టుబడ్డాడు. వివారాలు ఇలా ఉన్నాయి...పెద్దేముల్ మండల ఆర్ఐగా పనిచేస్తున్న సైమన్ భూమి మ్యుటేషన్ చేయుటకు సదరు రైతు వద్ద డబ్బులు డిమాండ్ చేశారు. ఈ విషయంలో రైతు ఎసిబిని ఆశ్రయించారు. రూ.15వేల లంచం తీసుకుంటు హైదారాబాద్‌లోని గుడిమల్కాపూర్‌లో ఏసిబికి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. సదరు అధికారి అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఏసిబి అధకారులు పెద్దేముల్ తహసీల్దార్ కార్యాలయంలో తనిఖీలు చేపడుతున్నారు.

## చెరువు సుందరీకరణ డిజైన్లు పూర్తి

**ప్రజాపక్షం/ఉప్పల్ :** నాచారంలోని హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువు సుందరీకరణ పనులకు సంబంధించి డిజైనింగ్ ప్రక్రియ పూర్తయింది. త్వరలో ఈ పనులు ప్రారంభం కానున్నాయి. సుమారు రూ.30 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ అభివృద్ధి పనులపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి డిజైనింగ్ పనులను పర్యవేక్షిస్తున్న చెరువు సుందరీకరణ ఏజెన్సీ ప్రతినిధులు యూసుఫ్, శ్రీనాథ్‌లతో కలిసి చెరువును పరిశీలించారు. చెరువును ఎలా అభివృద్ధి చేయాలనే అంశం పై వారు స్థల పరిశీలన నిర్వహించారు.

చెరువులో గుర్రపు డెక్క విపరీతంగా పెరగడంతో నాచారం ప్రాంత ప్రజలు దోమల సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే వివరించారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని చెరువులోని నీటిని తక్షణమే ఖాళీచేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీనిపై స్పందించిన ఏజెన్సీ ప్రతినిధులు చెరువులోని నీటిని తొలగించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

గత 30–40 సంవత్సరాలుగా ఈ చెరువును ఎవరూ పట్టించుకోలేదని, ప్రస్తుతం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవతో రూ.30 కోట్ల నిధులు మంజూరు కావడం పట్ల హెచ్ఎంటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



## సిపిఐ అధ్వర్యంలో నిరసన కార్యక్రమం


**ప్రజాపక్షం /వికారాబాద్ :** జిల్లా కేంద్రంలోని ఎన్‌టిఆర్ చౌరస్తాలో సిపిఐ పార్టీ అధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని జిల్లా సహాయ కార్యదర్శి ఫిర్ మహమ్మద్ ,జిల్లా కార్యవర్గ సభ్యులు వెంటేష్ అధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వంటగ్యాస్ ధరలను వెంటనే దగ్గించాలని,గ్యాస్ సబ్సిడీని తిరిగి అమలు చేయాలని అన్నారు. అమెరికా ,ఇజ్రాయిల్ యుద్దాలను ఆఫి శాంతి చర్చలు జరపాలన్నారు. భారతదేశం ఒక్కప్పుడు అలీనోద్యమానికి నాయకత్వం వహించిదని తెలిపారు. ట్రాంప్ ,మనదేశంపై విదిస్తున్న షరుతులకు తలపడటం మనుకోవాలని సూచించారు. ప్రజల జీవన వ్యయాన్ని తగ్గించే చర్యలు తీసుకోవాలనిఅమెరికా ఇతర దేశలపై యుద్దాన్ని ప్రకటించి చిన్న దేశాలపై తమ పెత్తనాన్ని బలవంతంగా రుద్దడం జరుగుతున్న నేపథ్యంలో మన దేశం వైకరిని స్పష్టంగా తెలియజేయాలి , ఈ కార్యక్రమంలో అనంతయ్య , ఖాదిర్ ఆచారి ,బాబునాయక్ , వీరంపల్లి రాములు ,కిష్టయ్య, ,శ్రీకాంత్ తదితరులు పాల్గోన్నారు.




## రైల్వే కార్మికుల హక్కులకోసం మజ్దూర్ యూనియన్ పోరాటాలు

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** రైల్వే కార్మికుల హక్కుల కోసం నిరంతరం ఎల్లప్పుడు మజ్దూర్ యూనియన్ పోరాటాలు చేస్తున్నామని రైల్వే డివిజన్ సెక్రేటరీ రవిందర్ తెలిపారు. సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ ఘట్‌కేసర్ బ్రాంచ్ సెక్రెటరీ బొల్లెపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మొదటి సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డివిజన్ సెక్రటరీ పి రవిందర్, సిసిఎస్ఎండిసిహెచ్ స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైల్వే కార్మికులనుద్దేశించి సెక్రెటరీ రవిందర్ మాట్లాడుతూ రైల్వేలో మజ్దూర్ యూనియన్ ఎల్లప్పుడు కార్మికుల పక్షాన నిలబడి పోరాటాలు చేస్తుందని డివిజన్‌లో కార్మికులు అనేక సమస్యలు పరిష్కరించామని తెలిపారు. ఇంజనీరింగ్ కార్మికులకు నైట్ పెట్రోలింగ్ మాన్ ఇద్దరిని నియమించాలని డిమాండ్ చేశారు. ట్రైన్ల రద్దీకి అనుకూలంగా పోస్టులను భర్తీ చేయాలని, కార్మికులకు అదనపు పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. రైల్వే ప్రైవేటీకరణను రద్దు చేయాలని రైల్వే స్టేషన్ల ప్రైవేటీకరణను విరవించుకోవాలని కోరారు. తోటి కార్మికుని సహాయం కోసం రూ.5లక్షల ఇన్సూరెన్స్ చెక్కును వారి తల్లికి రవిందర్, బొల్లెపల్లి శ్రీనివాస్‌ల చేతుల మీదుగా వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ చైర్మన్ టి.విజయకుమార్, బ్రాంచ్ సెక్రెటరీ బొల్లెపల్లి శ్రీనివాస్, అసిస్టెంట్ సెక్రెటరీ వై. వెంకటేశ్వర్లు, అన్నపూర్ణ, క్రిష్ణ, వైస్ చైర్మన్ బి.హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## వేలం పద్ధతిలో వాణిజ్య సముదాయాల అమ్మకాలు



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** జిలాలలో ఉన్న 16 టూ బిహెచ్‌కె కాలనీల్లోని 992 వాణిజ్య సముదాయాలను వేలం పద్ధతిలో విక్రయించనున్నామని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తెలిపారు. దీనికోసం మంగళవారం జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయా ల డిప్యూటి కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు, సబ్ రిజిస్ట్రార్లు, హౌజింగ్ బోర్డు అధికార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వేలం కార్యక్రమానికిగాను మార్కెట్ ధరల ప్రకారం కనీస ధరను నిర్ణయించి 3 నుండి 10 శాతం వరకు ముందస్తు దరావత్తు (ఈఎండి) గా వసూలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వేలం పద్ధతిలో విక్రయించగా వచ్చే సొమ్మును కాలనీ అభివృద్ధి పనులకు మాత్రమే వినియోగిస్తామన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
బుధవారం
18-03-2026
www.prajapaksham.in

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా తెరకెక్కిన 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా 19న ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో దర్శకుడు హరీష్ శంకర్ ప్రమోషన్ కార్యక్రమాలతో వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటూ సినిమా విశేషాలు పంచుకుంటూ, తాజాగా మెగాస్టార్ చిరంజీవి గురించి చెప్పిన మాటలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సినిమా గురించి మాట్లాడిన హరీష్ శంకర్, 'ఉస్తాద్ భగత్ సింగ్' పవన్ కల్యాణ్ అభిమానులకు నిజమైన మాస్ జాతరలా ఉంటుందని తెలిపారు.

# రీల్

## 'పోలీస్ కంప్లైంట్' టీజర్ విడుదల



సౌతిండియా ప్రేక్షకుల ముందుకు యాక్షన్, కామెడీ, హారర్ థ్రిల్లర్ కలగలిపిన సినిమాను తీసుకురాబోతున్నారు దర్శకుడు సంజీవ్ మేగోటి. వరలక్ష్మి శరత్‌కుమార్, నవీన్ చంద్ర, రాగిణి ద్వివేది, కృష్ణ సాయి ప్రధాన పాత్రల్లో నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రం 'పోలీస్ కంప్లైంట్' కన్నడ వెర్షన్ టీజర్‌కు బెంగళూరులో సినీ ప్రముఖుల సమక్షంలో ఘనంగా విడుదల చేశారు. ఈ వేడుకకు 'దేవి' చిత్రం ద్వారా గుర్తింపు పొందిన నటి ప్రేమ, 'దండుపాళ్యం' ఫేమ్ పూజా గాంధీ, కన్నడ ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.ఆర్.కె.విశ్వనాథ్ ముఖ్య అతిథులుగా హాజరై టీజర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నటి రాగిణి ద్వివేది మాట్లాడుతూ, 'పోలీస్ కంప్లైంట్' కథ ఎంతో ఆసక్తికరంగా ఉందని, ఇది ప్రేక్షకులను ఆకట్టుకునే సస్పెన్స్ థ్రిల్లర్ అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. తక్కువ సమయంలోనే ఇంత క్వాలిటీతో సినిమాను నిర్మించిన దర్శక నిర్మాతలను అభినందించారు. అలాగే వరలక్ష్మి శరత్‌కుమార్, నవీన్ చంద్ర వంటి ప్రతిభావంతులైన నటులతో కలిసి పనిచేయడం సంతోషంగా ఉందన్నారు. దర్శకుడు సంజీవ్ మేగోటి మాట్లాడుతూ, కేవలం 45 రోజుల్లో 52 మంది సీనియర్ ఆర్టిస్టులతో ఈ సినిమాను తెరకెక్కించడం ఒక ప్రత్యేక అనుభవమని తెలిపారు. 'పోలీస్ కంప్లైంట్' పూర్తి స్థాయి సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిందని, ప్రేక్షకులను తప్పకుండా ఆకట్టుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. త్వరలో నే ఈ సినిమాను విడుదల చేస్తామని తెలిపారు.

## సందడిగా 'యూత్' మీట్



కెన్ కరునాస్, అనిష్మ అనిల్ కుమార్, దేవదర్శిని చేతన్, సూరజ్ వెంజరముడు, ప్రియాన్షి యాదవ్, మీనాక్షి దినేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తమిళ మూవీ 'యూత్'. ఈ చిత్రాన్ని ఇదే పేరుతో ఈ2సీ బ్యానర్‌పై తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు హౌస్ ఫుల్ వినీత్, సందీప్. ఈ చిత్రానికి కెన్ కరునాస్ అండ్ గ్యాంగ్ దర్శకత్వం వహించారు. ఈ నెల 26న 'యూత్' మూవీ తెలుగులో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. 'కమ్ విత్ యువర్ గ్యాంగ్, నో ఏజ్ లిమిట్' అనే స్లోగన్‌తో ఈ సినిమా ప్రమోషనల్ క్యాంపెయిన్ చేస్తున్నారు. సోమవారం ఈ సినిమా ప్రెషర్స్ మీట్ కార్యక్రమం పలువురు సినీ ప్రముఖుల సమక్షంలో హైదరాబాద్‌లో సందడిగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీవోపీ సూర్య బాలాజీ మాట్లాడుతూ 'యూత్' మూవీని సందీప్, వినీత్ తెలుగు ఆడియెన్స్ ముందుకు తీసుకొస్తున్నారు. ఒక మూవీని ఎలా ఆడియెన్స్‌కు రీచ్ చేయాలి అనేది సందీప్, వినీత్‌ను చూసి తెలుసుకోవాలి. 19న తమిళంలో యూత్ మూవీని చూద్దాం, అలాగే 26న తెలుగులో చూసి హిట్ చేద్దాం అన్నారు. హీరో మౌళి తనూజ్ మాట్లాడుతూ 'యూత్' మూవీ టీజర్ చాలా బాగుంది. నేను సినిమా మొత్తం చూశాను. కంప్లీట్ ఎంటర్‌టైనింగ్ మూవీ ఇది. మన తెలుగు ఆడియెన్స్‌కు బాగా నచ్చుతుంది. మీ అందరినీ పక్కాగా ఎంటర్‌టైన్ చేసే చిత్రమిది. మీరంతా తప్పకుండా ఈ నెల 26న యూత్ మూవీ థియేటర్స్‌లో చూడండి. వినీత్, సందీప్‌కు ఆల్ ది బెస్ట్ చెబుతున్నా. అన్నారు. హీరోయిన్ ప్రియాన్షి యాదవ్ మాట్లాడుతూ 'యూత్' మూవీతో తమిళంతో పాటు తెలుగు ఆడియెన్స్‌కు పరిచయం కావడం సంతోషంగా ఉంది. మా సినిమాను థియేటర్స్‌లో మీరంతా చూస్తారని కోరుకుంటున్నా అన్నారు. హీరోయిన్ మీనాక్షి మాట్లాడుతూ తెలుగు ఆడియన్స్ యంగ్ టాలెంట్‌ను ఎంకరేజ్ చేయడంలో ముందుంటారు అన్నారు. ఈ కార్యక్రమంలో అనిష్మ అనిల్ కుమార్, ప్రొడ్యూసర్ వినీత్, ప్రొడ్యూసర్ సందీప్, లిరిసిస్ట్ సనరే, ప్రొడ్యూసర్ కరుపయ్య, డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్, డైరెక్టర్ వెంకటేష్ నిమ్మలపూడి, డైరెక్టర్ గోపీనాథ్ రెడ్డి, డైరెక్టర్ రవికిరణ్ కోలా, యాక్టర్ సూరజ్ వెంజరముడు, డైరెక్టర్ వెంకటేష్ మహా, డైరెక్టర్ వశిష్ట, హీరో, డైరెక్టర్ కెన్ కరునాస్ పాల్గొన్నారు.

## పలు భాషల్లోకి 'వనజీవి రామయ్య' బయోపిక్



పద్మశ్రీ అవార్డు గ్రహీత, 'కోటి మొక్కల రామయ్య'గా ప్రసిద్ధి చెందిన వనజీవి దరిపల్లి రామయ్య జీవిత కథ వెండితెరపైకి వచ్చింది. సమాజానికి పర్యావరణ సందేశాన్ని అందించిన ఈ మహనీయుడి జీవితం ఆధారంగా రూపొందిన 'వనజీవి రామయ్య' బయోపిక్ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే గద్దర్ అవార్డుల్లో బెస్ట్ షార్ట్ ఫిలిమ్స్ విభాగంలో ఎంపికైంది. నంది అవార్డు గ్రహీత వేముగంటి దర్శకత్వంలో నిదిగొండ నరేష్ కుమార్ ప్రజాపతి, భూషం రవీంద్రనాథ్, లింగంపల్లి చంద్రశేఖర్ నిర్మించిన ఈ సినిమాకు బల్లేపల్లి మోహన్ సంగీతాన్ని అందించారు. తాజాగా చిత్రయూనిట్ హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో ప్రత్యేక ప్రివ్యూ ప్రదర్శన నిర్వహించింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల, టిజెఎస్ చీఫ్ ప్రొఫెసర్ కోదండరాం, రాజకీయ విశ్లేషకులు వి.ప్రకాష్, తన్నేరు బాబు రావు, నాగ మహేష్, సినీ ప్రముఖులు తనికెళ్ల భరణి, తమ్మారెడ్డి భరద్వాజ తదితరులు హాజరై చిత్రాన్ని అభినందించారు. ఈ చిత్రాన్ని భారతీయ భాషల్లో కూడా విడుదల చేయాలని నిర్ణయించినట్లు చిత్ర బృందం వెల్లడించింది. దర్శకుడు వేముగంటి మాట్లాడుతూ, కోటి మొక్కలు నాటి ప్రకృతికి సేవ చేసిన రామయ్య గారి జీవితం భవిష్యత్ తరాలకు ప్రేరణగా నిలవాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. త్వరలోనే భారతీయ భాషల్లో కూడా ఈ బయోపిక్‌ను తీసుకురానున్నాం అని తెలిపారు. సంగీత దర్శకుడు బల్లేపల్లి మోహన్ కూడా ఇదే భావనను వ్యక్తం చేస్తూ, ఈ చిత్రాన్ని ప్రకృతి ప్రేమికుడు రామయ్యకు నివాళిగా అంకితం చేస్తున్నామని చెప్పారు.

## ఏప్రిల్ 10న 'డెకాయిట్'



అడివి శేష్ ఇప్పుడు కొత్త అవతార్‌లో 'డెకాయిట్'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రంలో శేష్ తొలిసారిగా మాస్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషిస్తున్నారు. షానియల్ డియో ఈ సినిమాతో దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. సుప్రియా యార్లగడ్డ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పిస్తోంది. 'డెకాయిట్' ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా హీరో అడవి శేష్ మాట్లాడుతూ ఇద్దరూ విడిపోయిన మాజీ ప్రేమికులు, వాళ్ళ జర్నీలో ఏం రియలైజ్ అవుతారో ఇందులో చాలా స్పెషల్‌గా ఉంటుంది. చుట్టూ గన్స్ బుల్లెట్స్ ఉన్నప్పుడు ఇద్దరి మధ్య ఎమోషన్ ఎలా ఉంటుందని ఇందులో చాలా కొత్తగా ఉంటుంది. కలిపి 149 రోజుల్లో షూటింగ్ కంప్లీట్ చేశాం. కథ ఏడాదిపాటు రాశాం అని అన్నారు. అది అద్భుతంగా వర్క్ అవుట్ అయ్యింది. ఈ సినిమా తెలుగు, హిందీ భాషల్లో షూట్ చేశాం. హిందీలో కొన్ని సీన్స్ ట్రీట్‌మెంట్ కాస్త డిఫరెంట్‌గా ఉంటుందని చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం భీమ్స్, కొరియోగ్రాఫర్ విజయ్, ప్రొడక్షన్ డిజైనర్ నాగేంద్ర.

## పోస్ట్ ప్రొడక్షన్‌లో 'గోట్'



ప్రముఖ హాస్య కథానాయకుడు సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం గోట్ అనేది ఉపశీర్షిక. దివ్యభారతి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి వేదవ్యాస్ దర్శకుడు. మహాతేజ క్రియేషన్స్ అండ్ జైష్ణవ్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి చంద్రశేఖర్ రెడ్డి మొగుళ్ళ నిర్మాత. ప్రస్తుతం నిర్మాణానంతర పనులను జరుపుకుంటోన్న ఈ చిత్రం 26న ప్రపంచ వ్యాప్తంగా థియేట్రికల్ రిలీజ్ కానుంది. త్వరలోనే ఈ చిత్రం ట్రైలర్‌ను కూడా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. నిర్మాత చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఖర్చు విషయంలో ఎక్కడా రాజీపడకుండా చాలా రిచ్‌గా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. టెక్నికల్‌గా కూడా చిత్రం ఉన్నతస్థాయిలో వుంటుంది. సుడిగాలి సుధీర్ కెరీర్లో ఈ చిత్రం మైల్‌స్టోన్‌గా నిలుస్తుంది. సినిమా ఆద్యంతం ప్రతి ఫ్రేమ్ ఎంతో అద్భుతంగా ఉంటుంది. పూర్తి కమర్షియల్ అంశాలతో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో యువతను ఆలోచింపజేసే ఓ మంచి విషయం కూడా దాగి ఉంటుంది. తప్పకుండా ఈ చిత్రం అందర్ని అలరిస్తుందనే నమ్మకం ఉంది' అన్నారు.

## 'మక్కళు మక్కళు కాలేజా' పాట ఆవిష్కరణ



ప్రముఖ దర్శకుడు మహేష్ చంద్ర దర్శకత్వంలో డాక్టర్ రాజేంద్రప్రసాద్, పథ్వీరాజ్, కేదార్ శంకర్, మణి చందన, అన్నపూర్ణమ్మ, సన్నీ అఖిల్, విరాట్, సాయి ప్రణీత్, శ్రీలు, ప్రత్యూష, రెహానా ప్రధాన తారాగణంగా రూపొందిన చిత్రం 'పితాపురంలో'. దీనికి ఉప శీర్షిక 'అలా మొదలైంది'. మహేష్ చంద్ర సినిమా టీం బ్యానర్‌పై దుండి గళ్ళ బాల కృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్.ఎం. మురళి (గోదావరి కిట్టయ్య) ఈ చిత్రాన్ని నిర్మించారు. జి.సి.క్రిష్ సంగీత దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాలోని 'మక్కళు మక్కళు కాలేజా యవ్వన మర్కట గ్యారేజా' పాటను ప్రముఖ దర్శకుడు వి.వి. వినాయక్ ఆవిష్కరించారు. ఈ పాటను శ్రీరామ్ తపస్వి రాశారు. ఈ సందర్భంగా వినాయక్ మాట్లాడుతూ 'నేను కో డైరెక్టర్‌గా చంద్ర మహేష్ దగ్గర 'చెప్పాలని ఉంది' చిత్రానికి పనిచేశాను. ఆ తర్వాత 'ఆది' సినిమాతో దర్శకుణ్ణి అయ్యాను. చంద్ర మహేష్ నాకు చాలా ఇష్టమైన వ్యక్తి. సుప్రసిద్ధ నిర్మాత డి. ఇష్టమైన దర్శకుల్లో చంద్ర మహేష్ ఒకరు. ఆయన యూత్ ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్‌గా మూడు విభిన్న ప్రేమ కథలతో 'పితాపురంలో' చిత్రాన్ని రూపొందించారు. ఈ సినిమా పెద్ద హిట్టు కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. అలాగే నిర్మాతలకు మంచి లాభాలు రావాలని ఆకాంక్షిస్తున్నాను' అని చెప్పారు. దర్శకుడు చంద్ర మహేష్ మాట్లాడుతూ 'ఈ వారంలో ఈ సినిమా ట్రైలర్ విడుదల చేస్తున్నాం. ఏప్రిల్లో చిత్రాన్ని విడుదల చేస్తాం. నా కెరీర్‌లోనే ఇదొక మంచి సినిమాగా నిలిచిపోతుంది' అని తెలిపారు.

---

## పార్టీ మార్పు యోచన

(మొదటి పేజీ తరువాయి)

ఏ పార్టీలో ఉన్నారో స్పష్టం చేసి మాట్లాడాలని హితవు పలికారు. తనతో కలిసి పనిచేయాలని సంజయ్ కుమార్ మాట్లాడం చూస్తుంటే అసలు ఆయనది ఏ పార్టీ అని ప్రశ్నించారు. స్పీకర్ బిఆర్‌ఎస్‌లోనే ఉన్నారని అంటున్నారని, సంజయ్ కుమార్ మాత్రం ఏ పార్టీలో ఉన్నారో ఆయనకే తెలియదన్నారు. కాంగ్రెస్ పార్టీతో తనకు 40 ఏళ్ల బంధం ఉందని, అయితే ఎంతో ఒత్తిడి ఉంటే తప్ప పార్టీ మార్పుపై ఆలోచన చేస్తున్నాననో అర్థం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ అంతర్గత వ్యవహారాల్లోకి సంజయ్ కుమార్ రావడంతోనే జగిత్యాల కాంగ్రెస్‌లో చిచ్చు రేగిందన్నారు. 2014లో ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తాను ప్రజల హక్కుల కోసం పోరాడనని గుర్తుచేశారు. కానీ జగిత్యాల ఎమ్మెల్యే మాత్రం ప్రజల అభివృద్ధి హక్కును సాధించలేకపోతున్నారన్నారు. రాజ్యాంగ బద్ధంగా వ్యవహరించాలే తప్పా వక్రమార్గన వెళితే ప్రజలు హర్షించరన్నారు.

ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కొత్త మోహన్, బండ శంకర్, జున్ను రాజేందర్, సామల రాజశేఖర్, కల్లెపెల్లి దుర్గయ్య, నేహాల్, గుగ్గిల్ల హరీష్, పుప్పాల అశోక్, తొపారపు రజనీ కాంత్, మామిడిపెల్లి మహిపాల్, శ్రీరాముల గంగాధర్ తదితరులు ఉన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

### ఇఫ్తార్ వేడుకలు సామరస్యానికి నిదర్శనం

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, వారి సమస్యల పరిష్కారానికి సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. రంజాన్ మాసం క్రమశిక్షణ, సహనం, సేవా భావం, మానవత్వానికి ప్రతీకమని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (టియుడబ్ల్యుజె), తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టియుడబ్ల్యుజెఎఫ్) సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో మంగళశారం నిర్వహించిన 'దావత్ ఏ ఇఫ్తార్' కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వారు వారధిలా పని చేస్తున్నారని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నా రు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్ విషయంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా, అక్రిడిటేషన్ కమిటీలో జర్నలిస్టుల సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. అలాగే ఇళ్ల స్థలాల కేటాయింపు, హెల్త్ కార్డుల మంజూరు వంటి అంశాల్లో కూడా సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.



తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దేశంలోని ప్రస్తుత పరిస్థితులు సమాజంలోని ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి చేస్తున్న ప్రయత్నాలు పెరిగిపోతున్నాయన్నారు. ఇలాంటి చర్యలను అరికడుతూ సమాజమంతా ఐక్యంగా ఉందని చాటిచెప్పేందుకు మనమంతా ఐక్యంగా ముందుకు పోవాల్సిన అవసరం ఉందన్నారు. 'జనగణమన' గీతం జాతీయ గీతమని స్పష్టం చేశారు. రంజాన్ ఉపవాసాలతో శరీరాలకు సౌకర్యాన్ని, ఆరోగ్యాన్ని కలిగిస్తుందన్నారు. ఇలాంటి పండుగలకు ఇఫ్తార్ పేరుతో ఇతర మతస్తులను ఆహ్వానించి సోదర భావాన్ని పెంపొందించుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు.

ఐజెయు మాజీ అధ్యక్షులు దేవులపల్లి అమర్ మాట్లాడుతూ భారతదేశంలో కూడా మతాలను వేరు చేసి, మతం పేరు మీద మనుషులను వేరు చేసే ప్రయత్నాలు, అటు వైపుగా పోతున్న పరిస్థితులు చూసి మనలాంటి వాళ్లం ఆందోళన చెందుతున్న సమయంలో మతాల మధ్య సంబంధాలు, స్నేహభావాలు పెంపొందించడానికి ఇఫ్తార్ కార్యక్రమాలు చాలా అవసరమని నొక్కి చెప్పారు. కార్యక్రమంలో సుల్తాన్ ఉల్ ఉలూమ్ విద్యా సంస్థల కార్యదర్శి జఫర్ జావేద్, పిస్తా హౌస్ సిఇఒ మాజీద్, టియుడబ్ల్యుజె అధ్యక్షులు కె.విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె.రామనారాయణ, కార్యవర్గ సభ్యులు బొమ్మగాని కిరణ్‌కుమార్, టియుడబ్ల్యుజెఎఫ్ అధ్యక్షులు ఎం.ఎ.మజీద్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ మొహియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.9 లక్షల డ్రగ్స్ పట్టివేత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మేడ్చల్ జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు రెండు వేర్వేరు కేసుల్లో భారీగా మాదకద్రవ్యాలను పట్టుకున్నారు. మొత్తం రూ.9 లక్షల విలువైన 76.77 గ్రాముల కోకైన్, 200 గ్రాముల ఒజి కుష్ (హైబ్రిడ్ గంజాయి) స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ షేక్ ఫయాజుద్దీన్ వెల్లడించారు. సుచిత్ర సర్కిల్ పరిధిలో రూట్ వాచ్ నిర్వహించిన సమయంలో 76.77 గ్రాముల కోకైన్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఇంజోత్‌సింగ్ నాగ్‌పాల్ (27)ను అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద ఉన్న కారును కూడా సీజ్ చేశారు. విచారణలో, ముంబైలోని బోబ్రిలీ కేఫ్ వద్ద అబ్‌డుజ్ అనే వ్యక్తి నుంచి ఈ కోకైన్‌ను తెచ్చుకున్నట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. టెలిగ్రామ్ యాప్ ద్వారా డ్రగ్స్ విక్రయిస్తున్నాడన్న సమాచారంతో హస్మత్‌పేట్ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించిన అధికారులు, మన్‌ప్రీత్ సింగ్ (35)ను అదుపులోకి తీసుకున్నారు.అతని వద్ద 200 గ్రాముల ఒజి కుష్ స్వాధీనం చేసుకున్నారు. ఈ డ్రగ్స్‌ను తమిళనాడులోని పాట్యాల అనే వ్యక్తి సరఫరా చేసినట్లు విచారణలో వెల్లడైంది. కోకైన్ కేసు నిందితుడిని కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ స్టేషన్‌కు, ఒజి కుష్ కేసు నిందితుడిని బాలనగర్ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ దాడుల్లో ఎఇఎస్ మాధవయ్య, డిటిఎఫ్ సిఐ నర్సిరెడ్డి, ఎస్ఐ పవన్ కుమార్ రెడ్డి సహా సిబ్బంది వెంకటేశ్వర్‌రావు, చెన్నయ్య, శ్రీనివాస్, జ్యోతి, తేజ, మునాఫ్‌లు పాల్గొన్నారు.

## సిట్ ఏర్పాటు

(మొదటి పేజీ తరువాయి)

రానున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్న మొయినాబాద్ డ్రగ్ పార్టీ కేసు విచారణ కోసం ఏర్పాటైన సిట్ దూకుడు పెంచింది. ఈ కేసులో మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో మొత్తం 11 మందిపై కేసు నమోదవగా వీరిలో 8 మందికి స్టేషన్ బెయిల్ ఇచ్చారు. వీరిని మంగళవారం వీరిని శంషాబాద్ రూరల్ పోలీసు స్టేషన్‌లో సిట్ విచారించింది. నిందితుల నుంచి పలు కీలక సమాచారం రాబట్టే ప్రయత్నం చేసింది. ఈ ఫామ్ హౌస్‌లో డ్రగ్స్ పార్టీలలో చాలా విషయాలు తెలుసుకోవాల్సి ఉందని, పార్టీ కోసం బెంగళూరుకు చెందిన వ్యాపారవేత్తలు, అడ్వకేట్లు ఎందుకొచ్చారు? అనే కోణంలో సిట్ దృష్టి సారించింది. ఈ పార్టీ వెనుక పెద్ద బిజినెస్ డీల్ ఉందనే ప్రచారం జరుగుతుండగా సిట్ సైతం అదే కోణంలో దర్యాప్తు వేగవంతం చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది.

**వెలుగులోకి సంచలనాలు?..** మొయినాబాద్ ఫామ్హౌస్ డ్రగ్స్ వ్యవహారంలో రోజురోజుకు కొత్త ట్విస్టులు తెరమీదకు వస్తున్నాయి. ఈ పార్టీ వెనుక దుబాయ్ కనెక్షన్లు ఉన్నాయని, డ్రగ్స్ వ్యాపార కోణం ఉందనే చర్చ జరుగుతోంది. అలాగే రాజకీయ ప్రముఖుల ఇన్వాల్వ్ మెంట్ ఉండటంతో కేసు దర్యాప్తులో చివరాఖరికి ఏం తేలబోతోంది అనేది సర్వత్రా ఆసక్తిగా మారింది.

---

## ఢిల్లీ వెళ్లలేదా? (మొదటి పేజీ తరువాయి)

ఎంఎల్‌ఎ కె.టి.రామారావు కాంగ్రెస్ నాయకుల ఢిల్లీ పర్యటనను ప్రస్తావించారు. ఇందుకు మంత్రి శ్రీధర్‌బాబు పైవిధంగా స్పందించారు. కాంగ్రెస్ జాతీయ పార్టీ అని ఢిల్లీ నుంచే రాజకీయం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. కెటిఆర్ ఎవరో రాసిన స్క్రిప్ట్‌ను ఇక్కడ చదివి వినిపిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రయోజనాల గురించి ఢిల్లీకి వెళ్లకుండా జిడ్డు రాజకీయం చేయాలా? రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం తాము ఒక మెట్టు దిగైనా ప్రయత్నిస్తామని, కేంద్రం సహకరిస్తుందా? నిధులను మంజూరు చేస్తుందా? లేదా అనేది వారిష్టం అని అన్నారు. తమది ఫ్లాప్ అయిన సినిమా కాదని, 2023 శాసనసభ ఎన్నికలు, ఆ తర్వాత జరిగిన లోక్‌సభ, అనంతరం సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ ఫ్లాప్ అయిందని మంత్రి ఎద్దేవా చేశారు. ఇకనైనా వాస్తవాలు మాట్లాడితే వచ్చే ఎంపిటిసి, జెడ్‌పిసిటి ఎన్నికల్లోనైనా కనీసం ఫ్లాప్ నుంచి తప్పించుకుని, కాస్త మెరుగుపడే అవకాశం ఉంటుందని శ్రీధర్‌బాబు సూచించారు.

**తెలంగాణ సొమ్ముతో ఢిల్లీ పర్యటనలా? : కెటిఆర్**

అంతకుముందు బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ కెటిఆర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సొమ్ముతో మంత్రులు ఢిల్లీ పర్యటనలు చేస్తున్నారని, తెలంగాణ జనం సొమ్ముతో ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారాలు నిర్వహిస్తున్నారని, ఢిల్లీలో మంత్రివర్గ సమావేశాన్ని నిర్వహించారని కెటిఆర్ ఆరోపించారు. జరగనివి జరిగినట్టు, చేయనవి చేసినట్టుగా అంతా కనికట్టు చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్లాప్ అయిన సినిమా అని కెటిఆర్ ఎద్దేవా చేశారు.

## డ్రగ్స్ పరీక్షకు సిఎం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

సవాల్ విసిరారు. శాసనమండలి సమావేశాలు మంగళవారం చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని మహేష్ కుమార్ గౌడ్ ప్రవేశపెట్టారు. తీర్మానంపై చర్చ సందర్భంగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్‌ఎస్, బిజెపి సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. చర్చను బి.మహేశ్ కుమార్ గౌడ్ ప్రారంభిస్తూ డ్రగ్స్ అంశంపై చేసిన వ్యాఖ్యలు సభలో తీవ్ర దుమారం రేపాయి. మాజీ సిఎం కెసిఆర్ పేరును ప్రస్తావిస్తూ మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలపై చైర్మన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. సభలో లేని వ్యక్తుల పేర్లు ప్రస్తావించవద్దని సూచించడంతో మహేశ్ కుమార్ గౌడ్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నారు. అనంతరం కాంగ్రెస్ ఎంఎల్‌సిలు అద్దంకి దయాకర్, డాక్టర్ బల్మూర్ వెంకట్ తీర్మానాన్ని బలపరుస్తూ ప్రభుత్వ కార్యక్రమాలను వివరించారు. అద్దంకి దయాకర్ మాట్లాడుతూ రూ.2 లక్షల రుణమాఫీని ఏక కాలంలో పూర్తి చేశామని, సన్న వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్నామని తెలిపారు. రైతు భరోసా కింద ఇప్పటికే రూ.19వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ బలోపేతానికి రూ.1000 కోట్లు కేటాయించామని, ప్రతి నియోజకవర్గంలో సమీకృత గురుకులాల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. బల్మూరి వెంకట్ మాట్లాడుతూ పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని, వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుల పునరుద్ధరణతో పాటు బాసర నుండి భద్రాచలం వరకు టెంపుల్ టూరిజం సర్క్యూట్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కాంగ్రెస్ 5 గ్యారంటీలను అమలు చేస్తున్నప్పటికీ ప్రతిపక్షాలకు కనిపించకపోవడం విచారకరమన్నారు. బిఆర్‌ఎస్ పక్ష నాయకులు సి.మధుసూదనాచారి, బిజెపి సభ్యులు ఎ.వి.ఎన్. రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఇస్తామన్న రూ.2500 నగదు ఎందుకు ఇవ్వడం లేదని, ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత ఏమైందని మధుసూదనాచారి ప్రశ్నించారు. విత్తనాలు, ఎరువుల సరఫరాలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చివేయడం అన్యాయమని, దీనిపై స్పష్టమైన విధానం ఉండాలని బిజెపి సభ్యులు ఎ.వి.ఎన్.రెడ్డి డిమాండ్ చేశారు. పెన్షన్ బకాయిల విడుదల, డిఎస్‌సి ప్రక్రియ వేగవంతం, జాతీయ విద్యా విధానం2020 అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

## సస్పెన్షన్ ఎత్తివేత

(మొదటి పేజీ తరువాయి)

కిరణ్ రిజిజు అన్నారు. దీనికి అధికార, ప్రతిపక్ష బెంచీలు రెండూ అంగీకరించాయి. సభ లోపల లేదా పార్లమెంట్ ప్రాంగణంలో ఎలాంటి ప్లకార్డులు, పోస్టర్లు, ఫోటోలు లేదా ఎఐ రూపొందించిన చిత్రాలను ప్రదర్శించకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందని స్పీకర్ బిర్లా అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన అమెరికా పార్లమెంటులో కార్యకలాపాలు సజావుగా సాగాలని, ప్రతిఒక్కరూ సహకరించాలని అందరూ భావిస్తున్నారని బిర్లా అన్నారు. అనంతరం ఏడుగురు కాంగ్రెస్ ఎంపిలు, ఒక సిపిఐ(ఎం) సభ్యుడి సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కోరుతూ రిజిజు ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, అది మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. సస్పెండ్ అయిన ఎంపిలలో కాంగ్రెస్‌కు చెందిన గుర్జీత్ సింగ్ ఔజ్లా, హిబి ఈడెన్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, అమరీందర్ సింగ్ రాజా వారింగ్, మణికం టాగోర్, ప్రశాంత్ పడోలే, డీన్ కురియాకో సిపిఐ(ఎం)కి చెందిన ఎస్. వెంకటేశన్ ఉన్నారు. సస్పెన్షన్ ఎత్తివేయడానికి ముందు సురేష్ వాదన తర్వాత, సమాజ్‌వాదీ పార్టీ సభ్యుడు ధర్మేంద్ర యాదవ్ ఈ చర్యను సమర్థిస్తూ, పార్లమెంటు అత్యున్నత ప్రమాణాలను కాపాడటంలో తమ పార్టీ సహకరించడానికి సిద్ధంగా ఉందని అన్నారు. 'సభ గౌరవానికి భంగం కలిగించే ఏ పనీ మేము చేయబోమని సభకు హామీ ఇస్తున్నాను. అయితే, అధికార కూటమి సభ్యులు కూడా సరిగ్గా ప్రవర్తించాలి' అని యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన బిజెపికి చెందిన నిషికాంత్ దుబే పేరును ప్రస్తావిస్తూ, 'తనను తాను సరిదిద్దుకోవాలి' అని కోరారు. తన 17 ఏళ్ల పార్లమెంటరీ ప్రస్థానంలో సభ గౌరవాన్ని దిగజార్చే పని ఏదీ తాను చేయలేదని చెబుతూ, దుబే వెంటనే యాదవ్ వ్యాఖ్యలను ఖండించారు. సమాజ్‌వాదీ పార్టీ ఎంపి చేసిన వ్యాఖ్యలకు గాను, ఆయన క్షమాపణ చెప్పాలని కూడా దుబే డిమాండ్ చేశారు. సభ సజావుగా సాగేలా చూసేందుకు అధికార, ప్రతిపక్ష సభ్యులు ఇరువురూ కృషి చేయాలని ఎన్‌సిపి నాయకురాలు సుప్రియా సూలే అన్నారు. 'ఎవరూ ఎవరిపైనా వ్యక్తిగత వ్యాఖ్యలు చేయకూడదు. మేము (ప్రతిపక్షం) అధికార పక్షాన్ని గౌరవించాలి. అలాగే అధికార పక్షం కూడా ప్రతిపక్షాన్ని గౌరవించాలి. ఇరుపక్షాల మధ్య ఒక 'లక్ష్మణ రేఖ' ఉండాలి. దానిని ఎవరూ దాటకూడదు' అని ఆమె పేర్కొన్నారు. సభ సజావుగా సాగాలని, ఇరుపక్షాలు సహకరించుకోవాలని జెడియు నాయకుడు, కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ అన్నారు. అధికార కూటమి సభ్యులు నిబంధనలను ఉల్లంఘించరని, గతంలోనూ తాము ఎప్పుడూ నిబంధనలను ఉల్లంఘించలేదని రిజిజు తెలిపారు. కాగా, సోమవారం నుండి ప్రతిపక్ష సభ్యులు ఎటువంటి ప్లకార్డులు లేదా బ్యానర్లను ప్రదర్శించలేదని, సభ సక్రమంగా పనిచేయడానికి సహకరించడానికి తాము సిద్ధంగా ఉన్నామని సురేష్ తెలిపారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com